అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 06-4-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 46 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



పేద మహిళలకు ఏటా రూ.లక్ష

రైతులకు కనీస మద్దతు ధర

- ఉపాధి హామీ రోజువారి వేతనం రూ.400కు పెంపు
- యువతకు 30 లక్షల ఉద్యోగాల కల్పన
- రూ.5 వేల కోట్లతో యువతకు స్టార్టప్ ఫండ్
- అగ్నివీర్ పథకం రద్దు • రైల్వేల ప్రయివేటీకరణ నిలిపివేత
- రైల్వే చార్జీల తగ్గింపు, వృద్ధులకు రాయితీ
- పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు : కాంగ్రెస్ న్యాయ్‌పత్ర-2024 ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల

3లో..

నేడు కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

- పది లక్షల మందితో తుక్కుగూడ జన జాతర
- ఐదుగ్యారంటీలతో దేశ ప్రజలకు భరోసా 11లో..



కవితపై సీబీఐ

విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించేందుకు అనుమతి కోరుతూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు న్యాయస్థానం సమ్మతించింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా కవిత తీహార్ జైలులో ఉన్నందున ఆమెను ప్రశ్నించే ఒక రోజు ముందు జైలు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. ప్రశ్నించే సమయంలో ...11లో



'హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం ఐపీఎల్ మ్యాచ్‌లో సీఎం రేవంత్ రెడ్డి నటుడు వెంకటేష్ పలకరింపు'

పోలింగ్ శాతాన్ని పెంచండి

గతంలో తక్కువ పోలింగ్ నమోదైన 266 స్థానాల గుర్తింపు

- ప్రత్యేక చర్యలతో ఓటింగ్ శాతం పెంచాలని నిర్దేశం



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే గత లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన 266 స్థానాలను గుర్తించింది. తెలంగాణ సహా ఆయా రాష్ట్రాల్లోనూ జాతీయ సగటు (67.40) కంటే తక్కువ పోలింగ్ నమోదైంది. దీంతో ఈసారి అక్కడ ఓట్ల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఈసీ ముందడుగు వేస్తోంది. సంబంధిత నియోజకవర్గాల సిబ్బందితో శుక్రవారం ఢిల్లీలో సమావేశమైన ఈసీ అధికారులు.. ఓటరు భాగస్వామ్యాన్ని పెంచేందుకు వ్యూహరచన చేశారు. 2019లో తెలంగాణ, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్, జమ్మూ-కశ్మీర్, ఝార్ఖండ్‌లో పోలింగ్ శాతం.. జాతీయ సగటు 67.40 శాతంతో పోలిస్తే తక్కువగా నమోదైంది. మొత్తం 266 నియోజక వర్గాల్లో తక్కువ ఓటింగ్ నమోదు కాగా.. వాటిలో 215 గ్రామీణ, 51 పట్టణ ప్రాంత స్థానాలు ...11లో

తెరపై కాషాయం


సినిమాలే ప్రచారాస్త్రాలు

బీజేపీ నాయకులు, సంబంధిత వ్యాపారుల ఫండింగ్



కొన్ని రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ.. ప్రజలకు ఏం చేసిందో, ఏమి చేయబోతుందో చెప్పి, మ్యానిఫెస్టోలో హామీల ఆధారంగా ప్రజల ఓట్లను పొందే ప్రయత్నం చేయాలి. కానీ బీజేపీ ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. విద్వేషాన్ని, విషాన్ని చిమ్మే చలనచిత్రాలపై ఆధారపడుతున్నది. తనకు ప్రధాన ఆయుధమైన 'హిందూత్వ' అంశానికి 'జాతీయత' అనే భావోద్వేగాన్ని ముడిపెట్టి, చరిత్రను, వాస్తవాలను వక్రీకరిస్తూ సినిమాలను నిర్మించి ప్రజల్లోకి ఒదులుతున్నది.

- విషం చిమ్ముతున్న 'హిందూత్వ' చిత్రాలు
- కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం యాక్టింగ్ కూడా వారే
- ప్రజల మెదళ్లలో విష బీజాలు నాటే ప్రయత్నాలు
- లోక్‌సభ ఎన్నికల్లో లబ్ది పొందే కుయుక్తులు
- వివాదాస్పద అంశాలే ముడిసరుకుగా సినిమాలు
- అలాంటి సినిమాలకు బీజేపీ ప్రభుత్వాల ప్రచారాలు.. రాయితీలు



న్యూఢిల్లీ : బీజేపీ ప్రాయోజిత వివాదాస్పద చిత్రాలు గత 2019 లోక్‌సభ ఎన్నికల ముందు నుంచీ ఉన్నాయి. 2021 నుంచి ఈ ట్రెండ్ మరింత ఎక్కువైంది. ఈ చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, యాక్టింగ్‌తో పాటు నిధులను సమకూర్చి నిర్మాతలుగా మారుతున్నదీ బీజేపీ, దాని అనుకూల నాయకులే కావటం గమనార్హం. దేశంలోని అన్ని సమస్యలకు కాంగ్రెస్, లెఫ్ట్ వంటి పార్టీలు, వాటి అనుబంధ సంఘాలే కారకులుగా, ...2లో

కష్టజీవుల గొంతుకనవుతా

పోరాడే చేతికే ఓటు ఆయుధం ఇవ్వండి

ఆమరణ నిరాహార దీక్ష చేసైనా మూసీని శుద్ధి చేయిస్తా : భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్



నవతెలంగాణ-నకిరేకల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే వారి చేతికే ఆయుధం ఇవ్వాలని భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ ప్రజలను కోరారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్రను చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు డబ్బు విషయంలో మెరిట్‌గా ఉంటారని, సీపీఐ(ఎం) అభ్యర్థిగా తాను నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై అవగాహనతోపాటు వాటి పరిష్కారం కోసం పోరాడేతత్వంలో మెరిట్‌గా ఉంటానని అన్నారు. 35 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ప్రజాసమస్యలపై పనిచేసిన అనుభవం తనకుందని తెలిపారు. తనను గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం లో దశాబ్దాలుగా ఇరిగేషన్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారినా.. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పూర్తి చేస్తామంటున్నారు కానీ.. ఎప్పటిలోగా చేస్తారో చెప్పగలరా అని ప్రశ్నించారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఎందుకు పెండింగ్‌లో ఉందో చెప్పాలన్నారు. జనగామ దేవాదుల కాలువ నిర్మాణం 30 ఏండ్లు గడుస్తున్నా పూర్తి కాలేదన్నారు. 23 ఏండ్లు గడుస్తున్నా బస్వాపూర్ ప్రాజెక్టు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరు గంధమల్ల ప్రాజెక్టు ఎటు పోయిందని ప్రశ్నించారు.

పరిశ్రమల కాలుష్యంతో ...3లో

దేశ సమైక్యతను దెబ్బతీస్తున్న బీజేపీ

- పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి
- ప్రజల కోసం పాటుపడే సీపీఐ(ఎం)ను గెలిపించండి వివరాలు 3లో..
- పోరాడే నాయకుడు ఎండీ జహంగీర్ : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

సర్కారు అసమర్థత వల్లే కరువు

పంటలు ఎండుతున్నయ్..గొంతులు తడారుతున్నాయ్

- తొండిపెట్టి కొద్దిపాటి రైతులకే సాయం
- తప్పించుకుందామంటే.. మీ వీపులు విమానం మోతమోగిస్తరు
- చేనేతలకు క్షమాపణలు చెప్పాలే.. లేకుంటే వారితో చెప్పుదెబ్బలు తప్పవు
- ఎన్నికల తరువాత 10వేల మందితో మేడిగడ్డ ముట్టడి : ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆగ్రహం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎండిన పంటల పరిశీలన




నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / సిరిసిల్ల / బోయిన్‌పల్లి

'నిండు జలాలతో కళకళలాడిన రాష్ట్రంలో ఎందుకు ఈ పరిస్థితులు వచ్చినయ్? కాంగ్రెస్ ప్రభుత్వం తెలివి తక్కువ, అసమర్థ, అవివేక, చవట విధానాల వల్ల ఈ దరిద్రం వచ్చింది. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస, ఏ ఏడుపు, ఏ బాధ, ఏ మంచి నీళ్ల ట్యాంకర్లు, ఏ బిందల కొట్లాటలు, కాలిపోయిన మోటర్లు కనబడుతుండెనో ఇప్పుడు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కచ్చితంగా కాంగ్రెస్ తెచ్చిన కరువే!' అని మాజీ ముఖ్యమంత్రి ...11లో

తొలితరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూత

సంతాపం తెలిపిన సీఎం రేవంత్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తదితరులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు ప్రజలందరికీ సుపరిచితులైన తొలి తరం న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురైన ఆయన్ను హైదరాబాద్ యశోదా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం ఆయన ...2లో

త్వరలో నేతన్న భరోసా

వారి దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం | ప్రభుత్వ ఆర్డర్లన్నీ టెస్కో ద్వారానే...

- బతుకమ్మ చీరలకు నిధులివ్వని బీఆర్ఎస్ సర్కార్ • 30 శాతం బోగస్ సొసైటీలకే బిల్లులు చెల్లింపు
- గత నవంబర్ నాటికే రూ.488 కోట్ల బకాయిలు • ప్రాథమిక విచారణలో గత ప్రభుత్వ నిర్వాకాలు వెలుగులోకి..

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నేత కార్మికుల స్వయం సమృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'నేతన్న భరోసా' అనే కొత్త విధానానికి రూపకల్పన చేస్తున్నది. చేనేత, మరమగ్గాల కార్మికులకు దీర్ఘకాలిక లబ్ది చేకూరేలా కొత్త పథకం ఉండాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారుల్ని ఆదేశించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు, హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణ, కొత్త పవర్ లూమ్ క్లస్టర్ల అభివృద్ధి, మైక్రో హ్యాండ్లూమ్ క్లస్టర్స్ ఏర్పాటు, నేషనల్ సెంటర్ ఫర్ డిజైన్స్ ఏర్పాటు, స్టేట్ టెక్నికల్ టెక్స్‌టైల్ పాలసీ తీసుకురావాలని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాలను ఈ కొత్త విధానానికి అనుసంధానం చేస్తూ, పాత బకాయిలు కూడా వసూలు చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో బతుకమ్మ చీరల పథకాన్ని వ్యాపారంగా మార్చిందనే అభిప్రాయం ఉంది. ఈ వ్యాపారంలో 2023 నవంబర్ నాటికే దాదాపు రూ.488.38 కోట్లు బకాయిలను టెస్కోకు చెల్లించాల్సి ఉంది. వీటిలో గత ఏడాది అక్టోబర్‌లో పంపిణీ చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి రూ. 351.52 కోట్ల బకాయిలు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గడిచిన మూడు నెలల్లో సమగ్ర శిక్షా అభియాన్ యూనిఫామ్స్ సరఫరా కోసం దాదాపు రూ. 47 కోట్లు అడ్వాన్సుగా చెల్లించింది. నూలు కొనుగోలు, సైజింగ్‌కు అవసరమైన నిధులు విడుదల చేసింది. మాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లు, సైజింగ్ యూనిట్లకు అడ్వాన్సులు చెల్లించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేనేత సహకార సంఘాలను విస్మరించి మాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించిన విషయం తెలిసిందే. దీనివల్ల అసలైన కార్మికులకు లబ్ధి చేకూరలేదనీ,. వ్యాపారులు, దళారుల జోక్యం మితిమీరిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో 393 చేనేత సహకార సంఘాలు ఉంటే, కేవలం 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పని కల్పించినట్టు ప్రస్తుత ప్రభుత్వ విచారణలో వెల్లడైంది. ఇందుకు భిన్నంగా అన్ని చేనేత సంఘాలకు పనికల్పించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు దాదాపు రూ. 53 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసి, గతంలో చేనేత సహకార సంఘాలకు పెండింగ్‌లో ఉన్న రూ.8.81 కోట్ల బకాయిలను కూడా విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని పేర్కొంటూ మార్చి 11వ తేదీ జీవో నెం.1 ని ...2లో

7నుంచి వానలు

నేడు, రేపు వడగాలులు

వాతావరణశాఖ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందనీ, అదే సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అదే సమయంలో తీవ్ర వేడితో పాటు తేమ వల్ల అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే ప్రమాదముందని సూచించింది. అయితే, భానుడు భగభగతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి ...11లో

ఏడోసారి వడ్డీ రేట్లు యథాతథం

ముంబయి : హెచ్చు వడ్డీ రేట్ల నుంచి ఈ దఫా అయినా ఉపశమనం లభిస్తుందని ఆశించిన రుణ గ్రహీతలకు ఆర్బీఐ నిరాశనే కల్పించింది. వరుసగా ఏడో సారి కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటును 6.5 శాతంగానే కొనసాగిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మూడు రోజుల పాటు సాగిన ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) భేటీ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ వివరాలను శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని ద్రవ్య పరపతి కమిటీ ఉంచేందుకు ద్రవ్య పరపతి కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిణామక్రమానికి ఆర్బీఐ ప్రయాణానికి దగ్గరి సంబంధం ఉందన్నారు. సంస్థపై ఉన్న బహుళ బాధ్యతలను నిర్వర్తిస్తూనే కొత్త సవాళ్లు, అంశాలను స్వీకరిస్తామన్నారు. కొత్త ఆవిష్కరణల కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఆర్బీఐ ఇటీవలే 90వ వార్షికోత్సవం నిర్వహించుకున్న నేపథ్యంలో వ్యాఖ్యానించారు. ఆర్థిక వృద్ధి గాడిలో పడిందని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో 5.7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం.. గడిచిన జనవరి, ఫిబ్రవరి నెలల్లో 5.1 శాతానికి తగ్గిందన్నారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫిబ్రవరిలో ఆహార ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరిగింది. ద్రవ్యోల్బణ పెరుగుదలపై ఆర్బీఐ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో భారత వృద్ధి రేటు 7 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. ప్రస్తుత జూన్ త్రైమాసికంలో 7 శాతం, సెప్టెంబరులో 6.9 శాతం, మూడు, నాలుగు త్రైమాసికాల్లో 7 శాతం చొప్పున వృద్ధి రేటు ఉండొచ్చన్నారు. ప్రపంచ వృద్ధి పుంజుకుంటోందన్నారు. ముడి చమురు ధరల పెరుగుదలను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబల్ జీడీపీలో రుణాల నిష్పత్తి అధికంగా ఉండటంతో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలపై దాని ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. గ్రామీణ డిమాండ్ పుంజుకుంటోందన్నారు. ఇది 2024-25లో ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని దాస్ విశ్వాసం వ్యక్తం చేశారు.

పెరిగిన పసిడి నిల్వలు..

ఆర్బీఐ వద్ద బంగారం నిల్వలు భారీగా పెరిగాయి. మార్చి 2022 నాటికి విదేశీ మారక నిల్వల్లో 51.487 బిలియన్ డాలర్ల విలువైన బంగారం ఉంది. మార్చి 2023 నాటికి ఉన్న విలువతో పోలిస్తే 6.287 బిలియన్ డాలర్లు అధికంగా నమోదయ్యింది. గడిచిన ఒక్క జనవరిలోనే 8.7 టన్నుల బంగారాన్ని ఆర్బీఐ కొనుగోలు చేసింది.

ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు సులభం..

సాధారణ వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతంగా అంచనా వేశారు. 2023లో భారత రూపాయి అత్యల్ప ఒడుదొడుకులను చవి చూసిందన్నారు. ప్రభుత్వ బాండ్లు లేదా సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టడం మరింత సులువు కానుందని దాస్ తెలిపారు. రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కొత్తగా ఓ మొబైల్ యాప్ అందుబాటులోకి తేనున్నామన్నారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను 2021 నవంబర్‌లో ప్రారంభించిందని.. ప్రస్తుతం ప్రైమరీ, సెకండరీ మార్కెట్ ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేయవచ్చన్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు వేలంలో ఈ సెక్యూరిటీలను అమ్మడం లేదా కొనడం చేయవచ్చన్నారు. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి రూ.14.13 లక్షల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నార

సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ

- కార్మిక కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల మేరకు బకాయిలు చెల్లించలేదని విమర్శించింది. రానున్న రోజులకు అవసరమైన ఆర్డర్లు కూడా ఇంతవరకు ఇవ్వలేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా ఈ ఉత్పత్తులు చేయలేమంటూ యజమానులు చేతులెత్తేశారని పేర్కొన్నారు. 30 వేల కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం జోక్యం చేసుకుని సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమను, 30 వేల కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ నిర్ణయాలే వస్త్ర పరిశ్రమకు ఉరితాడు

ఒకవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకం, మరోవైపు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన తప్పుడు నిర్ణయాలు, చేనేత పరిశ్రమ మీద కన్నెర్ర జేయడం వల్ల వస్త్ర పరిశ్రమకు ఉరితాడుగా మారాయని వీరయ్య విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ బోర్డును, చేనేత బోర్డును రద్దు చేసిందని తెలిపారు. చేనేత ఉత్పత్తుల మీద, వాటి ముడిసరుకుల మీద 12 శాతం జీఎస్టీని పెంచిందని పేర్కొన్నారు. ఫలితంగా వస్త్ర పరిశ్రమలో ఉన్న బడాబాబులను కాపాడుతున్నదని విమర్శించారు. చిన్న చిన్న టెక్స్‌టైల్ పరిశ్రమలను దెబ్బతీస్తున్నదని వివరించారు. ఇవన్నీ ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉరితాడుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల 'ఉరిసిల్ల'గా మారకుండా కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గత బకాయిలను చెల్లించి ప్రభుత్వంలో వివిధ శాఖలకు అవసరమైన వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లను వెంటనే సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తి సంస్థలకు ఇవ్వాలని సూచించారు. తద్వారా ఈ పరిశ్రమను కాపాడాలనీ, 30 వేల కార్మిక కుటుంబాల జీవితాలను ఆదుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలనీ, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీలకు.. అన్నీ బంద్..!

మండుటెండల్లో మగ్గుతూ కాయకష్టం చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే అన్ని సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం బంద్ చేసింది. ప్రతి ఏటా మార్చి ఒకటో తేదీ నుంచి వేసవిగా పరిగణించి ఎండల తీవ్రతను బట్టి జూన్ రెండో వారం వరకు వేసవి అలవెన్స్ ఇవ్వాలి. ఈ ఏడాది కొత్త సాఫ్ట్‌వేర్‌లో అనుసంధానం చేయకపోవడంతో చెల్లింపులు జరగట్లేదు. పనిముట్లకు ఇచ్చే పైసలు, కరువు భత్యం(టీఏ, డీఏ)ల చెల్లింపుల్ని కూడా నిలిపేశారు. కూలీలకు పెంచిన వేతనాల్లోనూ కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోంది. ప్రథమ చికిత్స కోసం ఏర్పాటు చేయాల్సిన మెడికల్ కిట్స్, విశ్రాంతి కోసం టెంట్లు, తాగునీటి సదుపాయాలూ లేవు.



కొత్త సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానం చేయని కేంద్రం

- టీఏ, డీఏల చెల్లింపుల్లేవు..
- పనిముట్లకు పైసలివ్వట్లే..
- వేతనం పెంపులోనూ తెలంగాణ పట్ల వివక్ష

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఎండాకాలంలో మట్టిగట్టిపడటంతో రోజంతా పనిచేసినా కూలీ గిట్టదు. గడ్డపార, పలుగు పట్టి ఎండల్లో ఎంత పనిచేసినా కొలతల్లో తక్కువే నమోదవుతుంది. పైగా ఎండల్ని తట్టుకుని కూలీలు రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేస్తారు. వడదెబ్బకు గురవుతూ అనారోగ్యం పాలవుతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎండల తీవ్రతను బట్టి రోజువారి కూలికి అదనంగా 30 శాతం వేసవి అలవెన్స్‌ను మార్చి ఒకటో తేదీ నుంచి చెల్లిస్తారు. ప్రస్తుతం రోజువారి కూలి రూ.300 చేశారు. దీనికి అదనంగా 30 శాతం అంటే రూ.90 కలిసి రూ.390 చొప్పున వేతనం చెల్లించాలి. ఏప్రిల్, మేతో పాటు జూన్ రెండో వారం వరకు ఎండల తీవ్ర ఉంటే అప్పటి వరకు కూడా వేసవి అలవెన్స్‌లు చెల్లించాలి. అయితే కేంద్ర ప్రభుత్వం వేసవి అలవెన్స్‌ను రద్దు చేసింది. అంతేకాదు, ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌నూ మార్పు చేసింది. కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి అలవెన్స్‌ల అనుసంధానం చేయలేదు. కరువు భత్యం కాలమ్స్ కూడా సాఫ్ట్‌వేర్‌లోనూ లేదు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఉపాధి కూలీలకు రోజుకు రూ.50 కోట్ల మేరకు వేసవి అలవెన్స్ అందకుండా చేశారు.

వేతనాల పెంపులోనూ వివక్ష

కూలి రేట్లను పెంచాలని కార్మికులు పోరాడిన ఫలితంగా కేంద్రం కొద్దిగా పెంచింది. అందులోనూ వివిధ రాష్ట్రాల మధ్య వ్యత్యాసం చూపుతూ కొసరేసినట్టుగా పెంచింది. రాష్ట్రంలో ఈజీఎస్ కింద పనిచేసే కూలీలకు రోజు కూలిని ఇతర రాష్ట్రాల కంటే చాలా తక్కువగా నిర్ణయించింది. రాష్ట్రంలోని కూలీలకు రోజుకు రూ.300 కూలిగా నిర్ణయించారు. ఇంతకుముందు రూ.272 మాత్రమే చెల్లించేది. అయితే కొంత పెంచింది నిజమే అయినప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోల్చితే మాత్రం తెలంగాణ కూలీలకు తక్కువ కూలి నిర్ణయించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పక్కనున్న కర్నాటకలో రూ.340, తమిళనాడులో రూ.319 చేయగా కేరళలో రూ.340, హర్యానలో రూ.374, గోవాలో రూ.356, పంజాబ్‌లో రూ.322 చొప్పున పెంచింది. ఐదారు రాష్ట్రాల కంటే తెలంగాణలో తక్కువ కూలిని ఖరారు చేసిన కేంద్ర ప్రభుత్వం కోట్లాది మంది గ్రామీణ కూలీలకు తీరని అన్యాయం చేసింది. పనిని కొలతలేసి వేతనం చెల్లిస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా సగటు కూలి రూ.175కు మించట్లేదు. తెలంగాణలోనూ రూ.350 వేతనం చెల్లించాలని ఈజీఎస్ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

పనిముట్లకూ పైసలిస్తలేరు

ఉపాధి హామీలో పనిచేసే కూలీలు ఉపయోగించే పనిముట్లను సాన పట్టేందుకు కూడా డబ్బులివ్వాల్సి ఉంటది. రోజూ పని చేయడం వల్ల గడ్డపార మొన అరిగిపోతది. దాన్ని సాన పట్టించుకోవాలి. అలాగే తట్టలు పాడవుతాయి. దాంతో ఖర్చుల కింద ఈజీఎస్ నిధుల నుంచే కూలీలకు గడ్డపారకు రూ.10, తట్టకు రూ.5, మంచినీళ్లకు రూ.5 చొప్పున చెల్లించాలి. ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లి కూలీలు పనిచేయాల్సి వస్తే ఆటో కిరాయిల కోసం రూ.20 చెల్లించాలని చట్టంలో పేర్కొనబడింది. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. కానీ.. కూలీలకు పనిముట్ల కోసం ఇవ్వాల్సిన డబ్బులేవీ ఇవ్వట్లేదు. అదే విధంగా కరువు భత్యం (టీఏ, డీఏ) కూడా చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని కూడా ఇవ్వకపోవడంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎండల్లో మండి చస్తున్నం : నర్సింహ, ఉపాధి కూలి

ఎండల్లో చస్తున్నం. పొద్దున పోయి ఎంత పనిచేసినా కూలి రూ.175కు మించి ఇస్తలేరు. ఎండల్లో కష్టపడుతున్నం. మాకు ఇచ్చే కూలి డబ్బులకు పైసల్లేవా..? పెద్దోళ్లకు అప్పులిచ్చి మాఫీ చేస్తరు. రెక్కలు ముక్కలు చేసుకునే మాబోటి పేదలకు కూలి ఇస్తేనే ఖజాన అయిపోతదా..? నీళ్లల్లేవు. నీడలేదు. మండుల్లేవు. మా గురించి పట్టించుకునేటోళ్లే లేరు. ఎండల్లో పనిచేసినన్ని రోజులు అదనంగా డబ్బులు కట్టివ్వాలి.



వేసవి అలవెన్స్‌లు చెల్లించాలి: రామచంద్రం, వ్యకాస జిల్లా అధ్యక్షులు

ఉపాధి కూలీలకు వేసవిలో ఇవ్వాల్సిన అలవెన్స్‌లు చెల్లించాలి. ఎండల తీవ్రత పెరిగింది. కూలీలు కష్టపడి పనిచేసినా కూలి రూ.175 కంటే ఎక్కువ ఇవ్వట్లేదు. పెంచిన వేతనానికి అదనంగా 30 శాతం వేసవి అలవెన్స్ కలిపి ఇవ్వాలి.

తొలితరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

కన్నుమూశారు. 1983 నవంబర్ 14న దూరదర్శన్ ఛానెల్‌లో శాంతి స్వరూప్ తెలుగులో తొలిసారి వార్తలు చదివారు. పదేండ్ల పాటు టెలీప్రాంటర్ లేకుండానే పేపర్ చూసి వార్తలు వినిపించారు. తన గాత్రం, వార్తల ప్రజెంటేషన్‌తో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. 2011లో పదవీ విరమణ చేసే వరకు ఆయన దూరదర్శన్‌లో పని చేశారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

వార్తలు తప్పులు లేకుండా, స్క్రిప్ట్‌ను చూడకుండా చదివేందుకు వీలుగా వాటిని కంఠస్థం చేసినట్టు పలు ఇంటర్వ్యూల్లో శాంతి స్వరూప్ స్వయంగా పేర్కొనడం విశేషం. శాంతిస్వరూప్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన మరణంతో తెలుగు మీడియా రంగం ఓ పెద్ద దిక్కును కోల్పోయింది.

ఆయన శైలి ప్రత్యేకం

తెలుగులో మొట్టమొదటి న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ పేరు చరిత్రలో నిలిచిపోయింది. వార్తలు చదవడంలో ఆయన శైలి ప్రత్యేకం. 80, 90 దశకాల ప్రేక్షకులకు నేటికి వార్తలంటే ఆయన పేరే గుర్తుకు రావడం సహజం. ప్రశాంతవదనం, స్పష్టమైన పద ఉచ్చారణ, గంభీరమైన కంఠంతో ఏమాత్రం తొణికిసలాడకుండా వార్తలు చదవడంలో శాంతి స్వరూప్‌ది ప్రత్యేక శైలి. నేడు వార్తలు చదువుతున్న ఎందరో న్యూస్ రీడర్లకు ఆయన ఆదర్శం. అంతలా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించారు. తెలుగు మీడియా రంగంలో ఆయన చెరిగిపోని ముద్ర వేశారు.

శాంతి స్వరూప్ మరణం బాధాకరం: సీఎం రేవంత్

శాంతి స్వరూప్ మరణం బాధాకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "1983 నుంచి న్యూస్ రీడర్‌గా శాంతి స్వరూప్ తనదైన ముద్ర వేశారు. సుదీర్ఘ కాలం పాటు దూరదర్శన్ ద్వారా ఆయన అందించిన సేవలు తెలుగు ప్రజలకు చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి" అని సీఎం తెలిపారు.

మీడియా రంగంలో చెరగని ముద్ర: కేసీఆర్

శాంతి స్వరూప్ మతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మీడియా రంగంలో శాంతి స్వరూప్ తనదైన ముద్ర వేశారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చాలా కాలం పాటు దూరదర్శన్‌లో వార్తలు చదివిన ఆయన న్యూస్ రీడర్‌గా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. శాంతిస్వరూప్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దిగ్భ్రాంతి కలిగించింది: చంద్రబాబు

శాంతి స్వరూప్ మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "తెలుగు దూరదర్శన్‌లో వార్తలు అనగానే మొదటగా గుర్తొచ్చేది శాంతి స్వరూప్ పేరే. నేను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేమిద్దరం కలిసి 'ప్రజలతో ముఖ్యమంత్రి' అనే కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించేవాళ్ళం. ఆరేండ్ల పాటు సాగిన ఈ కార్యక్రమంలో ప్రజలు నేరుగా తమ సమస్యలను చెప్పుకుని పరిష్కారం పొందేవారు.

ఈ విధంగా మా అనుబంధం సుదీర్ఘమైనది" అని ఆయన జ్ఞాపకాలను బాబు నెమరువేసుకున్నారు.

బాధాకరం: హరీశ్ రావు

శాంతి స్వరూప్ మరణం బాధాకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సంతాపం తెలిపారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు." తొలి తరం న్యూస్ రీడర్‌గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు తెలుగు ప్రజలకు చిరస్మరణీయం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి" అని హరీశ్ పేర్కొన్నారు.

ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాంతి స్వరూప్ మరణం పట్ల కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

త్వరలో నేతన్న భరోసా

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత ప్రభుత్వం జారీ చేసింది. దీనివల్ల టెస్కోలో లభ్యం కాని వస్త్రాలకు నాన్ ఎవైలబిలిటీ సర్టిఫికెట్ ఇస్తే తప్ప, ప్రయివేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది. ఈ మేరకు ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు వస్త్రాల సరఫరా కోసం టెస్కోకు రూ. 255.27 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్రంలో 140 మాక్స్ సొసైటీలు, 135 ఎస్ఎస్ఐ యూనిట్లు ఉన్నాయి. వీటి నుంచి గతంలో చేసిన కొనుగోళ్లు, చెల్లించిన బిల్లులు, వాటి విద్యుత్తు వాడకం పరిశీలిస్తే.. సుమారు 30 శాతం బోగస్ సొసైటీలే ఉన్నట్టు ఇటీవలే ప్రభుత్వం చేసిన ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీనిపై మరింత లోతైన దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది.

పప్పూయాదవ్ ఏడ్చేశారు !



పాట్నా : టిక్కెట్ ఆశించి దక్కకపోవడంతో మాజీ ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూయాదవ్ బోరున ఏడ్చేశారు. పూర్నియా లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగాలని ఆశించిన ఆయనకు 'ఇండియా' వేదిక సీట్ల సర్దుబాటుతో టిక్కెట్ దక్కలేదు. దీంతో ఆయన అదే స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి అనంతరం బావోద్వేగానికి గురయ్యారు. 'నాకు పదేపదే ఎందుకు టికెట్ నిరాకరిస్తున్నారు. నాకేం తక్కువ' అంటూ ఉద్వేగానికి గురయ్యారు.

బీహార్ రాజకీయాల్లో పప్పూయాదవ్ పేరు సుపరిచితమే. పలుమార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల తన పార్టీ 'జన్ అధికార్'ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు. పూర్నియా నుంచి ఎంపి టికెట్ ఆశించారు. 'ఇండియా' వేదిక సీట్ల సర్దుబాటులో భాగంగా ఆర్‌జెడి-కాంగ్రెస్ మధ్య కుదిరిన ఒప్పందంతో పూర్నియా నుంచి ఆర్‌జెడి పోటీ చేయనుంది. ఈ స్థానం నుంచి 'ఇండియా' అభ్యర్థిగా భీమా భారతిని నిలబెట్టారు. దీంతో పుప్పూయాదవ్ ఆశ నెరవేరలేదు. దీంతో ఇదే స్థానం నుంచి పప్పూయాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం తన మద్దతుదారుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ తీవ్ర ఉద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు.

తెరపై కాషాయం

(మొదటిపేజీ తరువాయి)

విలన్లుగా చూపించి.. బీజేపీని పరోక్షంగా 'హీరో'గా చిత్రీకరిస్తున్నాయి ఈ వివాదాస్పద చిత్రాలు.

2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే హిందూత్వ బీజేపీ అనుకూల కథనాలను ప్రోత్సహించే అనేక హిందీ సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో 'స్వతంత్ర వీర్ సావర్కర్', 'జేఎన్‌యూ : జహంగీర్ నేషనల్ యూనివర్శిటీ', ' ఆర్టికల్ 370', 'మై అటల్ హూ' వంటివి ఉన్నాయి. అలాగే, ఈ జాబితాలో గతంలోని స్థానిక పరిస్థితుల ఆధారంగా నిర్మించిన 'బెంగాల్ 1947', 'రజాకార్', 'యాక్సిడెంట్ లేదా కాన్స్పిరసీ: గోద్రా' వంటి విడుదలైన, విడుదల కానున్న చలనచిత్రాలూ ఉన్నాయి. ఇలాంటి బీజేపీ, హిందూత్వ అనుకూల చిత్రాల పరంపర 2019కి ముందు నుంచే ప్రారంభమై 2024 నాటికి అధికమైందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

'జేఎన్‌యూ: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ'

ఈ చిత్రం లెఫ్ట్ వింగ్ స్టూడెంట్ పాలిటిక్స్‌ను విమర్శిస్తూ రూపొందించారు. టైటిల్ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)ని పరోక్షంగా సూచిస్తుంది. ఈ చిత్రాన్ని మహాకాల్ మూవీస్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్మించింది. ఈ కంపెనీ డైరెక్టర్లలో విష్ణు తాంతియా ఒకరు. ఆయన రాష్ట్రంలో బీజేపీతో పొత్తులో ఉన్న హర్యానా రాజకీయ నాయకుడు గోపాల్ కందాగా ప్రసిద్ధి చెందిన గోపాల్ గోయల్ వ్యాపార సహచరుడు. 'భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన' జేఎన్‌యూలో భారతదేశ సంస్కృతి, సమగ్రత కోసం నిలబడే కాషాయ అనుకూల రైట్-వింగ్ 'ఏబీపీపీ' (పరోక్షంగా ఏబీవీపీ), లెఫ్ట్ వింగ్ (ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్) 'జాతీయ వ్యతిరేక' అజెండా మధ్య పోరాటంగా ఈ చిత్రంలో చూపించారు. ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేసినట్టు సమాచారం.

స్వతంత్ర వీర్ సావర్కర్

కరడుగట్టిన హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్‌పై రూపొందిన ఈ బయోపిక్‌కి రణదీప్ హుడా దర్శకత్వం వహించారు. అతను టైటిల్ పాత్రను కూడా పోషించాడు. ఇది 22 మార్చి 2024న థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరు ఆనంద్ పండిట్. ఆయన 30 ఏండ్లకు పైగా బీజేపీ సభ్యుడిగా ఉన్నారు. ఒక ప్రముఖ వార్త కథనం ప్రకారం అతను మహారాష్ట్ర బీజేపీ కోశాధికారి.వివేక్ ఒబెరాయ్ నటించిన 'పీఎం నరేంద్ర మోడీ' బయోపిక్‌కి కూడా పండిట్ నిర్మాత. ఆ చిత్రం కూడా 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందే విడుదల కావటం గమనార్హం. పండిట్..మోడీకి సన్నిహితుడు అని కూడా తెలుస్తున్నది. 2013లో ఫెమా ఉల్లంఘన కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పండిట్‌ను విచారిస్తున్నది. ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్స్ విడుదల చేసిన ఆఫ్‌షోర్ ఖాతాదారుల డేటాబేస్‌లో అతని పేరు కూడా ఉన్నది.

'మై అటల్ హూ'

పండిట్‌తో పాటు 'పీఎం మోడీ', 'సావర్కర్' బయోపిక్‌లను నిర్మించిన వ్యక్తులలో ఒకరు సందీప్ సింగ్. పంకజ్ త్రిపాఠి నటించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిపై ఇటీవల నిర్మించిన 'మై అటల్ హూ' నిర్మాతలలో కూడా అతనొకడు. సందీప్ సింగ్‌కి బీజేపీతో సంబంధాలున్నాయని ఆప్ గతంలో ఆరోపించింది. 2020లో, సందీప్ సింగ్ మాదకద్రవ్యాల ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు, బీజేపీకి 53 కాల్స్ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది.

రజాకార్

హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోకి డబ్ అయిన తెలుగు సినిమా 'రజాకార్: ది సైలెంట్ జెనోసైడ్ ఆఫ్ హైదరాబాద్'. సమరవీర్ క్రియేషన్స్ పతాకంపై గూడూరు నారాయణరెడ్డి నిర్మించారు. నారాయణరెడ్డి తెలంగాణలో బీజేపీ కార్యనిర్వాహక కమిటీలో భాగం. అతను 2023 అసెంబ్లీ ఎన్నికలలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థి. కేవలం 9200 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్‌ను కూడా కోల్పోయారు.

ప్రమాదం లేదా కుట్ర: గోద్రా

గుజరాత్‌లో 2002 గోద్రా రైలు మారణహోమంపై రెండు సినిమాలు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. విక్రాంత్ మాస్సే నటించిన 'ది సబర్మతి రిపోర్ట్'ను ఏక్తా కపూర్ బాలాజీ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా.. ఓం త్రినేత్ర ప్రొడక్షన్స్, ఆర్ట్‌వర్స్ స్టూడియోస్ నిర్మించిన చిత్రం 'యాక్సిడెంట్ ఆర్ కాన్స్పిరసీ: గోద్రా'. ఇందులో రణ్‌వీర్ షోరే, మనోజ్ జోషి, హితు కనోడియా నటించారు. గుజరాతీ నటుడు కనోడియా 2017 నుంచి 2022 వరకు గుజరాత్‌లోని ఇదార్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. అతని తండ్రి నరేష్ కనోడియా కూడా బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. అతని మామ మహేష్ కనోడియా బీజేపీ ఎంపిగా ఉన్నారు. అనేక హిందీ, గుజరాతీ సినిమాలలో కూడా నటించిన మనోజ్ జోషి.. బీజేపీ ప్రచార ప్రకటనలలో కూడా కనిపించారు. గోద్రా సినిమా నిర్మాత బీజే పురోహిత్ కూడా బీజేపీ మద్దతుదారుడే కావటం గమనార్హం.

బెంగాల్ 1947

విభజన సమయంలో బెంగాల్‌లో జరిగిన హింసాకాండపై ఈ సినిమా తెరకెక్కింది. హింసాకాండ రెండు వైపులా జరిగినప్పటికీ, హిందువులపై ముస్లింల దురాగతాలపై ప్రధానంగా దృష్టి సారించినట్టు ఈ సినిమాను నిర్మించారని విమర్శకులు అంటున్నారు. గతనెల 29న ఈ చిత్రం విడుదలైంది. ఆకాశాదిత్య లామా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కామ్‌ఫీడ్ ప్రొడక్షన్స్ నిర్మించింది. లామా భారతీయ చిత్ర సాధన(బీసీఎస్) అనే సంస్థకు జాయింట్ సెక్రెటరీగా ఉన్నారు. 2016లో ఏర్పాటైన ఈ సంస్థ ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్నది. ప్రముఖ హిందూత్వ సిద్ధాంతకర్తగా పేరుగాంచిన బి.కె కుత్యాల ఈ సంస్థకు చైర్మెన్‌గా ఉన్నారు. బీసీఎస్ సలహా మండలిలో సుభాష్ ఘాయ్, హేమ మాలిని, మధుర్ భండార్కర్, వివేక్ అగ్నిహోత్రి, ప్రియదర్శన్ వంటివారూ ఉన్నారు.

సినిమాలను ప్రమోట్ చేయటంలో బీజేపీ బిజీబిజీ

ఈ సినిమాలను ప్రమోట్ చేయడంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు కూడా చురుగ్గా పాల్గొన్నారు. బీజేపీ ప్రభుత్వాల మద్దతుతో పన్ను మినహాయింపులు, ఉచిత స్క్రీనింగ్‌లు, సోషల్ మీడియా ప్రమోషన్‌లు వంటి ప్రమోషన్ స్ట్రాటజీని వీరు పాటించారు.గతనెల 13న, ఏబీవీపీ అనుబంధ సంస్థ రాష్ట్రీయ కళా మంచ్ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో దర్శకుడు సుదీప్తో సేన్ 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' ప్రదర్శనను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సేన్, నటి అదా శర్మ పాల్గొన్నారు. వీరిద్దరూ గతంలో 'ది కేరళ స్టోరీ' చిత్రంలో పని చేశారు. ఈ చిత్రం గతేడాది విడుదలైంది. కేరళ రాష్ట్రంలో ఇస్లామోఫోబియా టార్గెట్‌గా దీనిని రూపొందించారు. ఆ సమయంలో కేరళ స్టోరీ సినిమా చట్టపరమైన ఇబ్బందులనూ ఎదుర్కొన్నది. ఏబీవీపీ మార్చి 18న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో కూడా ఈ సినిమా ప్రదర్శనను నిర్వహించింది.'ఆర్టికల్ 370' : జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ ఇది. 2019లో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన ఈ ఆర్టికల్ ఆధారంగా సినిమాను రూపొందించారు. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తీసుకున్న మొదటి ప్రధాన నిర్ణయాల్లో ఇది ఒకటి.

ఈ చిత్రాన్ని మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు రాజకీయ నాయకులు ప్రచారం చేశారు. వారు థియేటర్‌లలోకి వెళ్లి చూడాలని ప్రజలను కోరారు. బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఈ చిత్రం పన్ను రాయితీని పొందటం గమనార్హం. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఈ సినిమా ప్రదర్శనలకు బీజేపీకి చెందిన పలువురు నేతలు హాజరయ్యారు. 2019లో కూడా బీజేపీ కార్యకర్తలు 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' సినిమా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు 'ఉరి' విడుదలైంది. ఈ రెండు చిత్రాలకు ఆదిత్య ధర్ అనే వ్యక్తి నిర్మాత. 2024లో 'మై అటల్ హూ' మహారాష్ట్ర రాష్ట్ర అసెంబ్లీలో ప్రదర్శించబడింది. మహారాష్ట్ర బీజేపీ నేత నిరంజన్ వసంత్ దావ్‌ఖరే ఈ సినిమా ఉచిత ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

త్రిపురలో ముఖ్యమంత్రి మాణిక్ సాహా సోదరుడు రటా సాహా అలాంటి స్క్రీనింగ్‌ను మరొకటి నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు భారీగా ప్రచారం చేసిన మరో చిత్రం 'రజాకార్'. తెలంగాణలోని ప్రజలు సినిమాను చూడాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ.. వినోదపు పన్ను మినహాయించాలని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. పలువురు బీజేపీ నేతలు ఈ సినిమా ప్రదర్శనలు నిర్వహించారు. 'బెంగాల్ 1947' చిత్రానికి బీజేపీ కంటే ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త రతన్ శారదా, ఆర్ఎస్ఎస్ ఢిల్లీ మీడియా ఇన్‌ఛార్జ్ రాజీవ్ తులి ఇద్దరూ సినిమాను ప్రమోట్ చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, పైన చర్చించిన చిత్రాలలో 'బస్తర్', 'మై అటల్ హూ', 'సావర్కర్'లతో పాటు అత్యధిక చిత్రాలు ఘోరంగా విఫలమయ్యాయని సినీ విమర్శకులు అంటున్నారు.

పేద మహిళలకు ఏటా రూ.లక్ష

కాంగ్రెస్ న్యాయ్‌పత్ర-2024 ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. శుక్రవారం నాడిక్కడ ఏ ఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ చిదంబరం, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. న్యాయ్‌పత్ర-2024తో పేరుతో 48 పేజీలతో కూడిన ఈ మ్యానిఫెస్టోలో 5 న్యాయ పథకాలు, 25 గ్యారంటీలను పొందుపరిచారు. యువత, మహిళలు, రైతులు, కూలీలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా రైతులకు మద్దతు ధర, నిరుద్యోగంపై దష్టి పెట్టింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణనను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ హామీలే తమను ఎన్నికల్లో విజయం సాధించేలా చేస్తాయని, అధికారాన్ని కట్టబెడతాయని కాంగ్రెస్ విశ్వసిస్తోంది.

మ్యానిఫెస్టోలో ముఖ్యాంశాలు

- విద్యా రుణాల వడ్డీ రేటు తగ్గింపు
- విద్యార్థులకు రూ. లక్ష ఆర్థిక సాయం
- ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులకు కనీస మద్దతు ధర
- రైతులకు కేంద్రాలలో నేరుగా కనీస మద్దతు ధర
- రైతు రుణాలకు ప్రత్యేక కమిష
- వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ మినహాయింపు
- రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ
- నూతన వ్యవసాయ చట్టాలు రద్దు
- ఉపాధి హామీ రోజు వారి వేతనం రూ.400కు పెంపు
- సామాజిక ఆర్థిక సమానత్వం కోసం చర్యలు
- రైల్వేల ప్రయివేటీకరణ నిలిపివేత
- రైల్వే చార్జీల తగ్గింపు, వృద్ధులకు టికెట్లలో రాయితీ
- దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల పంపిణీ



- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు
- దేశవ్యాప్తంగా కులగణన
- కులగణన తర్వాత రిజర్వేషన్ల పరిమితి పెంపునకు రాజ్యాంగ సవరణ
- 50 శాతం రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేత
- పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు
- కార్మికుల ఆరోగ్యంపై హక్కుల కల్పన
- మూడేండ్లలో సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఖాళీల భర్తీ పూర్తి
- నేషనల్ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ప్రతినెలా రూ. పది వేలు
- డిజిటల్ విద్య కోసం తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు సెల్‌ఫోన్లు
- పాఠశాల ఫీజు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహం
- రూ.లక్ష (నెలకు రూ.8,500)తో చదువుకున్న యువతీ, యువకులందరికీ ఒక సంవత్సరం అప్రెంటిస్ షిప్
- ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్ష ఫీజులు రద్దు
- ఏడాదిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వ్ పోస్టుల భర్తీ
- దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీతో హాస్పిటల్ ఏర్పాటు
- యూనివర్శిటీలో వివక్షకు గురవుతున్న విద్యార్థులకు న్యాయం చేసేందుకు రోహిత్ వేముల చట్టం
- దేశవ్యాప్తంగా నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, కస్తూర్బా గాంధీ పాఠశాలల పెంపు
- సామాజిక న్యాయం కింద వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ రూ.1,000కి పెంపు

- ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా
- పుదుచ్చేరికి రాష్ట్ర హెూదా
- జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హెూదా పునరుద్ధరణ
- పట్టణాలలో అర్బన్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం
- రూ.5 వేల కోట్లతో యువతకు స్టార్టప్ ఫండ్
- అగ్నివీర్ పథకం రద్దు. పాత పద్ధతిలోనే ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావి నియామకాలు
- మహాలక్ష్మి పథకంతో పేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష ఆర్థిక సాయం
- రూ.450కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ
- ఆశా, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు
- అంగన్‌వాడీల సంఖ్య రెట్టింపు, 14 లక్షలకు పైగా ఉద్యోగాల సృష్టి
- బస్సు ప్రయాణంలో మహిళలకు రాయితీ
- మహిళలకు విద్య, వారి చట్టపరమైన హక్కుల అమలులో సహాయానికి ప్రతి పంచాయతీలో ఒక అధికార మైత్రి నియామకం

ఇండియా ఫోరమే గెలుస్తుంది

ఎన్నికల తరువాతే ప్రధాని అభ్యర్థి ఎంపిక

రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న శక్తులకు, వాటిని పరిరక్షించే శక్తులకు మధ్యే పోటీ


కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

చేయగలిగిందే చెబుతున్నాం: ఖర్గే

గత పదేండ్ల మోడీ పాలనలో అన్ని రంగాల్లోనూ విధ్వంసమే : చిదంబరం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మీడియా ప్రచారం చేస్తున్నట్లు కాకుండా పోటాపోటీగా ఈ ఎన్నికలు ఉండనున్నాయని, ఎన్నికల్లో తాము (ఇండియా ఫోరమే) గెలుస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాతే 'ఇండియా' ఫోరం ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలనుకుంటున్న శక్తులకు, వాటిని పరిరక్షించేందుకు నడుం బిగించిన శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటమే 2024 లోక్‌సభ ఎన్నికలని అన్నారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసిన అనంతరం రాహుల్ గాంధీ మీడియా మాట్లాడుతూ 2004లోనూ వాజ్‌పేయి హయాంలో "ఇండియా షైనింగ్ (భారత్ వెలిగిపోతోంది)" అంటూ వాళ్ల ప్రచారం చేశారని, అయితే అప్పటి ఎన్నికల్లో ఎవరు గెలిచారో అందరికీ తెలిసిందేనని అన్నారు.



బీజేపీ ఓటమి చవిచూస్తే యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సైద్ధాంతిక పరమైన ఎన్నికలు గానే 'ఇండియా' ఫోరం ఈసారి ఎన్నికల బరిలోకి దిగుతోందని తెలిపారు. రాజకీయ పరిశీలకుల తరహాలో తాను భవిష్యత్‌ను ఊహించలేనని, మీడియా అంచనాలకు అందని విధంగా ఈసారి ఎన్నికల్లో నువ్వా నేనా అనేలా పోటీ ఉంటుందని చెప్పగలనని అన్నారు.

బీజేపీ చేతిలో సీబీఐ, ఈడీ, ఐటీ ఉన్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర సంస్థలతో బెదిరించి నేతలను బీజేపీలో చేర్చుకుంటున్నారని, కేంద్ర సంస్థలను ప్రయోగించి పార్టీకి నిధులు సమకూర్చు కుంటున్నారని ధ్వజమెత్తారు. ఆర్థికంగా బీజేపీ తమను తాము పరిపుష్టం చేసుకుందని అన్నారు.

బీజేపీ మ్యానిఫెస్టోలో 1-2 శాతం ఉన్న అదానీ వంటివారు కోరుకున్నవి ఉంటాయని, తమ మ్యానిఫెస్టోలో మాత్రం మిగతా 98-99 శాతం ప్రజలు కోరుకునేవే ఉన్నాయని అన్నారు. నాలుగు పెద్ద కార్పొరేట్ సంస్థల కోసం దేశం కాదని, వ్యాపారస్తుల మధ్య పారదర్శక పోటీ ఉండేలా చూస్తామని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీలంటే.. కాంక్రీట్ గ్యారంటీలేనని స్పష్టం చేశారు.

చేయగలిగిందే చెబుతున్నాం: ఖర్గే

దేశానికి సరికొత్త దశా దిశా నిర్దేశించేలా ఈ మ్యానిఫెస్టో ఉందని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ భూమి మీదే నడుస్తుంది తప్పా.. ఆకాశానికి నిచ్చెన వేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వాస్తవికతకు చాలా దగ్గరగా ఉందన్నారు. సాధ్యం కానీ లక్ష్యాలు నిర్దేశించుకోలేదని, అలాగే మేము మోసపూరితంగా వ్యవహరించలేదని అన్నారు. అయితే చేయగల్గిందే చెప్పామని, చెప్పిందే చేసి చూపించామని, ప్రస్తుతం చేయగల్గిందే మేము ఈ మ్యానిఫెస్టోలో పొందుపరిచామని పేర్కొన్నారు. వంచిత వర్గాలు, పీడిత, పేద, మహిళ, యువ వర్గాలకు అందకుండా పోయిన న్యాయాన్ని అందిస్తామని, పదేండ్ల కాలంలో పేదలకు అందకుండా పోయిన ఫలాలు సైతం అందిస్తామని, ఇదే తమ హామీ అని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోను పేదలకు అంకితం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్రలో ఐదు స్తంభాలపై దృష్టి పెట్టామని చెప్పారు. అవి యువ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక న్యాయ్, నారీ న్యాయ్, హిస్సేదారీ న్యాయ్ అని ఆయన వివరించారు. వాటి ఆధారంగా 25 గ్యారంటీలు పొందుపరిచామన్నారు. యువ న్యాయ్‌లో భాగంగా అప్రెంటిస్‌షిప్ తప్పనిసరి చేస్తామన్నారు. అప్రెంటిస్ చేసేవారికి ఏడాదికి కనీసం రూ.1 లక్ష లభించేలా పథకాన్ని రూపొందించామని తెలిపారు. ఇక కిసాన్ న్యాయ్‌లో భాగంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. శ్రామిక్ న్యాయ్‌లో భాగంగా రూ.400 కనీస వేతనం నిర్ణయిస్తామని చెప్పారు. హిస్సేదారీ న్యాయ్‌లో భాగంగా కులాల వారీగా జన గణన చేస్తామని, అయితే ఎవరు ఎంత సంఖ్యలో ఉంటే వారికి అంత వాటా దక్కేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. కులగణన ఏ ఒక్క వర్గానికి వ్యతిరేకంగా జరిగేది కాదన్నారు. అన్ని వర్గాల్లోని పేదలకు న్యాయం అందించడమే తమ ముందున్న లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇక ఆర్థిక న్యాయ్‌లో భాగంగా ఆర్థిక న్యాయం, నిరుద్యోగం, పన్నుల సంస్కరణలు ఉన్నాయన్నారు. పరిశ్రమలు, మౌలిక వసతులు సైతం పెంపొందిస్తామని చెప్పారు. రాజ్య న్యాయ్‌లో భాగంగా రాష్ట్రాలకు న్యాయం చేస్తామని, అందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతామని అన్నారు.

రాష్ట్రాలు ఎదుర్కొనే ప్రకతి వైపరీత్యాల్లో చట్ట ప్రకారం కేంద్రం అందించే మద్దతు అందేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే దేశ అంతర్గత భద్రతను దృష్టిలో పెట్టుకుని రక్షా న్యాయ్ ఏర్పాటు చేశామని, అందులో విదేశీ విధానం కూడా ఉందని అన్నారు. పర్యావరణ్ న్యాయ్ అంశాన్ని కూడా అందులో పొందుపరిచామని, అయితే దీన్ని పూర్తిగా అధ్యయనం చేయాల్సిందిగా కోరుతున్నామని అన్నారు.

ఇక కాంగ్రెస్ పార్టీపై మోడీ అనుసరించిన దుష్టనీతి గురించి మీకు వివరించాలన్నారు. తమ పార్టీకి రూ.3వేల కోట్లకుపైగా ట్యాక్స్ పెనాల్టీ విధించారని గుర్తు చేశారు. ఇది లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ అవుతుందా? ఇది ప్రజాస్వామ్య విధానమా? అని ఆయన ప్రశ్నించారు. మోడీ అంటే నిరంకుశం, నియంతృత్వమని ధ్వజమెత్తారు. వాటిని వదిలించుకోవాలంటే మోడీని గద్దె దించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లినప్పుడే మార్పు అనేది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. చందా తీసుకురా? కాంట్రాక్టు తీసుకో అన్నదే బీజేపీ విధానమని, ఆ పార్టీ వాషింగ్ మెషీన్‌లా మారిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో చేరగానే ఎన్ని కేసులున్నా సరే క్లీన్ అయిపోతారని అన్నారు. ఇటు దర్యాప్తు సంస్థలతో బెదిరించి, అటు దొంగలను పార్టీలో చేర్చుకుంటు న్నారంటూ బీజేపీపై మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత పదేండ్ల మోడీ పాలనలో అన్ని రంగాల్లోనూ విధ్వంసమే : చిదంబరం

గత పదేండ్ల మోడీ పాలనలో అన్ని రంగాల్లోనూ విధ్వంసమేనని కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ చిదంబరం అన్నారు. బీజేపీ గత పదేండ్ల పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ప్రజాస్వామ్యం బలహీనపడిందని విమర్శలు గుప్పించారు. మోడీ ప్రభుత్వం ధనవంతుల ప్రభుత్వమని, దేశంలో ఉన్న ఒక్క శాతం ధనికుల కోసమే బీజేపీ పాలన సాగిందని, నిరుపేదలను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రభుత్వ సంస్థలను పనిచేయనీయకపోవడం, బలహీన వర్గాల అణచివేత కొనసాగుతోందని అన్నారు. పార్లమెంట్ వ్యవస్థను కూడా బలహీనపరి చారని చిదంబరం ధ్వజమెత్తారు. 'గత పదేండ్లలో దేశానికి జరిగిన నష్టాన్ని పూడ్చేలా మ్యానిఫెస్టోను సిద్ధం చేశాం. ఉద్యోగాలు, సంపద, సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తాం. గత పదేండ్లలో దేశం 5.9 శాతం మాత్రమే వృద్ధి సాధించింది. యూపీఏ తొలి విడత పాలనలో దేశం 8.5 శాతం వృద్ధి సాధించింది. 24 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. 2024లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తాం. అధికారం చేపట్టగానే మరో 23 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పిస్తాం' అని చిదంబరం వెల్లడించారు.

దేశ సమైక్యతను దెబ్బతీస్తున్న బీజేపీ

నవతెలంగాణ - భువనగిరి

ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేస్తూ, దేశ సమైక్యత, సమగ్రతను దెబ్బ తీస్తూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్ ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎం) భువనగిరి నియోజకవర్గ స్థాయి సమావేశం జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి స్వామి, దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ, పగిళ్ల లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలు ఉంటేనే అభివృద్ధిలో దేశం ముందుకెళ్తుందని, ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందని అన్నారు. ఈ ఐక్యతను దెబ్బతీయడానికి మోడీ, బీజేపీ ప్రభుత్వం మొత్తం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పదేండ్ల కాలంలో దళితులు, గిరిజనులు, మహిళలు అనేక దాడులకు గురవుతున్నారన్నారు. ధరలు విపరీతంగా పెరిగి నిత్యావసర వస్తువులు సామాన్య ప్రజలు కొని తినే పరిస్థితిలో లేకుండా పోయిందని చెప్పారు. రోజు రోజుకూ ఆకలి దారిద్ర్యం పెరిగిపోతోందని, ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు పెరిగాయన్నారు.

దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అవినీతిని చట్టబద్ధత చేసిందన్నారు. అవినీతి చేసిన వారు బీజేపీలో చేరితే నీతిమంతులు అవుతున్నారని.. ఇది ఎలా సరైందని ప్రశ్నించారు. మరో పక్క ప్రశ్నించే వారిని, ఎదిరించే వారిని, హక్కులను అడిగే వారిపై నిర్బంధాలు వేస్తూ.. తప్పుడు కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ జైల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటి నుంచి బయట పడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ.. ప్రజల మధ్యే ఉంటున్న సీపీఐ(ఎం) అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా.. ప్రజల పక్షాన నిలబడాలంటే జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, పగిళ్ల ఆశయ, కొండమడుగు నర్సింహ, నారి అయిలయ్య, జగదీష్, బట్టుపల్లి అనురాధ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరపాటి రమేష్, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి పాల్గొన్నారు.

కష్టజీవుల గొంతుకనవుతా

(మొదటి పేజీ తరువాయి)

జీవనధార మూసీ నది డంపింగ్ యార్డ్‌గా మారినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నదిలో సుమారు 70 కిలోమీటర్ల మేర విష జలాలు ప్రవహిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్పించుకుని.. ప్రథమంగా మూసీ శుద్ధీకరణ చేయాలని కోరారు. మూసీ శుద్ధీకరణకు సుమారు రూ.58 వేల కోట్లు అవసరం కాగా.. బడ్జెట్‌లో రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. మూసీ నదిని మూడు జోన్లుగా విభజించారని, ఏ జోన్‌ను మొదట సుందరీకరిస్తారో చెప్పాలన్నారు. మూసీ నది ప్రక్షాళనపై ప్రభుత్వం ప్రణాళికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తనను పార్లమెంటు సభ్యునిగా గెలిపిస్తే ఆమరణ నిరాహార దీక్ష చేసైనా మూసీని శుద్ధీకరణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజలకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేవని, బీబీనగర్‌లో ఎయిమ్స్ మూడేండ్ల నుంచి పూర్తి కావడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం లేదన్నారు. వీటన్నింటిని పరిష్కరించేందుకు, కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు వచ్చే ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు రాచకొండ వెంకట్‌గౌడ్, బొజ్జ చిన్న వెంకులు, వంటేపాక వెంకటేశ్వర్లు, లకపాక రాజు, ఆకుల భాస్కర్, సాకుంట్ల నరసింహ, ఒంటెపాక కృష్ణ, బాలస్వామి పాల్గొన్నారు.

భారత తొలి ప్రధాని బోస్ అట..!

బీజేపీ అభ్యర్థి కంగనా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలివుడ్ నటి, కంగనా రనౌత్ మరోమారు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. భారత తొలి ప్రధానమంత్రి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఆమె పేర్కొన్నారు. ఒక ఇంటర్వ్యూలో కంగనా మాట్లాడుతూ.. 'మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు తొలి ప్రధాని బోస్ ఎక్కడికి వెళ్లారు..?' అని వ్యాఖ్యానించారు. దేశం కోసం పోరాడిన



ఆయన్ను దేశంలోకి అడుగుపెట్టనివ్వలేదని ఇష్టారీతిన చెప్పుకుంటూ వెళుంటే సదరు కార్యాక్రమ వ్యాఖ్యాత ఆమె మాటలను సరిచేశారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అని గుర్తు చేశారు. కంగనా ప్రకటనపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి వారి మాటలు తేలిగ్గా తీసుకోవద్దని, వీరంతా ఎక్కడ చదువుకున్నారంటూ విపక్ష నేతలు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె విద్యాశాఖ మంత్రి అయితే పరిస్థితి ఏంటో..? అంటూ కామెంట్లు పెట్టారు. గతంలోనూ ఆమె ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. 2014లో నరేంద్ర మోడీ ప్రధాని అయిన తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందంటూ వ్యాఖ్యలు చేసి, విమర్శల పాలయ్యారు. ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని అప్పట్లో పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. మండి నియోజకవర్గానికి జూన్ ఒకటిన ఓటింగ్ జరగనుంది.

10 నిమిషాల్లో 45 వేల టికెట్లు ఎలా అమ్మారు..?

- హెచ్‌సీఏపై చర్యలు తీసుకోవాలి
- హైదరాబాద్ ఆటగాళ్లు లేకుండా సన్ రైజర్స్ జట్టు : ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ - బంజారాహిల్స్

"హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగే క్రికెట్ మ్యాచ్‌లకు టికెట్లు దొరక్కపోవడం దారుణం.. 10 నిమిషాల్లో 45వేల టికెట్లు ఎలా అమ్ముడయ్యాయ్..? సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో హైదరాబాద్ క్రీడాకారులు లేకపోవడం అన్యాయం.. మళ్లీ మ్యాచ్‌లో ఇలా జరిగితే.. ఉప్పల్‌లో మ్యాచ్‌లు జరక్కుండా అడ్డుకుంటాం" అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఐపీఎల్ టికెట్లు మొత్తం బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. తాను డీఎస్ఆర్ అకాడమీని నడుపుతున్నానని.. బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశానని చెప్పారు. అయితే ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు టికెట్లు దొరకడం లేదన్నారు. అందుకు ప్రధాన కారణం హెచ్‌సీఏ అన్నారు. కాంప్లిమెంటరీ పాస్‌లు బ్లాక్‌లో అమ్ముతున్నారన్నారు. హెచ్‌సీఏ తీరుపై చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. టికెట్ల అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. రానున్న మ్యాచ్‌లకు బ్లాక్ టికెట్ల దందా జరగకుండా చూడాలని కోరారు. ఇక.. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో హైదరాబాద్ క్రీడాకారులు ఒక్కరూ లేకపోవడం దారుణమన్నారు. కనీసం ఇంపాక్ట్ ప్లేయర్‌గా కూడా హైదరాబాద్ ఆటగాడు లేడన్నారు. సన్ రైజర్స్ ఫ్రాంచైజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది నుంచి సన్ రైజర్స్ జట్టులో ఒక్క హైదరాబాద్ ఆటగాడైనా లేకపోతే ఉప్పల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడనివ్వమన్నారు. అవసరమైతే స్టేడియం వద్ద ధర్నా చేస్తానని.. కేసులు నమోదు చేసుకున్నా పర్వాలేదన్నారు.

సీపీఎస్ రద్దుపై రాజకీయ పార్టీలు స్పష్టతనివ్వాలి

- పాత పెన్షన్ పునరుద్ధరణపై మ్యానిఫెస్టోలో చేర్చాలి : ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుపై స్పష్టమైన హామీ ఇచ్చి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) పునరుద్ధరణపై మ్యానిఫెస్టోలో చేర్చాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలూ సీపీఎస్ రద్దు-పాత పెన్షన్ పునరుద్ధరణ అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించాలని వారు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు కోసం దేశంలో ఉన్న 84 లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు, తెలంగాణలో 2.30 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు సరైన విధంగా చేర్చి వారికి లబ్ధి చేకూర్చేలా చేసేది ఉద్యోగులేనని పేర్కొన్నారు.

2004 తర్వాత ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ వ్యతిరేకిస్తున్న సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వాలు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రూ.పది లక్షల కోట్లు ఉద్యోగుల, ప్రభుత్వ గ్రాంటు షేర్ మార్కెట్లో పెట్టుబడులుగా వెళ్లాయని వివరించారు. 84 లక్షల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించలేని పీఎఫ్ఆర్డీఏ చట్టం నుంచి ప్రభుత్వ ఉద్యోగులను మినహాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఈ చట్టంపై నిర్ణయం తీసుకుని మ్యానిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించాలని కోరారు.

సంపద ఉప్పునీరులాంటిది. ఎంత తాగితే అంత దప్పిక పెరుగుతుంది - గోల్డ్ స్మిత్

సంపాదకీయం

చొరబడుతున్నారు..



మెదడు గుడ్డిదైపోయాక కళ్లుండీ ప్రయోజన ముండదు. ఆ ప్రమాదం ముదరకముందే సమాజంలో వివేకం మేల్కోవాలి. ఏలినవారి తీరుకు బుద్ధిజీవులెవరికైనా ఈ అభిప్రాయం రాకమానదు. ఇప్పటికే ఈ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో విద్యరంగంలో ఆధునిక భావాలకు, శాస్త్రీయ ఆలోచనలకు పాతరేస్తోంది. ప్రయివే టీకరణకు తలుపులు బార్లా తెరుస్తోంది. క్రమేణా పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల సిలబస్‌లోంచి అనేక శాస్త్రీయ, చారిత్రక అంశాలను తొలగించి తమ హిందూత్వ భావజాలాన్ని చొప్పిస్తోంది. తద్వారా దేశంలో వైజ్ఞానిక స్పృహకు తలుపులు మూస్తోంది. ఇప్పుడు కొత్తగా సైనిక పాఠశాలలను సైతం సంఘ్‌పరివార్‌కు అప్పగిస్తూ తన కాషాయీకరణను మరింత వేగవంతం చేస్తోంది.

ఇప్పటికే రామాయణ కాలంలోనే విమానాలున్నాయి అంటాడొకడు. మహాభారతంలోనే టెస్టుట్యూబ్ బేబీలున్నాయంటాడు ఇంకొకడు. అది తాజ్‌మహల్ కాదు తేజోమహల్ అనీ, ఇది ఇండియా కాదు భారత్ అని, ప్యారిస్‌ను పురుషోత్తమ పట్టణమనీ, ఆస్ట్రేలియాను అస్త్రాలయ అనీ ఆధారాలు లేని విశ్వాసాలను తాము నమ్మడమేగాక దేశాన్నీ నమ్మమని శాసించజూస్తున్నారు. ఇలాంటి శక్తుల చేతులకు విద్యారంగాన్ని అప్పగిస్తే ఇక దేశంలో వైజ్ఞానిక స్పృహకు ఆస్కారముంటుందా?

"ది రిపోర్టర్స్ కలెక్టివ్" నివేదిక ప్రకారం కొత్తగా ఏర్పాటు చేయబోయే సైనిక్ స్కూళ్లలో అత్యధికం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలకు, బీజేపీ నేతలకు, హిందూమత ప్రచారకులకు ఈ ప్రభుత్వం కట్టబెడుతోంది. "ఇప్పటివరకు జరిగిన ఒప్పందాలలో 62 శాతం సైనిక పాఠశాలలు సంఘ్‌పరివార్, దాని అనుబంధ హిందూత్వ సంస్థలు, వ్యక్తులకు అప్పగించబడ్డాయి. కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, సమాచారహక్కు చట్టం ద్వారా అందిన వివరాలు దీనిని ధృవీకరిస్తున్నాయి." అని రిపోర్టర్స్ కలెక్టివ్ వివరించింది. ఈ రకమైన చర్య సైనిక్ స్కూళ్ల చరిత్రలో ఇదే మొదటిసారి అని ఈ నివేదిక పేర్కొనడం గమనార్హం.

రక్షణ మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో, స్వయంప్రతిపత్తి కలిగిన "సైనిక్ స్కూల్ సొసైటీ" ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలల్లో ప్రయివేటు భాగస్వామ్యానికి ప్రవేశం లేదు. కానీ 2021లో బీజేపీ ప్రభుత్వం ఇందుకు తలుపులు తెరిచింది. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం నిధుల సమీకరణకు, మౌలిక వనరుల కల్పనకు ఉపయోగకరమని ఆనాడు ప్రభుత్వ పెద్దలు ప్రవచించారు. తీరాచూస్తే ఇది కేవలం ఒక ముసుగనీ, ఈ ముసుగులో సైనిక్ స్కూళ్లను కూడా కాషాయీకరించడమే వీరి ఉద్దేశ్యమని నేడు తేలిపోయింది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నావల్ అకాడమీల్లో ప్రవేశాలకు అవసరమైన శిక్షణ ఇవ్వడంలో ఈ సైనిక్ స్కూళ్లది కీలకమైన పాత్ర. అటువంటి సంస్థలను ఎలాంటి హేతుబద్ధత లేకుండా బీజేపీ తన మాతృసంస్థకు, హిందూ మత ప్రచారకులకు ధారాదత్తం చేస్తోంది. సైనిక వ్యవస్థలో లౌకిక ప్రమాణాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలు దేశానికి ఏమాత్రం శ్రేయస్కరం కాకపోగా ప్రమాదకరమైనవి.

సైంటిఫిక్ టెంపర్ అంటేనే గిట్టనివారికి విద్యావ్యవస్థలను అప్పగిస్తే ఏం జరుగుతుందీ? "పుస్తకాల గది నుంచి వచ్చే వైజ్ఞానిక తరమే సమాజానికి అవసరం" అంటాడు ప్రముఖ అమెరికన్ మానసిక శాస్త్రవేత్త ఆర్థర్ జాన్. మరి ఆ పుస్తకాల గదులను 'పూజగదులు'గా మార్చజూస్తున్న ఈ ప్రభుత్వ చర్యలను ఏమనాలి? మతం చుట్టూ తిరిగేదే జ్ఞానం అని భావించేవాళ్లు భావితరాలకు ఏం అందించగలరు? బహుశా స్వర్గ నరకాలకు దారులు చూపుతారు కాబోలు! పాతాళలోకానికి వెళ్లే సొరంగ మార్గాలను వెతికి చూపుతారు కాబోలు! ఈ సమస్త లోకాలను మోసే ఆదిశేషుని పరిమాణాన్ని, దానిమీద పవళించే విష్ణుమూర్తి చిరునామాను పట్టి ఇస్తారేమో...! డార్విన్ పరిణామవాదాన్ని, న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని అంగీరించనివారు అందించేది ఇంతకన్నా ఏముంటుంది...?! కండ్ల ముందే నిరూపించబడిన సత్యాన్ని, సైన్సును కాలదన్ని...రుజువులు లేని విశ్వాసాల ఆధారంగా చరిత్రను చూడలనేవాళ్లు అందించే చదువులు ఈ దేశాన్ని ఏ వైపునకు నడిపిస్తాయి? ఆధునిక వైజ్ఞానిక ప్రగతివైపుకా లేక మధ్యయుగాల చీకటి కాలానికా?

ఇప్పటికే రామాయణ కాలంలోనే విమానాలున్నాయి అంటాడొకడు. మహాభారతంలోనే టెస్టుట్యూబ్ బేబీలున్నా యంటాడు ఇంకొకడు. అది తాజ్‌మహల్ కాదు తేజోమహల్ అనీ, ఇది ఇండియా కాదు భారత్ అని, ప్యారిస్‌ను పురుషోత్తమ పట్టణమనీ, ఆస్ట్రేలియాను అస్త్రాలయ అనీ ఆధారాలు లేని విశ్వాసాలను తాము నమ్మడమేగాక దేశాన్నీ నమ్మమని శాసించ జూస్తున్నారు.

ఇలాంటి శక్తుల చేతులకు విద్యారంగాన్ని అప్పగిస్తే ఇక దేశంలో వైజ్ఞానిక స్పృహకు ఆస్కారముం టుందా? అందులోనూ రక్షణ రంగానికి కీలకమైన సైనిక పాఠశాలల్ని కట్టబెడితే దేశం భద్రంగా ఉంటుందా? మనుషుల్ని బానిసలుగా మార్చి తాము మాత్రం చక్రవర్తులుగా వెలగాలనుకునేవారి చర్యలు ఇలాగే ఉంటాయి. పౌరసమాజం తక్షణమే మేల్కొని తమ వివేకాన్ని ప్రదర్శించక పోతే... కాళ్లు మనవే అయినా.. నడకలు మనవి కాకుండాపోతాయి. కండ్లు మనవే కానీ... వాటి చూపుల్ని రాజ్యమే నిర్దేశిస్తుంది. ఏం చదవాలో, ఎలా ఆలోచించాలో నిర్ణయిం చడమే కాదు, ఆఖరికి మన నాలుక మీద రుచి ముద్రల్ని కూడా రాజ్యమే వేస్తుంది. హిందూత్వ శక్తులకు విద్యారంగాన్ని అప్పగిస్తే ప్రజాస్వా మ్యాన్ని తోసిరాజని నియంతృత్వాన్నే ప్రబోధిస్తారు.

మెయిల్ @ నవతెంగాణ

రైతుల అంశమే ప్రధాన ఎజెండా కావాలి

రాబోయే ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ ప్రధాన పార్టీలన్నీ ఉచితాల పేరుతో అనేక హామీలు ఇస్తున్నాయి కానీ దేశానికి అన్నంపెట్టే రైతన్నలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గెలవకముందు అన్నీ తామై చూసు కుంటామని నమ్మబలికి గద్దెనెక్కిన తర్వాత కార్పొరేట్ల సేవలో తరిస్తున్నారు. వారు అడగకపోయినా పారిశ్రామికవేత్తలకు రుణమాఫీలు చేస్తున్నారు. అదే రైతులకు పండించిన పంటలకు కనీసం గిట్టుబాట ధరలు కూడా కల్పించడం లేదు. ఇదేనా దేశం అభివృద్ధి పథంలో పయనించడమంటే? పేదలకు రుణమాఫీ చేయడానికి నిధులు లేవని సాకులు చెబుతారు. అందరికీ రుణమాఫీ చేస్తే ప్రభుత్వం సంక్షోభంలో చిక్కుకుంటుందని భయపెడతారు. అలాంటప్పుడు సామాన్యుల దగ్గరికి ఎందుకు రావడం ఓట్లడగడానికి? అదే కార్పొరేట్ల దగ్గరికి వెళ్లొచ్చు కదా! కేంద్రం పీఎమ్ కిసాన్ యోజన రైతులకోసమేనని చెబుతోంది. మరీ దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయి? 2014నుంచి దేశ వ్యాప్తంగా ఇప్పటివకు ఒక లక్షా 474మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని జాతీయ నేర రికార్డు బ్యూరో పేర్కొంది. దీని ప్రకారం గత తొమ్మిదేండ్లలో రోజుకు సగటున సుమారు 30మంది రైతులు దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. దీనికేం సమాధానం చెబుతారు? మహారాష్ట్రలో నాసిక్ నుంచి ముంబాయి వరకు ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు లాంగ్ మార్చ్ చేస్తే 2018లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసింది.అలాంటి ఉద్యమాలు దేశవ్యాప్తంగా రావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఢిల్లీ నడివీధుల్లో రైతు ఉద్యమం కొనసాగు తోంది. ఎన్నికల్లో గెలిపించాలని తమ దగ్గరికి వచ్చే నాయకులను గతంలో ఇచ్చిన హామీల గురించి నిలదీయాలి. రైతుల అంశమే ప్రధాన ఎజెండాగా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేయాలి.


- బి.బి.రామకృష్ణారావు

ప్రకృతి వైద్యానికి జీవం పోయాలి

దేశంలోనే పేరెన్నిక గల ఆయుష్ కళాశాలలు వైద్యవిద్యకు తలమానికంగా ఉన్న కళాశాలలు, పరిశోధన సంస్థలు హైదరాబాద్ నగరంలో ఉన్నాయి. గత పదేండ్లుగా ఇవి నిర్లక్ష్యం కాబడ్డాయి. గాంధీ ప్రకృతి చికిత్సాలయం, కళాశాల, ఎర్రగడ్డలోని ఆయుర్వేద, యునాని కళాశాలలు, రామాంతపూర్‌లోని హోమియోపతి కళాశాలలు శాశ్వత అధ్యాపకులు లేక వెలవెలబోతున్నాయి. ఉన్న అరకొర అధ్యాపకులు ఉద్యోగ విరమణ పొందడం వలన కొత్తగా అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో నేడు ఈ కళాశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న గాంధీ ప్రకృతి వైద్యశాలకు నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉంటున్నది. అందుకనుగుణంగా చికిత్స విభాగంలో సూపర్ వైజర్లు, డాక్టర్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. అయినప్పటికీ అందుబాటులో ఉన్న డాక్టర్లు వారికి నాణ్యమైన వైద్య సేవలందించే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే మన రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు స్టైఫండ్ చాలా తక్కువగా ఉంది. పక్క రాష్ట్రం ఏపీతో పోల్చుకుంటే దాదాపు పదివేల రూపాయలు వ్యత్యాసం ఉంది. దీన్ని గమనించి తెలంగాణలోని హౌస్ సర్జన్లకు స్టైఫండ్‌ని పెంచడంతో పాటు సత్వరమే కళాశాలల్లో అధ్యాపకులు, డాక్టర్లను, ట్రీట్మెంట్ సెక్షన్ అసిస్టెంట్లను నియమించి ప్రకృతి వైద్యానికి జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- డా. ఎం. అఖిల మిత్ర

ఎన్నికల బాండ్లు, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి



ప్రొ. అరుణ్‌కుమార్

భారత సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన ఎన్నికల బాండ్ల పథకం, నల్లడబ్బుతో ఎన్నికలకు నిధులు సమకూర్చే విధానానికి అంతం పలుకుతుందని అందరూ భావించారు. ఇదే జరిగి ఉండి ఉంటే, దేశానికి గొప్ప ప్రయోజనాలు కలిగే విధంగా భారత రాజకీయాలు మార్పు చెంది ఉండేవి. అన్నిటినీ మించి, అక్రమంగా నిధులను సమకూర్చే విధానం ఫలితంగా రాజకీయాల నియంత్రణ దాని చేతుల్లోకి వెళ్లడంతో, అది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ఎన్నికల బాండ్లకు, భారతదేశంలో రాజకీయాలు నిర్వహించబడే తీరుకు రవ్వంత తేడా కూడా లేదు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పెద్ద మొత్తంలో ఖర్చు చేసే అక్రమ నిధులతోనే ఎన్నికల పోరాటం కొనసాగుతుంది.

అనుభవం చాలా స్పష్టంగా ఉంది. ఒకవేళ రాజకీయాల్లో అసలు విషయం అప్రజాస్వామికంగా ఉంటే, ఎన్నికల బాండ్ల లాంటి మరమ్మతులు దానిని ప్రజాస్వామికంగా మార్చలేవు. భారత రాజకీయాల్లో అసలు విషయంలో లోటు ఏర్పాటు లాంఛనంగా మారడం వల్ల డబ్బు అవసరం పెద్ద మొత్తంలో ఏర్పడుతుంది. ముఖ్యంగా తాము ఎన్నిక కావడానికి నిధులను సమకూర్చిన వారి ప్రయోజనాల కోసం పాటుపడే ఎన్నికైన నాయకులు వారి స్వంత నియోజకవర్గ ప్రయోజనాల కోసం ప్రాతినిధ్యం వహించరు. స్వార్థప్రయోజనాల కోసం పాటుపడే వారే ఎన్నికవుతున్నారు.వారు చెప్పే దానికి, ఆచరించే దానికి తేడా స్పష్టంగా ఉంది.

ప్రభుత్వం ఇంక ఎంత మాత్రం ప్రజలచేత,ప్రజల కోసం ఎన్నుకోబడే, ప్రజల ప్రభుత్వం కాదు, కాబట్టి చెప్పే దానికి, ఆచరించే దానికి మధ్య ఉన్న తేడా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. ప్రభుత్వ విధానాల నుండి ప్రజలు ప్రయోజనాలు పొందక పోవడం, అభివృద్ధి నుండి కలిగే లాభాలపై స్వార్థ ప్రయోజనాలకు అదుపు సాధించడాన్ని అశేష ప్రజానీకం చూస్తున్నారు. ఇది విధానాల రూపకల్పనలోనే ఉంది. విధానాలను, చాలా తెలివిగా జాతీయ ప్రయోజనాలకు సంబంధించినవిగా కనిపించేట్లు రూపొందిస్తారు.

బాండ్లను కేవలం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే ఇవ్వవచ్చు కానీ వ్యక్తులకు ఇచ్చే అవకాశం లేదు. కాబట్టి, వ్యక్తికి అక్రమ నిధులు అవసరమవడం కొనసాగింది. నిధులను పొందిన పార్టీ కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాక అన్ని రకాలుగా అంటే కార్యాలయాల ఏర్పాటుకు, ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలను అస్థిరపరచడానికి కూడా ఆ నిధులను ఉపయోగించవచ్చు. అందువల్ల, ఎన్నికల బాండ్లు అనే పేరు అనుగుణంగా ఉంది. లాభాల్లో 7.5 శాతాన్ని మాత్రమే ఇవ్వాలనే పరిమితిని ఎత్తివేశారు కాబట్టి ఎంత డబ్బునైనా లంచంగా ఇవ్వవచ్చు. నష్టాలలో ఉన్న కంపెనీలు కూడా విరాళాలను ఇవ్వవచ్చు. విదేశీ కంపెనీలు కూడా విరాళాలు ఇవ్వడానికి వీలుగా తలుపులు తెరుస్తూ, ఉనికిలోలేని షెల్ కంపెనీలను ఉపయోగించుకోవచ్చు.

వాస్తవానికి, వారు స్వార్థ ప్రయోజనాల్ని,జాతీయ ప్రయోజనాలుగా నిర్వచిస్తారు. అణగారిన వర్గాల ప్రయోజనాల కంటే కూడా వారు స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తారు.

ఉదాహరణకు, పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, హీనమైన విద్యా ప్రమాణాలు కొనసాగితే, అవి సహజమైనవిగా పరిగణించి మార్కెట్ శక్తులకు వదిలి వేస్తారు. మార్కెట్ ద్వారా ఈ సేవలను సమకూర్చే వ్యాపారులకు రాయితీలు మంజూరు చేస్తారు. దీని ఫలితంగా వాటిని సమకూర్చుకోలేని పేదల అసమర్థత అంతరాల పెరుగుదలకు దారితీస్తుంది. ఆ రాయితీలు కూడా ప్రభుత్వ రంగంలో వనరుల లభ్యతను తగ్గిస్తుంది. దానివల్ల అది ఈ సేవలను అవసరమైన స్థాయిలో సమకూర్చలేక పోతుంది. సరిపోని ప్రభుత్వరంగ సేవలు అణగారిన వర్గాల ప్రయోజనాల్ని దెబ్బతీస్తాయి.ఉదాహరణకు, 14 నుండి 18 ఏండ్ల మధ్య వయస్సులో ఉన్న పిల్లల్లో 40 శాతం మంది చదవలేని, రాయలేని, రెండవ తరగతి స్థాయి లెక్కల్ని చేయలేని స్థితిలో ఉన్నారని ఆన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఏఎస్ఈఆర్) తాజా నివేదిక చెబుతోంది. వారి పేదరికాన్ని అంతం చేసే ఉన్నత నైపుణ్యాలను వారు సాధించలేక పోతున్నారు. కాబట్టి, విద్య ఉన్నత ప్రాధాన్యతను ఎందుకు పొందలేకపోతున్నది? ఎందుకంటే, పైనుంచి కిందకి జరిగే అభివృద్ధి క్రమంలో వనరులను, ఉన్నత వర్గాల వారే ఆక్రమించుకుంటారు. చట్టబద్ధంగా పొందే లాభాలతో సంతృప్తి చెందని వ్యాపారాలు, అప్రకటిత ఆదాయాలను ఉపయోగించి అక్రమ సంపాదనను ఆశ్రయిస్తాయి. అది నల్ల ఆర్థిక వ్యవస్థ నేర్పరుస్తుంది. ఈ చట్టవిరుద్ధత క్రమబద్ధమైనది, వ్యవస్థీకృతమైనది. అయితే విధాన నిర్ణేత, కార్యనిర్వాహకుడు వ్యవస్థల్ని ధ్వంసం చేసే దానిలో భాగంగా ఉన్నప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇది నల్ల ఆదాయ సృష్టికి ఆధారమయ్యే త్రయం.

దీనికి ప్రభుత్వ సిబ్బంది బలహీనమైన జవాబుదారీతనం తోడై భారతదేశంలో ప్రజాస్వామ్యానికి లోటుకు కారణమవుతున్నది. సమాజంలో ప్రబలంగా ఉన్న విశాల భూస్వామ్య మనస్తత్వంతో ఇది బలపడుతుంది. అధికారం ముందు వ్యక్తులు సాష్టాంగపడటానికి దారితీస్తుంది. ప్రజాస్వామ్యాన్ని సమర్థిస్తాయని అనుకుంటున్న సంస్థల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుంది.

ఎన్నికల్లో డబ్బు పాత్ర

ఓటింగ్ సాధారణంగా అభ్యర్థి పని విధానం పై ఆధారపడి ఉండదు కానీ కులం, మతం, ప్రాంతంపై ఆధారపడి ఉంటుంది. వీటి ప్రాతిపదికనే, ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రజల్లో విభజన తీసుకొని వస్తారు. ఎన్నికల ముందు ఓటు బ్యాంకుల్ని పెంచి పోషించి, ఓటర్లకు డబ్బులు పంచుతారు. కొంతమందికి డబ్బు ఇచ్చి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు. ప్రదర్శనలకు, మీటింగ్‌లకు హాజరయ్యేందుకు డబ్బులిచ్చి ప్రజా సమూహాలకు భోజనాలు, రవాణా సౌకర్యాలు కల్పించి సమీకరణలు చేస్తారు. ఓటర్లలో జోష్ తెచ్చేందుకు పెద్ద పెద్ద ర్యాలీలు నిర్వహిస్తారు. వాటి కోసం పోస్టర్లు, కటౌట్లు అవసరం. పహిల్వాన్లను కిరాయికి తెచ్చుకుంటారు, మీడియాను సంతోషపెడతారు. ఇలాంటి వాటికి పెద్ద మొత్తంలో డబ్బు అవసరం ఉంటుంది. ఒక పెద్ద పార్లమెంటరీ నియోజకవర్గానికి ఖర్చుల నిమిత్తం అనుమతించబడిన 95 లక్షల కంటే మించిన డబ్బు అవసరం. దీని గురించి తెలిసిన వారు 50 కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని చెబుతున్నారు. ఆ విధంగా ఒక అభ్యర్థి 49 కోట్ల రూపాయల నిధులను అక్రమంగా సమీకరించుకోవాల్సి ఉంటుంది. ఈ మొత్తానికి మించి తన రాజకీయాలకు, తన పార్టీ కార్యాలయాల నిర్వహణకు, జన సమీకరణకు ఒక పార్టీ మళ్లీ అక్రమ నిధుల ద్వారానే ఖర్చు చేస్తుంది.

ఈ నేపథ్యంలో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం, రాజకీయ పార్టీలు చట్టబద్ధంగా నిధులను సమ కూర్చుకునే అవకాశం కల్పిస్తుందనీ, అక్రమ పద్ధతుల్లో వచ్చే నిధులపై వారు ఆధారపడడం తగ్గుతుందనే వాదన ఉండేది. అయితే, ఒక రాజకీయ పార్టీకి ఎవరు, ఎందుకు (చట్టబద్ధంగా కానీ,చట్టవిరుద్ధంగా కానీ) నిధులు సమకూర్చుతున్నారో ఓటర్లకు తెలియక పోవడం వల్ల ఈ పథకం అమల్లోకి వచ్చిన మొదటి రోజు నుండి, ఇది పారదర్శకంగా లేదనే విమర్శలను ఎదుర్కొంటున్నది. పొందిన సహాయానికి ప్రతిఫలంగా తెల్ల డబ్బు రూపంలో లంచం ఇచ్చే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుంది. డబ్బును పెద్ద మొత్తంలో వ్యాపారులు, ధనికులు మాత్రమే ఇవ్వగలుగుతారు కాబట్టి, వారి పలుకుబడి, వారు అవకతవకలకు పాల్పడే అవకాశాలు బాగా పెరుగుతాయనే అంచనా కూడా ఉంది. బాండ్లను కేవలం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే ఇవ్వవచ్చు కానీ వ్యక్తులకు ఇచ్చే అవకాశం లేదు. కాబట్టి, వ్యక్తికి అక్రమ నిధులు అవసరమవడం కొనసాగింది. నిధులను పొందిన పార్టీ కేవలం ఎన్నికల కోసం మాత్రమే కాక అన్ని రకాలుగా అంటే కార్యాలయాల ఏర్పాటుకు, ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలను అస్థిరపరచడానికి కూడా ఆ నిధులను ఉపయోగించవచ్చు. అందువల్ల, ఎన్నికల బాండ్లు అనే పేరు అసంబద్ధంగా ఉంది. లాభాల్లో 7.5 శాతాన్ని మాత్రమే ఇవ్వాలనే పరిమితిని ఎత్తివేశారు కాబట్టి ఎంత డబ్బునైనా లంచంగా ఇవ్వవచ్చు. నష్టాలలో ఉన్న కంపెనీలు కూడా విరాళాలను ఇవ్వవచ్చు. విదేశీ కంపెనీలు కూడా విరాళాలు ఇవ్వడానికి వీలుగా తలుపులు తెరుస్తూ, ఉనికిలోలేని షెల్ కంపెనీలను ఉపయోగించుకోవచ్చు.

బయటపడిన ఆశ్రిత వాదం

రాజకీయ పార్టీలకు అవసరమైన మొత్తం నిధుల్లో ఎన్నికల బాండ్లు కొద్ది భాగమే అయినప్పటికీ కూడా అందుబాటులో ఉన్న వివరాలు భారత రాజకీయాలు, ఎన్నికల లక్షణాల గుట్టు విప్పుతున్నాయి. విధాన నిర్ణేతల నుండి అనుకూల విధానాల కోసం, తప్పులు చేసినందుకు విచారణ చేయకుండా తప్పించుకోవడానికి, భవిష్యత్తు కోసం పెట్టుబడిగా రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చు తున్నట్టు వివరాలు చెబుతున్నాయి. చివరి కేటగిరీ కింద అధికారం లేని రాజకీయ పార్టీలు కూడా నిధులను పొందుతున్నాయి. విధా నాలను తారుమారు చేయడం లేదా విధానాల అమలులో ప్రాధాన్యతలు పొందేలా, వ్యాపారానికి మొదటి కేటగిరీ (అనుకూల విధానాలు) అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు, పర్యావరణం క్లియరెన్స్ లేదా కాంట్రాక్ట్ పొందడం లాంటివి. రెండో కేటగిరీ ఒత్తిడితో, బలవంతంగా ఒప్పించే విధానం. దీనిలో నియమనిబంధనలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ లాంటి ఏజెన్సీలు నియమాల ఉల్లంఘనను గుర్తించి, విచారణ చేపట్టవచ్చు. ఈ విచారణ ప్రక్రియ శిక్షగా మారేలా కేసును సాగదీయవచ్చు. నియమాలను ఉల్లంఘించి, దగ్గర మార్గాల్లో తమ పనుల్ని చేయించుకునే కొన్ని వ్యాపారాలపై ఒత్తిడి తేవడం చాలా తేలిక. వేధింపుల నుండి తప్పించుకోడానికి డబ్బులు ముట్టజెప్పే కొన్ని వ్యాపారాలు కూడా ఉన్నాయి. కొన్ని పనులు చేయించుకున్న దానికి ప్రతిఫలంగా (క్విడ్ ప్రో ఖో) కొందరు విరాళాలు అందజేశారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన వివరాలు తెలియజేస్తున్నాయి. డబ్బు వచ్చిన మార్గం, విధానాల్ని తారుమారు చేసే దానితో ఉన్న సంబంధాన్ని, పూర్తి విశ్లేషణ బట్టబయలు చేస్తుంది. ఇది కూడా నేరాన్ని బహిర్గతం చేస్తుంది.



రాజకీయ నాయకత్వం జవాబుదారీతనంతో పనిచేసే ఒక ప్రజాస్వామ్యంలో ఎన్నికల పోరాటం చేయడానికి పెద్ద మొత్తంలో నిధుల అవసరం గానీ, ఎన్నికల బాండ్లను రహస్యంగా కొనాల్సిన అవసరం గానీ లేదు. నిర్దేశించబడిన వ్యయ పరిమితికి మించి ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదు. ఎన్నికల బాండ్ల పథకం కేవలం భారత ప్రజాస్వామ్యం యొక్క పెరుగుతున్న బలహీనతను మాత్రమే నొక్కి చెపుతుంది. ఇది ఒక ఆదర్శవంతమైన పరిస్థితుల్లో పనిచేసి ఉండెడిది అయితే అప్పుడు దాని అవసరం ఉండేది కాదు. ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకే దీనిని రూపొందించినట్టు కనపడుతుంది.

రాజకీయ నాయకత్వం జవాబుదారీతనంతో పనిచేసే ఒక ప్రజాస్వామ్యంలో ఎన్నికల పోరాటం చేయడానికి పెద్ద మొత్తంలో నిధుల అవసరం గానీ, ఎన్నికల బాండ్లను రహస్యంగా కొనాల్సిన అవసరం గానీ లేదు. నిర్దేశించబడిన వ్యయ పరిమితికి మించి ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదు. ఎన్నికల బాండ్ల పథకం కేవలం భారత ప్రజాస్వామ్యం యొక్క పెరుగుతున్న బలహీనతను మాత్రమే నొక్కి చెపుతుంది.ఇది ఒక ఆదర్శవంతమైన పరిస్థితుల్లో పనిచేసి ఉండెడిది అయితే అప్పుడు దాని అవసరం ఉండేది కాదు. ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకే దీనిని రూపొం దించినట్టు కనపడుతుంది.

("ద హిందూ" సౌజన్యంతో)

(వ్యాస రచయిత జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

అందని కలగానే 'అందరికీ ఆరోగ్యం'



డా. కె.శివబాబు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆవిర్భావ దినమైన ఏప్రిల్ 7న ప్రతి ఏటా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా ప్రజారోగ్య పరిరక్షణలో ప్రాధాన్యత కలిగిన ఏదో ఒక అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డబ్ల్యూహెచ్ఓ ప్రతిఏటా ప్రకటిస్తుంది. 2024 సంవత్సరానికి గాను "నా ఆరోగ్యం -నా హక్కు" అన్న అంశాన్ని ప్రకటించింది. ప్రతివ్యక్తికీ "ఆరోగ్యం ప్రాథమిక హక్కు"గా గుర్తించిన ఏడు దశాబ్దాల తర్వాత నేటి పరిస్థితి మనం స్థూలంగా అవగాహన చేసుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 1948లో ఆరోగ్యం ప్రతి మనిషికీ ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అనేక అంతర్జాతీయ, ప్రాంతీయ మానవ హక్కుల ఒప్పందాలలో కూడా ఆరోగ్యం ప్రజలకు ప్రాథమిక హక్కుగా గుర్తించబడింది. ప్రపంచ ఆరోగ్యసంస్థలోని సభ్య దేశాలన్నీ అత్యున్నత ప్రమా ణాలు కలిగిన ఆరోగ్య హక్కును పౌరులందరికీ కల్పించేలా ఒప్పందంలో భాగస్వాములయ్యాయి. కానీ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ఆర్థిక ప్రణాళికలలో భాగంగా ఆరోగ్యం గురించి కేటాయింపులు, నామ మాత్రపు కృషి తప్పించి ప్రత్యేక లక్ష్యాలు, విధానాల గురించి చర్చ 1978 సంవత్సరానికి ముందు జరగలేదు. ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువగా ఉన్న 450 కోట్ల మందికి అవసరమైన మేరకు ఆరోగ్య సంరక్షణ కల్పించబడటం లేదని 2021 గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్యాన్ని ఈ విధంగా నిర్వచించింది. ఆరోగ్యమంటే కేవలం వ్యాధి లేక బలహీనత లేకపోవడం కాదు. ఒక పరిపూర్ణమైన శారీరక, మానసిక, సామాజిక స్వస్థత కలిగి వుండటం. ఈ నిర్వచనాన్ని మనం సమగ్రంగా అర్థం చేసుకోవాల్సి వుంది. ఆరోగ్యమంటే కేవలం ఒక వైద్యుని సంప్రదించగలగడమో, మందులు వాడు కోగలగడమో, ఒక శస్త్రచికిత్స చేసుకోగలగడమో అనుకోవడం కాదు.. శారీరక, మానసిక, సామాజిక స్వస్థతల్ని కలిగి వుండటమే ఆరోగ్యమన్న పదానికి పరిపూర్ణమైన నిర్వచనంగా మనం అర్థం చేసుకోవాలి. శారీరక స్వస్థత అంటే హానిరహితమైన పోషకాహారం కలిగివుండటం, పరిశుభ్రమైన తాగునీటి వసతి కలిగివుండటం, పరిశుభ్రమైన వాతావరణం కలిగివుండటం వంటి హక్కులతో ముడిపడి వుంటుంది. మానసిక ఆరోగ్యమంటే తమ వ్యక్తిగత సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోగలగడం, దైనందిన జీవన ఒత్తిడులను ఎదుర్కోగలగడం, మెరుగైన సమాజానికి దోహదపడగలగడం వంటి అంశాలు కలిగి వుంటుంది. సామాజిక స్వస్థత అంటే సరైన విద్యా వకాశాలు, ఉపాధి అవకాశాలు, గృహవసతి, అంతరాలు లేని సామాజిక జీవితం, వివిధ వర్గాల ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, హింస నుండి స్వేచ్ఛ, వ్యక్తిగత అంశాల గోప్యతకు, రాజ్యాంగం కల్పించిన మానవహక్కులకు భరోసా వంటి అంశాలు కలిగి వుంటుంది. ఇంతటి సమగ్రమైన నిర్వచనం కలిగిన ఆరోగ్యాన్ని కేవలం ఆసుపత్రుల సంఖ్య, వైద్యుల సంఖ్య, మందుల లభ్యత వంటి అంశాల ఆధారంగా పరిశీలించకూడదు.

ప్రజలందరికీ ఆరోగ్యం అందించాలంటే ప్రభుత్వాలు తమ ఎజెండాలో ఈ అంశాలన్నింటికీ ప్రాధాన్యత ఇచ్చి తగినన్ని వనరుల్ని కేటాయించి ప్రణాళికలు రూపొందించాల్సి వుంది. ప్రజలందరికీ ఆరోగ్యాన్ని కల్పించాలన్న అజెండాను 1978లో అప్పటి సోవియట్ యూనియన్‌లో జరిగిన ప్రపంచ దేశాల సదస్సులో ఆల్మా-ఆటా డిక్లరేషన్ ద్వారా ఆ సదస్సులో పాల్గొన్న 134 దేశాలు ఆమోదించాయి. 2000 సంవత్సరం నాటికి అందరికీ ఆరోగ్యం అందించాలన్న ఆ డిక్లరేషన్‌లోనే అందుకు సరైన మార్గం పటిష్టమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను రూపొందించు కోవడమే అని కూడా పేర్కొన్నాయి. అందుకనుగుణంగా తదనంతర కాలంలో ఆయా దేశాలు తమ తమ జాతీయ ఆరోగ్య విధానాలు రూపొందించుకున్నాయి. ఈ క్రమంలోనే ఆల్మా-ఆటా డిక్లరేషన్ తర్వాత 1983లో మనదేశ జాతీయ ఆరోగ్య విధానం ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ప్రధానాంశంగా రూపొందించబడింది. ఈ డిక్లరేషన్ అనంతర కాలంలో కూడా మెజారిటి దేశాలలో అందరికీ ఆరోగ్యం సుదూరపు కలగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో ఆల్మా-ఆటా డిక్లరేషన్ చేయబడ్డ నలభై సంవత్సరాల తర్వాత 2018 అక్టోబర్‌లో కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన ఆరోగ్య విధాన సదస్సులో 120 దేశాలు పాల్గొన్నాయి. సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సాధనలో లోపాలు సరిదిద్ది ప్రజలందరికీ అత్యున్నత స్థాయి ఆరోగ్య సంరక్షణను పొందే హక్కును అమలు జేస్తామని తీర్మానించాయి. 'ఆస్తానా డిక్లరేషన్' అనంతరం కూడా మనదేశంలో ఆరోగ్యంపై కేటాయింపులు అరకొరగానే కొనసాగుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ స్థూల జాతీయోత్పత్తిలో కనీసం ఐదుశాతం ప్రజారోగ్యం కోసం కేటాయించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. తాజా గణాంకాలు పరిశీలిస్తే 2022-2023 ఆర్థిక సంవత్సంలో ప్రజారోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చు జీడీపీలో 2.1 శాతం మాత్రమే ఉంది.



మనదేశంలో సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను బలోపేతం చేయలేని స్థితికి కోవిడ్-19 సంక్షోభం తార్కాణంగా నిలుస్తుంది. కరోనా సంక్షోభంలో సంభవించిన మరణాలు మనదేశ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలోని లోటుపాట్లను బట్టబయలు చేసాయి. వైద్య వ్యవస్థ సంసిద్ధత కొరత, ఆక్సిజన్ లభ్యత లోపం, సరిపడా లేని పడకల లభ్యత వంటి అంశాలు ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలో దీర్ఘకాలికంగా నెలకొన్న దుస్థితిని ప్రతిబింబించాయి. అరకొర కేటాయింపులు, సిబ్బంది, ప్రాణావసర మందులు, వైద్య సామాగ్రి కొరతల వంటివి ఇందుకు దారితీసాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా భవిష్యత్తు ఆరోగ్య భద్రతపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి.

ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్టం కాకుండా ద్వితీయ, తృతీయ స్థాయి ఆసుపత్రులను, స్పెషలిస్టుల సంఖ్యను పెంచడం ద్వారా ప్రయత్నించినట్లయితే ప్రజారోగ్య సాధనకు చేసే కృషి పదేపదే విఫలమవుతుంది. సమగ్రమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను ఏర్పరచడం ద్వారా మాత్రమే ఏ దేశమైనా ప్రజారోగ్య సాధనలో ముందడుగు వేయగలుగుతుంది. అందుకే ఆరోగ్య హక్కు సాధనను అర్థం చేసుకోవాలంటే ముందుగా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను అవగాహన చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో నాలుగు కీలకమైన అంశాలు ఆవిష్కృతం కావాలి. ఒకటి భౌగోళికం గా అన్ని ప్రాంతాలలో సమానమైన వైద్యసౌకర్యాలు, మానవ జీవన ప్రమాణాలు సాధ్యమవ్వాలి. ఇప్పటికీ మనదేశంలో గ్రామీణ ప్రాంతాలు, ఆటవీ, గిరిజన మారుమూల పల్లెల్లో సరైన రవాణా, వైద్య సౌకర్యాలు అందుబాటులో లేవు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వలన వందల కొద్దీ మరణాలు సంభవిస్తున్నాయి.

రెండవది శాఖల మధ్య సమన్వయం. ఉదాహరణకు ఒక గ్రామంలో అతిసార ప్రబలితే చికిత్సకు వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం పెట్టి మందులు అందజేసి, సెలైన్ సీసాలు ఎక్కించినంత మాత్రాన పరిష్కారం కాదు. ఆ గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలడానికి మంచినీటి ట్యాంక్‌లో లేదా తాగునీటి పైపులైన్‌లలో కాలుష్యం కారణమై ఉంటే దానిని సరిచేసే పనికి సంబంధిత నీటి పారుదల శాఖ పూనుకోవాల్సి వుంటుంది. మూడవది ప్రజల భాగస్వామ్యం. ప్రజారోగ్య ప్రణాళికలు విజయవంతంగా అమలవడానికి ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. నాలుగవది సరైన సాంకేతికత. స్థానిక అవసరాల్ని తీర్చగలిగేవి. ఉపయోగించే వారికి (వైద్యసిబ్బంది), ఉపయోగపెట్టుకునే వారికి(ప్రజలు) అందుబాటులో ఉండేవి. శాస్త్రీయ నిరూపణ కలిగినవి. మనదేశంలో సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను బలోపేతం చేయలేని స్థితికి కోవిడ్-19 సంక్షోభం తార్కాణంగా నిలుస్తుంది. కరోనా సంక్షోభంలో సంభవిం చిన మరణాలు మనదేశ ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలోని లోటుపాట్ల ను బట్టబయలు చేసాయి. వైద్య వ్యవస్థ సంసిద్ధత కొరత, ఆక్సిజన్ లభ్యత లోపం, సరిపడా లేని పడకల లభ్యత వంటి అంశాలు ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలో దీర్ఘకాలికంగా నెలకొన్న దుస్థితిని ప్రతిబింబించాయి. అరకొర కేటాయింపులు, సిబ్బంది, ప్రాణావసర మందులు, వైద్య సామాగ్రి కొరతల వంటివి ఇందుకు దారితీసాయి.

ఇలాంటి పరిస్థితి రాకుండా భవిష్యత్తు ఆరోగ్య భద్రతపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాలి. ఆరోగ్యం ప్రజల హక్కుగా ఆచరణలో సాధ్యమయ్యేందుకు జీడీపీలో ఐదుశాతం బడ్జెట్ కేటాయించాలి. వ్యాధి చికిత్సకంటే ముందు వ్యాధి నివారణకు ప్రాధాన్యత ఉండే దిశగా ఆరోగ్య సంరక్షణా వ్యవస్థలో మార్పులు చేయాలి. ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించేందుకు అత్యంత కీలకమైన ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి కృషి చేయాలి. ప్రజలందరికీ రక్షిత నీటి సరఫరా, పారిశుధ్య కల్పన, గృహవసతి కల్పించాలి. ఉపాధి, సామాజిక సామరస్యం వంటి అంశాల సాధనకు చిత్తశుద్ధితో కూడిన విధానాల్ని పాలక, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు పోషించాలి.

(ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)

ధాన్యం కొనుగోలులో కొర్రీలు పెడితే సహించేది లేదు

- రైతులందరినీ సమీకరించి ఆందోళనకు పూనుకుంటాం
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు



నవతెలంగాణ- నేలకొండపల్లి

ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు కొర్రీలు పెడితే సహించేది లేదని, రైతులు సాగు చేసిన ప్రతి ధాన్యపు గింజను తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రాజేశ్వరం సమీపంలోని రైస్ మిల్లును తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సందర్శించి రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులపై యాజమాన్యంతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మిల్లు యాజమాన్యం వారు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రైతులు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజను ఎటువంటి షరతులు లేకుండా నేరుగా కొనుగోలు చేసి తగిన మద్దతు ధర చెల్లించాలన్నారు. ఇప్పటికే తీవ్ర వర్షాభావ నేపథ్యంలో సకాలంలో సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడి పంటలు పండించారన్నారు. అరకొరగా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో కూడా మిల్లర్లు కొర్రీలు పెట్టడం సరైనది కాదన్నారు. మిల్లర్స్ అంతా సిండికేట్ అయి కావాలనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా షరతులు పెడుతూ తిరస్కరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా మిల్లర్లు రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు విషయంలో పునరాలోచన చేసి షరతులు లేకుండా తగిన మద్దతు ధర చెల్లించాలని, లేనియెడల రైతులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు ఇంటూరి అశోక్, కూసుమంచి మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజశేఖర్, కార్యదర్శి బిక్కసాని గంగాధర్, మల్లెల సన్మతరావు, రాసాల కనకయ్య, ఎడవల్లి రమణారెడ్డి, పోట్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు, గోదాములు తనిఖీ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



స్టాక్ బోర్డులను దుకాణాల ఎదుట ప్రదర్శించాలని ఏడీఏ విజయచంద్ర ఎరువుల డీలర్లకు సూచించారు. మండల పరిధిలోని తల్లంపాడులో ఎరువుల దుకాణాలు, పెద్దతండాలో మార్క్ ఫెడ్ ఎరువుల గోదామును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరకు ఎవరైనా ఎరువులను విక్రయిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ రకానికి రూ.2,203లు సాధారణ రకాలకి రూ.2,183లు ధర చెల్లిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం...విజయం సాధిద్దాం

- ఎంపీ నామ నాగేశ్వరరావు
- అజాత శత్రువు నామను గెలిపించాలి
- రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



నవతెలంగాణ-వైరాటౌన్

బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే గుండెకాయ అని, పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కలిసి మెలిసి పని చేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం వైరాలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మదన్ లాల్, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్‌తో కలిసి మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి పని చేయబట్టే నాయకులుగా తాము ఎన్నో పదవులు అనుభవించామన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయిన ప్రజల్లో ఇప్పుడు మార్పు వచ్చిందని, అవకాశం కోసం ఎదురు చూస్తూ కసితో ఉన్నారని అన్నారు. క్షేత స్థాయిలో ప్రజలతో ఏకీభవించి, కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్లమెంట్ విజయం నాంది కావాలన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మోసపోయామని గ్రహించిన ప్రజలు ఈసారి కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కసిగా, సైలెంట్‌గా ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. తెలంగాణ, జిల్లా ప్రజల వాణిని పార్లమెంట్‌లో వినిపించాలంటే తప్పనిసరిగా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఏనాడూ పార్లమెంట్‌లో ప్రజల పక్షాన నోరు విప్పలేదన్నారు. తెలంగాణ బిల్లు పెట్టినప్పుడు మొదటి ఓటు తానే వేశానని గుర్తు చేశారు. రైతు బిడ్డగా ప్రజల కష్టాలు కళ్లారా చూశానని, 10 ఏళ్ల అభివృద్ధి ఎలా ఉంది? ఇప్పుడెలా ఉందో చూస్తున్నామని అన్నారు. తాగు, సాగు నీరు లేక ఎండిన పంటలతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లవేళలా కార్యకర్తలకు వెన్నుదన్నుగా అండగా నిలుస్తానని అన్నారు.

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ నామాను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. నామ గెలుపునకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులం కావాలన్నారు. కాంగ్రెస్ మాయ, మోసపు మాటలను నమ్మి మోసపోయిన ప్రజలు ఎన్నికల కోసం నిశ్శబ్దంగా కసితో ఎదురు చూస్తున్నారని అన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, రాములు నాయక్ మాట్లాడుతూ అబద్ధాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌ను పార్లమెంటు ఎన్నికల్లో మట్టి కరిపించాలని అన్నారు. బీఆర్ఎస్ కు క్షేత్ర స్థాయిలో బలమైన క్యాడర్, కార్యకర్తలు ఉన్నారని, నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు గిఫ్టుగా ఇద్దామన్నారు. నామా అజాత శత్రువని, అందరికీ కావాల్సిన నాయకుడు నామాను అందరం కలిసి కట్టుగా ముందుకు సాగి, గెలిపించుకోవాలని అన్నారు. కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వచ్చిందని, ఉత్తమ పార్లమెంటేరియన్ నామను మళ్లీ పార్లమెంట్‌కు పంపేందుకు శక్తియుక్తులను ప్రదర్శించాలన్నారు. బాణాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మదన్‌లాల్, రాములునాయక్, కొండబాల కోటేశ్వరరావు, ముళ్ళపాటి సీతారాములు, లాల్ అహ్మద్, రవి, విశ్వేశ్వరరావు, జీవన్, మాదినేని సునీత, కాపా మురళీ కృష్ణ, నంబూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలి

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నెకంటి



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నెకంటి సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శుక్రవారం వ్యకాస ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశం కారుమంచి గురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంగయ్య మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టాక ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక ఎత్తుగడలు అమలు చేశారన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో 2.64 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా తక్కువ మొత్తంలో నిధులు కేటాయించి పని దినాలు, వేతనం తగ్గించిందన్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఉపాధి పని చేస్తున్న కూలీలకు గౌరవ వేతనం ఇచ్చి, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా నాయకులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, వ్యకాస మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కత్రం ఉపేందర్, యాదగిరి, గుంటి వెంకన్న, నాగయ్య, వెంకటేశ్వర్లు, తుమాటి నాగయ్య, చంద్రయ్య, పగిడిపల్లి వెంకట్రావు, సైదులు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో అసమానతలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఖమ్మం

బీజేపీ పాలనలో దేశం రకరకాల అసమానతలతో విచ్ఛిన్నమైపోతుందని, ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ఈ దేశాన్ని అద్భుత జాతిగా నిర్మించిన బాబు జగ్జీవన్‌రామ్ బాటలో ఈ దేశ ప్రజానీకం నడవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలన్నా... రాజ్యాంగబద్ధ పాలన జరగాలన్న బాబు జగ్జీవన్‌రామ్ బాటలో దేశ ప్రజలు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కొత్తగూడెం భద్రాద్రి జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, ఖమ్మం నియోజక పార్లమెంటరీ ఎన్నికల ఇంచార్జి శివ కుమార్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియల్, ఐఎన్టీయుసీ ,మహిళా, యువజన, మైనారిటీ, కిసాన్ కాంగ్రెస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్, మిక్కిలినేని మంజుల నరేందర్, పల్లెబోయిన భారతి చంద్రం, గజ్జెల లక్ష్మీవెంకన్న పాల్గొన్నారు.

జామా మసీదులో నామ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం కస్బా బజార్ లోని జామా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు శుక్రవారం ప్రార్ధనలు చేశారు. ముస్లిం సోదరులందర్నీ ప్రత్యేకించి కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విడి విడిగా ముస్లిం సోదరులను కలిసి ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా సమీపంలోని వివిధ దుకాణాల వద్దకు కూడా వెళ్లి నామ ఓట్లు అభ్యర్థించారు. తనకే ఓటు వేసి, మెజార్టీతో గెలిపించాలని నామ వారిని కోరారు. ఈ సందర్భంగా నామ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఖమర్, తాజుద్దీన్, ఫిరోజ్, మగ్బూల్ , తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదలందరికీ అండ : పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



కాంగ్రెస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని, ప్రజలకి ఎవరికి ఏ సమస్య వచ్చినా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలో పెద్దతండా పంచాయతీ సాయిగణేశనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు వివాహాలకు హజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో వివాహాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, స్థానిక నాయకులు అజ్మీర అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్వరూప్ లేరనే వార్త బాధాకరం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

తెలుగు భాషలో మొదటి టెలివిజన్ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ ఇక లేరనే వార్త ప్రతి ఒక్కరినీ కలిచి వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ఆయన దూరదర్శన్‌లో వార్తలు చదివే తీరు ప్రతి ఒక్కరి హృదయాలకు హత్తుకునేదన్నారు. దూరదర్శన్ పేరు చెప్పగానే ఆయన పేరే గుర్తొచ్చేదని, శాంతి స్వరూప్ చదివే వార్త బాధకరమైనదైన... సంతోషకరమైనదైన ఆయన హవాభావాల్లోనే తెలిసేదని పేర్కొన్నారు. ఆయన ఆదర్శప్రాయమైన జీవితం నేటి యువతకు స్ఫూర్తి దాయకమని తెలిపారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో గుండె పోటుకి గురై శుక్రవారం తుదిశ్వాస విడిచారని తెలిసిందని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

'డీఆర్ఎస్'లో కృత్రిమ మేధా ప్రదర్శన

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో డిఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సాంకేతిక విజ్ఞాన శాస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. తొలుత కళాశాల మ్యాథమెటిక్స్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న మర మనుషుల ప్రాధాన్యత వాటి వల్ల ఉండే సాధక బాధకాలు జనాభా ఎక్కువ దేశాలకు వాటి వల్ల ఉన్న నష్టం ఉత్పత్తిలో వాటి పాతరను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ నైపుణ్యాల రాష్ట్ర అధికారి బాలు, కళాశాల ప్రిన్సిపాల్ తేనె నాగేశ్వర్‌రావు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండంట్ వి.మోహన్‌రెడ్డి, కళాశాల ఛైర్‌పర్సన్ వి.శోభారెడ్డి, కళాశాల ఏవో బి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి భూములు హాంఫట్..

- అధికారుల నిర్లక్ష్యం... భూబకాసురుల బరితెగింపు
- కమిషనర్ ఉత్తర్వులు పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు



నవతెలంగాణ-ముదిగొండ

లక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూములు ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణగా కబ్జాలకు గురవుతున్నాయి. దేవాలయ భూములు కబ్జా చేసేందుకు సుమారు ఆరు నెలల నుండి భూ అక్రమదారులు ప్లాన్ చేస్తున్నారు.సువర్ణాపురం రెవిన్యూ పరిధిలో 308, 309, 310 సర్వే నెంబర్లలో 33 ఎకరాల 26 కుంటలు లక్ష్మీనరసింహ, చెన్నకేశవస్వామి దేవాలయాల భూములు ముదిగొండ సమీపాన ఉన్నాయి. ఈ భూముల్లో నుండి జాతీయ రహదారి (బైపాస్) ఖమ్మం వరకు వెళుతుంది. ముదిగొండకు చెందిన కొందరు భూఅక్రమదారులు గతంలో దేవాలయ భూమి నాలుగు ఎకరాలు కబ్జా చేసి జాతీయ రహదారి నిర్మాణం చేసే కాంట్రాక్టర్లకు విక్రయించుకొని భారీగా దండుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములను రక్షించుకొనుటకు దేవాలయ భక్తులు, పూజారులు జిల్లా ఉన్నతాధికారులుతోపాటు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వినతిపత్రాలు ఇచ్చిన తూతూ మంత్రంగా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన భూఅక్రమదారులు భూముల్లో దేవదాయ శాఖ హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేసినా ఆ బోర్డులను మాయం చేసి చెరువులో వేసి హద్దులు తొలగించారు. దేవాలయ భూదందాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భూబకాసురులు బరితెగించారు. దేవాలయ భూములన్ని దేవాదాయ శాఖ స్వాధీనంలో ఉండే విధంగా హైదరాబాద్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి దేవాదాయ భూములు రక్షించాలని ఉత్తరాలు జారీచేసినా ఖమ్మం జిల్లా దేవాదాయ శాఖ అధికారులతో పాటు ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదని బలంగా వాదనలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణానికి భూబకాసురులు విక్రయించిన నాలుగు ఎకరాల దేవాలయ భూముల లక్ష్మీనరసింహస్వామికే చెందే విధంగా దేవాదాయ శాఖ కమిషనర్ రికవరీ యాక్టు పెట్టినట్లు తెలిసింది. ఇప్పటికే ఖమ్మం జిల్లా దేవదాయ శాఖ అధికారులకు, ఈవో నారాయణ నారాయణచార్యులకు దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకునే విధంగా హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ నుండి లక్ష్మీనరసింహ, చెన్నకేశవస్వామి భూములను కాపాడాలని ఆదేశాలు అందినట్లు సమాచారం. ఈ ఆదేశాలు అందిన అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. భూబకాసురులు మాత్రం ఈభూములను ఎలా అన్యక్రాంతం చేయాలని కుట్రలతో ఆలోచనలు అధికారులకు వల విసురుతున్నారు. ఏకంగా లక్ష్మీనరసింహ చెన్నకేశవస్వామిలకు శఠగోపం పెట్టేందుకు భూమాఫియా గ్యాంగ్ కేటుగాళ్లు అడ్డదారులు తొక్కుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా పట్టించుకోకపోతే దేవాలయ భూములు భూబకాసురుల స్వాధీనంలోకి వెళ్లిపోవడం ఖాయమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ జన జాతరను విజయవంతం చేయండి

నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

నవతెలంగాణ- ఖమ్మం

హైదరాబాద్‌లో శనివారం తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో నిర్వహించనున్న తెలంగాణ జన జాతరను విజయవంతం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్, ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ పీసీసీ ఇన్చార్జి శివ కుమార్ కోరారు. శుక్రవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జావేద్ మాట్లాడుతూ మోడీ నిరంకుశ విధానానికి తుక్కుగూడ సభ నుండే చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం నుండి వేలాది సంఖ్యలో కార్యకర్తలు తరలి తెలంగాణ జన జాతర సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నియోజకవర్గం పార్లమెంటరీ పీసీసీ ఇంచార్జ్ శివకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాజకీయంగా ఖమ్మంకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఇచ్చిన జిల్లా ఖమ్మం అని అందుకు ఖమ్మం జిల్లా వాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం జిల్లా నుండి అత్యధిక మంది తరలి వచ్చి జన జాతర సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో 2వ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, 8వ డివిజన్ కార్పొరేటర్ లకావత్ సైదులు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదల అధ్యక్షుడు సయ్యద్ గౌస్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ ఉపాధ్యక్షులు కొంటేముక్కల నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నగర గద్దీ కొప్పుల ఆనందరావు, సీనియర్ మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్, ఎన్ఎస్యూఐ నగర అధ్యక్షుడు పేరం యశ్వంత్, మహిళ నాయకురాలు కొత్తపల్లి పుష్ప, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలి

- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా రూరల్, వైరా టౌన్, కొణిజర్ల మండలాల సంయుక్త సమావేశం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో వ్యకాస వైరా మండలం కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కార్మికులు, ఉపాధి కార్మికులు, దళితులు, పేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. పేదలు తినే ఆహారం మీద ఆంక్షలు పెడుతుందని, పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాలు నీరు కార్చి సంపన్నులకు ఊడిగం చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే నూటికి 60 శాతం వ్యవసాయ ఆధారంగా పనిచేస్తున్న చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు పని లేకుండా చేయడం కోసం రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చిందని విమర్శించారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో నూతన జీవోల ద్వారా రెండు పూటలా పని పద్ధతులు ప్రవేశపెట్టిందని, డ్రోన్ సిస్టం ద్వారా పని పర్యవేక్షిస్తూ రోజు కూలి 150 రూపాయలకు మించి ఇవ్వటం లేదని అన్నారు. గత రెండు సంవత్సరాల నుండి రద్దు చేసిన సమ్మర్ అలవెన్సులను పునరుద్ధరించాలని, రోజు కూలి కేరళ తరహాలో 600 రూపాయలు ఇవ్వాలని, సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన మంచినీళ్లు, మెడికల్ కిట్టు, టెంట్లు ఏర్పాటు చేయాలని, బిజెపి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ఉపాధికి ఏటేటా బడ్జెట్ తగ్గిస్తూ కూలీల సంఖ్యను కుదిస్తుందని, కేంద్ర బడ్జెట్లో మూడు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్ల సాధన కోసం ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలని, ఏప్రిల్ 14న రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్ జయంతి గ్రామ గ్రామాన జరపాలని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపిని రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి బిజెపి తెచ్చిన పెను ప్రమాదాన్ని దళితులు, పేదలందరికీ తెలియజేయాలని సూచించారు. ఉపాధి సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 21న ఖమ్మంలో జరుగు జిల్లా స్థాయి సదస్సుకు ఉపాధి మెట్లు, వాచర్లు, కూలి మేస్త్రీలు హాజరుకావాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు మేరుగు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్, మున్సిపల్ పట్టణాలలో కూడా ఉపాధి పనులు ప్రవేశపెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.2,500, పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇండ్లు, సాగు భూములు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి కృష్ణ, సంఘం జిల్లా నాయకులు చింతపల్లి ప్రసాద్, బోలమాల యోహాను, సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, షేక్ రెహానా, షేక్ మజీద్ బి, ఎస్కే ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలతో దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో బిజెపిని ఓడించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. సాగునీటి సమస్యతో ఎండిపోయిన మొక్కజొన్న పంటకు పరిహారం చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ లాగా ఎకరానికి పదివేల రూపాయలు పరిహారం ప్రకటించి అర కొర పరిహారం అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా ఎకరానికి 25 వేల రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు నెలలగా జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, కానీ నేటికీ ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. పార్టీ మండల కమిటీ సభ్యులు బంధం శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, గుడిపూడి వెంకటేశ్వరరావు, కిలారి సురేష్, నోముల పుల్లయ్య ఏడునూతల లక్ష్మణరావు, చిట్టిమోదు నాగేశ్వరరావు, కందికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు మండలల్లో పర్యటించిన దయాకర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జీ తుంబూరు దయాకర్‌రెడ్డి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఎర్రుపాలెం, మధిర, బోనకల్, ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో జరిగిన పలు వివాహాది శుభకార్యక్రమాలకు హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో ప్రసాద్‌రెడ్డి సమావేశం

నవతెలంగాణ-కూసుమంచి

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమావేశమై ముచ్చటించారు. అందరి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారితోనే కలిసి భోజనం చేశారు.

పొంగులేటి యువసేన కబడ్డీ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ...

మండలంలోని జీళ్ళ చెరువు గ్రామంలో శ్రీ రామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 14, 15, 16 వ తేదీలలో నిర్వహించనున్న పొంగులేటి యువసేన కమిటీ కబడ్డీ పోటీల బ్రోచర్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. పాలేరులోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు నిర్వాహకులతో మాట్లాడారు. విజయవంతంగా పోటీలు నిర్వహించాలని సూచించారు.

ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ప్రారంభించిన ప్రసాద్‌రెడ్డి

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జీ అండ్ టీ ఈవీ ఎలక్ట్రిక్ బైక్ షోరూంను కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్వయంగా ఓ బైకును నడిపి.. అంతా శుభం జరగాలని ఆకాంక్షించారు. రైతులు, చిరు వ్యాపారుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చిన హెవీ లోడ్ బైక్‌లను కూడా పరిశీలించారు. మంచి ఆదరణ పొంది.. పేరు గడించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్రాస్ యూనివర్సిటీలో కట్టెకోలకు సత్కారం

నవతెలంగాణ-ఖమ్మం

మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ కట్టెకోల చిన నరసయ్యకు ఘన సత్కారం లభించింది. మద్రాస్ మెరీనా బీచ్ ఆవరణ రజతోత్సవ ప్రాంగణంలో శుక్రవారం యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అధ్యక్షులు ఆచార్యులు విస్తాలి శంకరరావు అధ్యక్షతన శ్రీ క్రోధి ఉగాది వేడుకలను నిర్వహించారు. వేడుకలలో భాగంగా దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన తెలుగు కవులతో మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ చెన్నైకి చెందిన కవయిత్రి నిడమర్తి వసుంధరా దేవి నిర్వహణలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో కట్టెకోల చిన నరసయ్య పాల్గొని కవితను ఆలపించారు. అనంతరం చెన్నైకి చెందిన ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్యులు విస్తాలి శంకరరావులు కట్టెకోలను శాలువతో సత్కరించి, ప్రశంశాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

ఆటో కార్మికుల సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతి

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఐఎన్టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని ఐఎన్టీయుసీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు ఆధ్వర్యంలో కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసీ జిల్లా నాయకులు ఎండీ వై పాష, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.విప్లవ కుమార్, ప్రధాన కార్యదర్శి బొడ్డు సైదులు, జిల్లా కోశాధికారి తోట సైదులు, నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఏ.ప్రభాకర్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నగర కమిటీ నరసింహారావు, ఎం. వెంకట్ నాయుడు, సిద్దుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్వరూప్‌కు ఘన నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

దూరదర్శన్ తెలుగు తొలితరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతి పట్ల జర్నలిస్టులు ఘన నివాళులర్పించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో ఆనాటి బుల్లితెర న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ చిత్రపటానికి ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుద్దేటి రమేష్ బాబు, ప్రెస్ క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం మాట్లాడుతూ దూరదర్శన్ ఛానల్ తెలుగులో వార్తలు చదివిన తొలితరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ భౌతికంగా మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఆయన చూపిన మార్గం నేటి జర్నలిజానికి మార్గదర్శకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, సహాయ కార్యదర్శి జీవన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టీఎస్. చక్రవర్తి, వెంకటకృష్ణ, పానకాలరావు, తెలుగు ప్రభ శ్రీనివాస్, యాదగిరి, రాజు హెరాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్, మేరమ్మ ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో గల ఎస్టీ కాలనీలో సంతు సేవాలాల్ మహారాజ్ మేరమ్మ తల్లి గుడి నిర్మాణానికి శుక్రవారం తండా నాయకుడు భూక్యా బాలాజీ దంపతులు భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన చేశారు. కార్ బార్ మూడు బాలాజీ, మోతాదు నునావత్ లక్ష్మణుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జమ లాపురం గ్రామానికి చెందిన ఖమ్మం కెఎస్ఆర్ గ్రానైట్స్ అధిపతి తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి నిర్మలకుమారి,ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు,మాజీ గ్రామ పంచాయతీ సర్పంచ్ మూల్పూరి స్వప్న హాజరై భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు ధరావత్ చంద్రు, భూక్య కృష్ణ, మెగావత్ పండు, నాగేశ్వర్‌రెడ్డి, అంకసాల శ్రీనివాసరావు, వీరమాచినేని వెంకట కృష్ణారావు, నన్నపనేని రామారావు, అంకిరెడ్డి, వెంకటరామ్ రెడ్డి, వాసిరెడ్డి శివకుమారి, రమేష్, గాద్రి యేలు, మురళీధర్, శ్రీను, తండా కమిటీ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వా రందరికీ హతిరాం బాబాజీ సంత్ సేవాలాల్ భక్తి సేవా సంఘం తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తె లియజేశారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కోసం చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వేణు శుక్రవారం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎండలు మండుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైరా మున్సిపాలిటీలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ పోస్ట్ తనిఖీ

పెనుబల్లి : ఖమ్మం జిల్లా సరిహద్దు చెక్పోస్ట్ పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామం లోని రవాణా శాఖ చెక్పోస్ట్ ను గురువారం జిల్లా రవాణా శాఖ అధికారి అఫ్రిన్ సిద్దికి తనిఖీ చేసారు. రాష్ట్ర సరిహద్దు లోని వాహనాల తనిఖీ తీరు ఆన్లైన్ ప్రెమెంట్స్ రిజిస్టర్ ల తనిఖీ నిర్వహించినారు. ఈ కార్యక్రమం లో ఎంవి ఐ విజయ లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

‘గీతాంజలి’కి చత్రాలయ పురస్కారం

నవతెలంగాణ-ఖమ్మం టౌన్



గీతాంజలి విద్యానికేతన్ పాఠశాలకు అరుదైన గౌరవం చత్రాలయ పురస్కార్ (ఉత్తమ విద్యాసంస్థ) అవార్డు లభించింది. సుచిరిండియా ఫౌండేషన్ హైద్రాబాద్ వారు శ్రీ సత్యసాయి నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంటెండ్ టి.వి అప్పారావు ఈ అవార్డున స్వీకరించారు. ఈ అవార్డును ఆస్కార్ అవార్డు విజేత ప్రముఖ కవి, గాయకుడు చంద్రబోస్, డీఆర్‌డీవో చైర్మెన్ డా.జి సతీష్‌రెడ్డిలు పాఠశాల కరస్పాంటెండెంట్ టివి అప్పారావుకు అందజేశారు. గత 21 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నందుకు ఈ అవార్డును బహూకరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో మొత్తం 8 పాఠశాలలకు ఈ అవార్డును అందజేశారు. అందులో గీతాంజలి పాఠశాల ఒకటి కావడం విశేషం.

నిరుపేదలకు చీరెలు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు



తల్లిదండ్రులకు మించిన దైవం లేదని భావించి వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బీరవల్లి నరసింహ, పుల్లమ్మ దంపతుల తనయులు ప్రముఖ పారిశ్రామికవేత్త బీరవల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ బీరవల్లి రఘు శుక్రవారం నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. తన తల్లి బీరవల్లి పుల్లమ్మ 11వ వర్ధంతి సందర్భంగా తమ స్వగ్రామైన యర్రబోయినపల్లిలో గ్రామస్తులకు అన్నదానంతో పాటు 500 మంది వితంతువులకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీవీఎల్ నరసింహారావు, బీరవల్లి మోహన్‌రావు, కటుకూరి వెంకటేశ్వర్లు, బీరవల్లి ఆదినారాయణ, బీరవల్లి కృష్ణయ్య, బీరవల్లి భీమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు

నవతెలంగాణ-కూసుమంచి



గతంలో కేంద్ర ప్రభుత్వం 2005లో ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకానికి సమగ్రమైన నిధులు కేటాయించి 200 రోజులు పని కల్పించి రోజుకు రూ .600 రూపాయలు చొప్పున కేటాయించాలని, కేంద్ర బడ్జెట్లో 2,50,000 కోట్లు కేటాయించి, వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం తీసుకురావాలని, కూలి బీమా, కూలి బంద్ సౌకర్యాలు కల్పించాలని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని పోచారం గ్రామంలో వ్యవసాయ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం గత పది సంవత్సరాల నుంచి వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ చట్టాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగసంస్థలను వ్యవసాయ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ అప్పచెప్పేందుకు ప్రయత్నం చేస్తున్నారని, సంపన్నులకు పనురాయితీ ఇస్తూ పది లక్షల కోట్ల రూపాయలు రద్దు చేశారన్నారు. ప్రజలపై పన్ను రూపంలో వేసి వసూలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కాలంలో పోరాటం నిర్వహించాలని, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గన్యా నాయక్, గ్రామ నాయకులు వెంకట్, నారాయణ, రంగయ్య, మస్తానయ్య, వెంకట్, లక్ష్మి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

- ఉమ్మడి జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి కే.సురేంద్ర మోహన్

నవతెలంగాణ-కూసుమంచి



జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని, ఉమ్మడి జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కే.సురేందర్ మోహన్ తెలిపారు. జిల్లా త్రాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుండి పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు వచ్చి చేరుతున్నాయి. శుక్రవారం మండలంలోని పాలేరు జలాశయంలో నీటి నిల్వను జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాగర్ జలాలతో నేటి మధ్యాహ్నం వరకు పాలేరు జలాశయం నీటి స్థాయి 11 అడుగులకు చేరిందని, ఇప్పటి వరకు పాయింట్ 5 టీఎంసీ నీరు విడుదలయిందని తెలిపారు. మరో పాయింట్ 5 టీఎంసీ నీటి విడుదలకు సంప్రదింపులు జరిపి చర్యలు చేపడతామని చెప్పారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ బీ. సత్యప్రసాద్, శిక్షణ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్, ఆర్డీఓ జి.గణేష్, ఇరిగేషన్, మిషన్ భగీరథ ఈఈలు మంగళంపూడి వెంకటేశ్వర్లు, అనన్య, పుష్పలత, వాణిశ్రీ, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న నూతన ప్రభుత్వం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టీ.నాగరాజు

నవతెలంగాణ-ఖమ్మం



గత ప్రభుత్వం లాగానే నూతన ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టీ.నాగరాజు ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ 46 వ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ప్రారంభ సూచికగా జెండా ఆవిష్కరణ చేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు బొంతు రాంబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం 23 ఏళ్ల వయసులోని సైతం చిరునవ్వుతో ముద్దాడినటువంటి భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని విద్యరంగ సమస్యల పరిష్కారం కోసం ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు డైట్ చార్జీలను ఇవ్వకుండా ఇదే రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ. వీరభద్రం మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కారానికి నిరంతరం పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ అని, భవిష్యత్తులో ఇంకా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, వెంకటేష్, సరళ, సంగీత సహాయ కార్యదర్శి ప్రేమ్ కుమార్, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేందర్, వెంకటలక్ష్మి, నాగరాజు, ఉమేష్, వరుణ్, యశ్వంత్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్వేత, తిరుమల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని మతోన్మాదం నుండి కాపాడుకుందాం

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు శీలం నరసింహారావు

నవతెలంగాణ-మధిర



రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవాలని, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు శీలం నరసింహారావు అన్నారు. మధిర బోడేపూడి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రైతులు, కార్మికులు, పేద ప్రజలు, రైతులు వ్యవసాయ కూలీలు సాధారణ పేద ప్రజల బ్రతుకులు అత్యంత దయనీయమైన పరిస్థితిని చేరుకున్నాయని తెలిపారు. ప్రజలు మతోన్మాదులను వ్యతిరేకించాలని తెలిపారు. లౌకిక ప్రజాస్వామ్య, వామపక్ష వాదులకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు మందా సైదులు, మండవ పనింద్రకుమారి, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, తేలపోలు రాధాకృష్ణ, వడ్రానపు మధు, పల్లె కంటి వెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులు.. యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం వైరా రోడ్డులో ప్రైవేట్ టూ వీలర్ ఫైనాన్స్ రికవరీ ప్రైవేట్ వ్యక్తుల వేధింపులు తాలలేక ఓ యువకుడు ఖానాపురం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆగ్రా సమీపంలోని అయ్యేలా విలేజ్ కు చెందిన వినయ్ (27) బ్రతుకు దేరువు కోసం ఖమ్మం వచ్చి మార్బుల్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. వైరా రోడ్డులో ఉన్న టూ వీలర్ ఫైనాన్స్‌లో వినయ్ కొంత డబ్బు చెల్లించి టూ వీలర్ తీసుకున్నాడు. గత రెండు నెలలుగా వినయ్‌కి పనులు లేక ఫైనాన్స్ కట్టడం లేదు. రికవరీ ఏజంట్లు ఫైనాన్స్ చెల్లించాలని వాహనదారుడు వినయ్‌ను బల్లేపల్లి వద్ద వెంబడించి పట్టుకున్నారు. వినయ్‌ను పట్టుకుని పిడి గుద్దులతో భౌతిక దాడి చేశారని ఆరోపిస్తున్నారు. తీవ్ర గాయలయిన యువకుడు వారి నుంచి తప్పించుకుని, టూ వీలర్ పై కొంతదూరం పారిపోయాడు. ఏజెంట్లు పట్టు వదలకుండా వినయ్‌ను వెంబడించడంతో టూ వీలర్‌ను వదిలి భయంతో కొంతదూరం పరిగెత్తాడు. అలా పరుగెత్తి ఖానాపురం ట్యాంక్ బండ్ చెరువులో దూకాడు. అప్పటికే ఆయాసంతో ఉన్న యువకుడు చెరువులో దూకడంతో శ్వాస ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని ఖానాపురం పోలీసులు అన్నం ఫౌండేషన్ సభ్యుల సహాయంతో బయటకు తీసి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఫైనాన్స్ రికవరీ ఏజంట్ల వేధింపులే యువకుని మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. ఫైనాన్స్ వాళ వడ్డీకి, బారు వడ్డీ ఇతరేతర వాటి పేరుతో టూ వీలర్లు ఫైనాన్స్ ఇచ్చి జనాన్ని జలగల్ల పట్టి పీడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఖానాపురం పోలీస్ స్టేషన్ సీఐ భాను ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-వేంసూరు

మండల పరిధిలోని గూడూరు రాయుడుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని రామన్నపాలెం కుంచపర్తి అడిచర్లపాడు గ్రామాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్లు లైన్ మరమత్తులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని రాయుడుపాలెం అసిస్టెంట్ ఇంజనీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదిగొండ : మండలంలోని మాదాపురం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లో మరమ్మత్తులు, చెట్లు తొలగింపు ఉన్నందున శనివారం ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నదని విద్యుత్ శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తల్లాడ : అన్నారుగూడెం ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు అన్నారు గూడెం ఫీడర్ పరిధిలోని అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావు పేట, లక్ష్మీ నగర్, గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

గురుకుల కళాశాలలో అర్హత సాధించిన గాయత్రి కోచింగ్ సెంటర్ విద్యార్థులు

నవతెలంగాణ-కల్లూరు





తెలంగాణసాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళాశాల ప్రవేశ సీఓఈ సెట్ - 2024 నిర్వహించిన ప్రవేశ పరీక్షలో గాయత్రి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు కళాశాలలో సీట్ సాధించినట్లు నిర్వాహకులు జినుగు ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు మేక సిరి చందన, పెరుమాళ్ళపల్లి అన్వేష్ చరణ్, ఎంపీసీ గ్రూపులో సీట్ సాధించారు. ఖమ్మంపాటి హన్సిత, ఎంఈసీ గ్రూప్‌లో సీట్ సాధించిందిని ప్రకటనలో పేర్కొన్నారు. సీటు సాధించిన విద్యార్థులను కోచింగ్ సెంటర్ నిర్వాహకులు జినుకు ఈశ్వరరావు, విద్యార్థులను అభినందించి తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

భూసార పరీక్షపై అవగాహన

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో మాదాపురం గ్రామాన్ని మధిర డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల పంట పండించే వ్యవసాయ భూముల్లో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పంట భూమిలో మట్టి నమూనాను ఏవిధంగా సేకరించాలని రైతులకు ఆయన చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల పంట భూమిలో భూసార పరీక్ష వలన సారవంతం ఎంత మోతదులో (నత్రజని,భాస్వరం పొటాషియం) ఉందని తెలుసుకొని,మట్టి పరీక్ష ఫలితాల ద్వారా భూమిలో ఏఎరువు ఎంత మోతాదులో వెయ్యాలో తెలుసుకోవచ్చున్నారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు రైతులకు వివరించి అవగాహన కల్పించారు. గ్రామంలోని కొంతమంది రైతుల భూముల నుండి మట్టి నమూనాలను సేకరించి ఖమ్మం, రఘునాధపాలెం మట్టి పరీక్ష కేంద్రములకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వీ.దివ్యమనిషా, మాజీ సర్పంచ్ యరబోలు వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ క్లర్కు కాటేపల్లి బిక్షమయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



దేశ తొలి ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేట దళితవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల సహాయ కార్యదర్శి కష్టాల ఆంతోని అధ్యక్షతన సభ జరిగిన కార్యక్రమంలో కెవిపిఎస్ ఖమ్మం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నందిగామ కృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు భారతదేశ తొలి ఉప ప్రధాని దళితుల హక్కులకై అవిశ్రాంతం పనిచేసిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు నూకల బాలరాజు, నందిపాటి లక్ష్మయ్య, దళిత మహిళ నాయకురాలు నందిగామ మైసమ్మ, కోడి లక్ష్మి, బోయిన సామ్రాజ్యం, నందిగామ కళ్యాణి ,మారపొంగు వెంకాయమ్మ, నందిగామ ఉష, తిప్పర్తి జయమ్మ, నందిగామ రష్మిత, బోయిన ఋషి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభివృద్ధి ప్రదాత బాబూ జగ్జీవన్‌రామ్

నవతెలంగాణ-నేలకొండపల్లి


ఖమ్మం త్రివేణి పాఠశాలలో....

అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన అభివృద్ధి ప్రదాత బాబు జగ్జీవన్‌రామ్ అని కేవీపీఎస్ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు పొట్టపింజర పుల్లయ్య, బాబు వేణు, వేసు వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగరాజు, నవీన్, వినోద్, భాస్కర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్ రావు 117 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఐడియాలజిస్ట్ పెద్దపాక వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెదపాక వెంకటేశ్వర్లు, మాతంగి రాజా, కుక్కల వెంకటేశ్వర్లు, రత్నం, గండు సైదులు, బాలబోయిన వెంకటేశ్వర్లు, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, జగ్జీవన్‌రామ్ యూత్ అధ్యక్షుడు ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం: బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఖమ్మం జిల్లాలోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీఓసీ కలెక్టరేట్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీవోస్ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ రమేష్, జిల్లా ట్రెజరర్ శేషు, ప్రసాద్, జిల్లా నాయకులు నయూమ్ పాషా, పీ. వీరస్వామి, జే వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో....

నగరంలోని త్రివేణి పాఠశాలలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.

ఎర్రుపాలెం : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్‌ను కొనియాడారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు బండారు నరసింహారావు,కడియం శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరెడ్డి, అను మోలు వెంకటకృష్ణారావు, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ : మండల పరిధిలోని తెలగవరం గ్రామంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

సత్తుపల్లిరూరల్ : బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి మాజీ ఉపప్రధాని బాబూ జాగ్జీవన్ రామ్ అని బీజేఆర్ కమిటీ అధ్యక్షులు పుల్లారావు అన్నారు. సత్తుపల్లి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురు జగ్జీవనరామ్ విగ్రహం వద్ద, బీజేఆర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం బీజేఆర్ ఫౌండర్ కమిటీ అధ్యక్షులు ఇడుపులపాటి వెంకటేశ్వరరావు విగ్రహానికి గజమాలను వేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ న్యాయ సలహాదారు లాయర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడమ్స్, బీజేఆర్ కమిటీ అధ్యక్షులు ఎస్.పుల్లారావు, ప్రధానకార్యదర్శి జె.జగన్నాధం, ట్రెజరర్ ఐ.నాగేశ్వరరావు, ఎన్ బుచ్చయ్య, కె.బాలస్వామి, కేవీపీఎస్ పోరాట కమిటీ జిల్లా సభ్యులు సర్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు : జగ్జీవన్ రామ్ జయంతి శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. అడసర్ల పాడులో ఆయన విగ్రహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మధిర : మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ బాబు జగ్జీవన్ రావు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రంగా హనుమంతరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : మండల కేంద్రంలో శుక్రవారం కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ మండల అధ్యక్షులు సోమపువ్వు రాము అధ్యక్షతన నిర్వహించిన సభలో పాపిట్ల సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, సోమపొంగు రాము, కొమ్ము శంకర్, కే. కుటుంబరావు, శ్రీనివాస్, ది లోకేష్, కే .ఉప్పలయ్య, నాగేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు నుంచి పడి గిరిజనుడు మృతి

నవతెలంగాణ-ములకలపల్లి

తాటికల్లు గీసేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి గిరిజనుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సాయిరాంపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... మండల పరిధిలోని సాయిరాంపురం గ్రామానికి చెందిన వెంకటేష్ (43) కల్లు గీసి జీవనం సాగిస్తుంటాడు. రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారిపోవడంతో చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యక్తుల ప్రాణాలను కాపాడిన పోలీస్ సిబ్బందిని సత్కరించిన ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ వివిధ సంఘటనలలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను కాపాడిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల కాలంలో ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తికి సీపిఆర్ చేసి అతని ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ నాగరాజును, మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాయిగూడెం వద్ద గల గోదావరి నదిలో హెూలీ రోజున ఈతకు వెళ్లి సుడిగుండంలో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను కాపాడిన కానిస్టేబుళ్ళు సత్యనారాయణ, వినయ్‌లను, డయల్ 100 ఫోన్ రాగానే తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని కాపాడి సీపిఆర్ ద్వారా అతని ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ వీరా, హెూంగార్డు కృష్ణలను ఎస్పీ సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ నిత్యం విధులు నిర్వర్తించడమే కాకుండా ప్రజల ప్రాణాలను స్వయంగా కాపాడటంలో సమయస్ఫూర్తిని, ధైర్య సాహసాలను ప్రదర్శించి ప్రాణాలను కాపాడడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది అందరికీ గతంలో సీపిఆర్, ప్రథమ చికిత్సలపై అందించిన శిక్షణ మూలంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలను కాపాడటం సులువవుతుందని తెలిపారు. తోటి వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వారిని మనమే కాపాడే విధంగా ప్రతి ఒక్కరూ ప్రాథమిక జ్ఞానాన్ని కలిగి ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్బి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇల్లందు సీఐ కరుణాకర్, మణుగూరు సీఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే తలంబ్రాలు : డిపో మేనేజర్

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాస్థానంలో నిర్వహించే శ్రీరామ నవమి సందర్భంగా ఎంతో పవిత్రంగా భావించే శ్రీవారి తలంబ్రాలను నేరుగా ఇంటికే అందించే విధంగా ఆర్టీసీ సేవలందిస్తుందని కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు తెలిపారు. తొలుత కొత్తగూడెం డిపోలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం డీఎం మాట్లాడారు. ఈ నెల 17 బుధవారం భద్రాచలంలో జరుగు శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కల్యాణ ముత్యాల గోటి తలంబ్రాలు, రెండు ముత్యాలు టీఎస్ఆర్టిసి వారి లాజిస్టిక్ విభాగం ద్వారా తమ ఇంటి వద్దకే కేవలం రూ.151లకే చేరవేయబడతాయని తెలపారు. కావున ఎంతో ప్రత్యేకత, ప్రాముఖ్యత ఉన్న ఈ గోటి తలంబ్రాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మా ఆర్టీసీ కౌంటర్లు కొత్తగూడెం-91542 98599, 91542 98600, పాల్వంచ-93473 40036, ఇల్లందు-83280 18525, చంద్రగొండ-9110730476. నందు ఆన్‌లైన్, ఆఫ్ లైన్ బుకింగ్స్ సదుపాయం కలదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిపో ఉద్యోగులు ఇ.సునీత, ఆర్‌ఆర్‌కె.ప్రసాద్, చారీ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.హనుమ, డిపో సిబ్బంది, లాజిస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లారీలకు లోడింగ్ పెంచాలని జీఎంకు వినతి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి లారీలకు లోడింగ్ పెంచాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. శుక్రవారం కోల్ ట్రాన్స పోర్ట్ వారు లారీ ఓనర్స్ అసోసియేషన్ గుమస్తాల సంఘం బొగ్గుముట వారి డ్రైవర్స్ క్లీనర్స్ అసోసియేషన్ వారు మణుగూరు సింగరేణి జీఎం డి.రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.అయోధ్య మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో ఈ ప్రాంత ప్రజలు ఇంటి స్థలాలు, భూములు, ఇల్లులు, సర్వస్వంకోల్పోయి సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటు పడ్డారని సింగరేణి అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీనారాయణ, సిపిఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామారావు, ఏసుబాబు, కోల్ ట్రాన్స్ పోర్టు వారు మురళి శేఖర్ రెడ్డి, డ్రైవర్ సంఘం అధ్యక్షులు సంతోష్, రాజు, ఏఐటీయూసీ మండల ఉపాధ్యక్షులు అధర్ల సురేందర్, గుమస్తా సంఘం నాయకులు తోట రమేష్, బొగ్గు ముఠా సంఘం కార్యదర్శి జక్కుల రాజబాబు, వీరమల్లు తుపుడి శీను తదితరులు పాల్గొన్నారు.

11 మంది మావోయిస్టుల మృతదేహాలు గుర్తింపు

- ఇద్దరు మావోయిస్టులను గుర్తించాల్సి ఉంది

నవతెలంగాణ-చర్ల



సరిహద్దు ఛత్తీస్‌గడ్ బీజాపూర్ జిల్లా బెంగుళూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్లో 13 మంది మావోయిస్టులు మృతి చెందగా ఇప్పటివరకు 11 మంది మావోయిస్టులను గుర్తించినట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఎదురుకాల్పుల అనంతరం సంఘటన స్థలంలో శోధన సమయంలో, ముగ్గురు మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 13 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు, మొత్తం 13 మంది మావోయిస్టుల మృతదేహాలలో, 11 గుర్తించబడ్డాయి. అందులో ఎక్కువ పీఎల్‌జీఏ రెండవ నెంబర్ బెటాలియన్‌కి చెందిన మావోయిస్టులు ఉన్నారు. వరుసగా సుఖరామ్ హేమ్లా, హంగా పార్సీ, లఖు కోర్సా, సీతక్క (జిత్రు డివిసి భార్య), దులా కుహ్రామ్ సోను అవలం, సుద్రు హేమ్లా, చైతు పోటం లచ్చు కట్టి, లక్ష్మి తాటి, కమలి కుంజమ్, మరో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని ములకపాడు గ్రామ పంచాయతీలోని కమ్మబజార్‌లో మంచినీటి బోరు మరమ్మతుల గురైంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీడీవో ఈదయ్య వెంటనే మరమ్మతులు చేయించడంతో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. బోరింగ్ మరమ్మతులకు గురైందని చెప్పిన వెంటనే మెకానిక్ సంతోష్‌తో మరమ్మతులు చేపించి తాగునీటి సమస్య పరిష్కరించిన ఎంపీడీవో ఈదయ్యకు గ్రామస్తులతో పాటు బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు జంగిలి రాము కృతజ్ఞతలు తెలియజేశారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న హైకోర్టు జస్టిస్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను తెలంగాణ హైకోర్టు జస్టిస్ టి.మాధవి దేవి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం వారు సీత కుటీర ప్రదేశంతో పాటు, నార చీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. దుమ్ముగూడెం ఎస్ఐ కేశవ్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట భద్రాచల రామాలయ సీసీ అనిల్ తదితరులు ఉన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం



భారత తొలి దళిత ఉప ప్రధాన మంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కార్యాలయాల్లో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు : సీపీఐ

అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పరితపించిన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని, సంఘ సంస్కర్తగా, దళితుల పక్షపాతిగా బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు నేటితరానికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. జయంతిని శుక్రవారం సీపీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో : భారతీయ సమాజానికి బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు మరువలేనివి అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇల్లందు సిఐ కరుణాకర్, మణుగూరు సీఐ సతీష్, ఆర్ఐలు రవి, సుధాకర్, కృష్ణారావు సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో : కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సోసియేషన్ అధ్యక్షుడు లకినేని సత్యనారాయణ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గ సభ్యులు తోట మల్లేశ్వరరావు, అరకాల కరుణాకర్, ఎస్.కె.సాదిక్ పాషా, దూదిపాల రవికుమార్, చందుపట్ల ప్రవీణ్ నల్లమల ప్రతిభ కేజీపీ ఏపూరి బాబురావు, రేపాక వెంకటరత్నం, రమేష్ కుమార్ మక్కడ్, జనపరెడ్డి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో : బాబు జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న అన్నారు. సిఐటియు సామాజిక సమస్యలపై తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆస్పటల్ కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ మహానుభావుని జయంతి సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కులాల పేరు మీద, మతాల పేరు మీద జరుగుతున్న బిజెపి ఆర్ఎస్ఎస్ మూకల దాడుల్ని ఆయన ఖండిస్తూ, జాతి మొత్తం ఐక్యంగా కుల, మత తత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుగుణ, మల్లేశ్వరి, వినయ్, లక్ష్మి, నరసమ్మ, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో

భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర రావు, సీపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా పాల్గొని మాట్లాడారు. ముందుగా బాబు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బ్యాంకింగ్ అధినేత మందా హనుమంతు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు, చుంచుపల్లి మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు అంతోటి పాల్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సారపాకలో పోలీసుల కార్డెన్ సెర్చ్

- 25 వాహనాలు సీజ్

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని సారపాకలో గల గాంధీ నగర్, ఒడియాక్యాంప్లలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు ఇంటింటికి వెళ్లి ద్విచక్రవాహనాలకు సంబంధించి వివరాలు నమోదు చేసుకుని సరైన పత్రాలు లేని 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించి వాహనాలు తనిఖీ చేయడంతో పాటు కొత్తగా ఎవరైనా అనుమానితులు వచ్చారా లేదా అని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు కనిపిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐకి సూచించారు. సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలను ట్రాక్టర్ ద్వారా పోలీసుస్టేషన్కు తరలించారు. ఈ కార్డెన్ సెర్చ్ బూర్గంపహాడ్ ఎస్సైలు సుమన్, నాగభిక్షంతో పాటు సుమారు 72 మంది సివిల్ పోలీసులు, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి భక్తులు తరలి రండి

- రామయ్య కల్యాణానికి సకల ఏర్పాట్లతో స్వాగతం
- పాత్రికేయుల సమావేశంలో ఈఓ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని రామయ్య కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో తరలి రావాలని ఆలయ ఈవో ఎల్.రమాదేవి కోరారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...17వ తారీఖున మిథిలా స్టేడియంలో సీతారాముల తిరు కల్యాణ మహోత్సవం అదేవిధంగా 18వ తారీఖున భద్రాద్రి రామయ్య పట్టాభిషేక కార్యక్రమాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధ్యాత్మిక సంప్రదాయ పద్ధంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు సైతం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆమె తెలియజేశారు. అదేవిధంగా ఆర్టీసీ వారు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని సైతం కల్పిస్తున్న నేపథ్యంలో ఈసారి శ్రీరామనవమికి భక్తుల సంఖ్య అత్యధిక సంఖ్యలో పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ ప్రాంతాల నుండి విచ్చేసే భక్తులు సీతారాముల కల్యాణం వీక్షించడానికి 16 సెక్టార్లు ఏర్పాటు చేస్తామని, రెండున్నర లక్షల లడ్డూలు తయారు చేస్తామని, ఐదు లక్షల ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్లను సిద్ధం చేశామని అన్నారు. రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులకు పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థల వారు ఉచితంగా అన్నదానాలతో పాటు మజ్జిగ, చలివేంద్రాలు, పానకం సెంటర్లు ఏర్పాటు చేస్తారని దేవస్థానం ఆధ్వర్యంలో కూడా ఉచిత అన్న ప్రసాద సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ఆమె ఈ సందర్భంగా పాత్రికేయులకు తెలియజేశారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీకి కార్మిక సంఘాల వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



పాల్వంచ పట్టణంలో రిలయన్స్ స్టోర్‌లో స్థానిక హమాలీలకు అన్ లోడింగ్‌పని ఇస్తూ చేసుకున్న ఒప్పందాన్ని అమలుకు సహకరించాలని ఎస్పీ రోహిత్ రాజుని కలిసిన సీఐటీయూ, ఏఐటియూసీ ప్రతినిధులు కోరారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యను ఎస్పీకి వివరించారు. గత సంవత్సరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రిలయన్స్ ప్రతినిధులతో భద్రాచలం రోడ్ హమాలీ యూనియన్, సీఐటియూతో జరిగిన చర్చల్లో పరస్పరం అంగీకారానికి వచ్చిన అన్ లోడింగ్ పని ఒప్పందాన్ని అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. స్టోర్ ఎదుట ధర్నా చేసిన ప్రతీ సందర్భంలో హామీ ఇవ్వడం, వాయిదాలు మీద వాయిదాలు పెట్టడం చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్పీకి సీఐటీయూ, ఏఐటీయూసీ ప్రతినిధి బృందం వివరించారు. గత 29 సంవత్సరాల క్రితం పాల్వంచ పట్టణంలో లోడింగ్, అన్ లోడింగ్ పనిని ఏయే ప్రాంతాలు ఏఏ యూనియన్‌లు చేయాలో సమస్య ఎదురైనప్పుడు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి సమక్షంలో చర్చలు జరిగి, యూనియన్‌ల మధ్య ఏరియాలను నిర్ణయిస్తూ ఒక ఆర్డర్‌ని ఇచ్చారని తెలిపారు. దాని ఆధారంగా రిలయన్స్ స్టోర్‌లో అన్ లోడింగ్ పనిని భద్రాచలం రోడ్ హమాలీ యూనియన్‌కి ఇవ్వాలని అన్నారు. దీని ప్రకారంగానే రిలయన్స్ యాజమాన్యం దగ్గర చర్చలు జరిగాయని, ఈ చర్చల్లో ఐదుగురు హమాలిలను పనిలో తీసుకుంటామని, నెలకు రూ.75 వేలు ఇస్తామని అంగీకరించారని అన్నారు. జనవరి 1 నుండి పనిలోకి తీసుకుంటామని చెప్పినప్పటికీ మూడు నెలలు పూర్తి అయినప్పటికీ నేటి వరకు ఒప్పందాన్ని అమలుకు సిద్ధపడటం లేదని అన్నారు. ఈ ఒప్పందాన్ని అమలుకి సంపూర్ణంగా సహకరించాలని ఎస్పీని కార్మిక సంఘాల నాయకులు కోరారు. సమస్యపై స్పందించిన ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ కార్మికులది న్యాయమైన సమస్య అని, సమస్య పరిష్కారంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసిన ప్రతినిధి బృందంలో సీఐటియూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్, ఉపాధ్యక్షులు ఎంవి.అప్పారావు, దొడ్డ రవి కుమార్, ఏఐటియూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య, సీఐటియూ జిల్లా సహాయ కార్యదర్శులు డి.వీరన్న, కె.సత్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, హమాలీ యూనియన్ నాయకులు గట్టయ్య, రాములు తదితరులు ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

నవతెలంగాణ-ములకలపల్లి



పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులు తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని ఉపాధి ప్రాంతాలను పరిశీలించి, ఉపాధి ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎర్రటి ఎండలో రెండు నెలల నుండి పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి కొంత మేర బడ్జెట్ కేటాయించి ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని, ఈ కుట్ర విరమించుకోవాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ లేకుండా చేస్తుందని ఆరోపించారు. దేశ సంపదను ఆదానీ, అంబానీల కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల కార్యదర్శి మాలోతు రావూజ, మండల నాయకులు భూక్యా సామిని, సీతారాములు, అమల, సిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చయ్యకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-మణుగూరు



రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన లారీ ఓనర్ కం డ్రైవర్ పిచ్చయ్యకు రూ.83 వేల ఆర్థిక సహాయం అందజేసి తమ ఔదార్యాన్ని మణుగూరు ఏరియా లారీ యజమానులు, డ్రైవర్లు హెల్పర్లు చాటుకున్నారు. ఇటీవల రామానుజవరం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి శాశ్వత అంగవైకల్యం ఏర్పడి దిక్కుతోచని స్థితిలో ఉన్న స్థానిక అశోక్ నగర్‌కు చెందిన లారీ ఓనర్ కం డ్రైవర్ పిచ్చయ్యకు వారు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా లారీ యజమానులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లారీ యజమానులు జున్నూరు వెంకన్న బాబు, స్వామి, మిడిదొడ్డ నాగేశ్వరరావు, తూపూడి శ్రీనివాస్ రావు, కనకయ్య, లాలు, చింటూ, బాలకృష్ణ, నాగయ్య, వెంకన్న, దామల్ల లక్ష్మణ్, రవి, మురళి, వలి, సింహాలం, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఏసీ సేవలు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు సింగరేణి ఏరియా ఆస్పత్రిలో క్యాజువాలిటీ వార్డులో ఏసీలు పనిచేయక రోగుల అవస్థలు పడుతున్నారని టీబీజీకేఎస్ నాయకులు నాగేల్లి వెంకట్ తెలిపారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక హాస్పటల్ నందు ఉన్న క్యాజువాలిటీ వార్డ్‌లో గత నాలుగు రోజులుగా ఏసీలు పని చేయక పోవడం మూలంగా చికిత్స పొందుతున్న కార్మికుల బాధలు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నట్టు తెలిపారు. సీలింగ్ ఫ్యాన్ ద్వారా వచ్చె గాలి విపరీతమైన వేడి వెదజల్లుతూ వీస్తుండడం వల్ల రాత్రి పూట కార్మికులు నిద్ర పోకుండా జాగారం చేయవలసి వస్తుందని ఆరోపించారు. ఉక్కపోత తట్టుకోలేక శరీరం పై భాగంలో ఉన్న వస్త్రాలను తొలగించి వాటిని విసన కర్ర లాగా ఊపుకుంటూ సేద తీరుతున్నారని అయన అవేదన వ్యక్తం చేశారు. కార్మిక ఆరోగ్య సంక్షేమం పై దృష్టి సారించే స్థానిక యాజమాన్యం హాస్పటల్ నందు ఉన్న క్యాజువాలిటీ వార్డ్‌లో ఏసీ సౌకర్యం పునరుద్ధరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని యాజమాన్యంకు అయన విజ్ఞప్తి చేశారు.

చంద్రన్న మమ్ములను బహిష్కరించడం కాదు

మేమే ఆయన నాయకత్వాన్ని తిరస్కరించి, తెగదెంపులు చేసుకున్నాము

- న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని, చిట్టిపాటి

నవతెలంగాణ-టేకులపల్లి



సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి హోదాలో మరో సీసీ సభ్యుడు అశోక్ ఘాయల్ మమ్మల్ని-అంటే సాదినేని వెంకటేశ్వరావు, చిట్టి పాటి వెంకటేశ్వర్లను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరిస్తున్నట్టు ప్రకటించడాన్ని మేముతీవ్రంగా ఖండిస్తున్నట్టు శుక్రవారం వారు తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులుగా మా ఇద్దర్ని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న వారిని కూడా బహిష్కరిస్తున్నట్టు ప్రకటించడం అనైతికమని, హాస్యాస్పదమైనదని పేర్కొన్నారు. 2013లో ప్రత్యేక పార్టీగా సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఏర్పడి, కొనసాగుతున్న క్రమంలో మొత్తం పార్టీని పార్టీ మౌలిక సిద్ధాంతాలకు, రాజకీయాలకు, అవగాహనకు అనుగుణ్యంగా నడపాల్సిన చంద్రన్న విప్లవేతర, పార్టీయేతర వ్యవహారాల్లో కూరుకుపోయాడని, పార్టీ కేంద్ర కమిటీని ఫంక్షనింగ్ చేయడంలో, రాష్ట్ర కమిటీలను సరైన విధంగా గైడ్ చేయడంలో విఫలతను ఎదుర్కొన్నారని తెలిపారు. గుంటూరు జిల్లాలో నాదేళ్ళ బ్రహ్మయ్యను అత్యంత కిరాతకంగా, అమానుషంగా హత్య చేయించిన తీరూ, ఆ తదుపరి మొత్తం పార్టీని అక్కడ దళిత, బహుజన, విప్లవ ప్రజాస్వామిక సంస్థలు బజారు కీడ్చుతున్న సందర్భానికి చంద్రన్న అనుస రించిన వైఖరే మూల కారణమన్నారు. విప్లవ కారుల ఐక్యత విషయంలో పార్టీ అఖిల భారత మహా సభ ఏకగ్రీవంగా తీర్మానించగా, దాన్ని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రన్న పాత్ర సరిగా లేదన్నారు. రివిజనిజం వైపు ముఖం తిప్పుతున్నారనడం కొండంత అబద్ధమన్నారు. బ్రహ్మయ్య హత్యకు చంద్రన్నకు సంబంధం లేదని, తనకు తానే కితాబు లిచ్చుకోవడం మొత్తం పార్టీ శ్రేణుల్ని, విప్లవ సంస్థల్ని, ప్రజాస్వామిక, దళిత, బహుజన సంస్థల్ని శ్రేణుల్ని వంచించడం, మోసపూరితమని మేము స్పష్టంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అందుకే మేమే మార్చి 24న రెండు రాష్ట్రాలకు చెందిన 104 మంది ప్రతినిధులతో జనరల్ బాడీ జరుపుకొని ఏకగ్రీవంగా చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తూ, తెగదెంపులు చేసుకుంటున్నామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పార్టీ శ్రేణుల్ని ఈ వాస్తవాల్ని ఆలోచించి, న్యూడెమోక్రసీతో నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి చిలుకల గండి ముత్యాలమ్మ తల్లి జాతర

- రక్షణ ఏర్పాట్లను పరిశీలించిన సీఐ జితేందర్ రెడ్డి



నవతెలంగాణ - అశ్వారావుపేట

మండలంలో గల వినాయకపురంలోని శ్రీశ్రీ చిలుకలు గండి ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం(ఏప్రిల్ 6) నుండి ప్రారంభం కానుంది. ఈ జాతరకు జిల్లాలోని అనేక మండలాల నుండే కాక సరిహద్దు రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరు అవుతారు. దీంతో శుక్రవారం స్థానిక సీఐ జితేందర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో ఎస్ఐ శ్రీరాముల శ్రీను, దేవాలయం ఈఓ సూర్యప్రకాశ్‌లు జాతర జరుగు ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, దర్శన క్యూలైన్లు, ట్రాఫిక్, పార్కింగ్ ప్రదేశాలను సందర్శించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా, పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సూర్యప్రకాశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ- పాల్వంచ రూరల్

మండల పరిధిలోని దేవా గుంపుకు చెందిన మడకం దేవా(40) శుక్రవారం తాటి చెట్టు పైనుండి పడి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు జీవనోపాధి కోసం భార్యతో కలిసి రంగాపురం గ్రామంలో మామిడి తోట వద్ద కాపలాగా ఉంటున్నాడు. మామిడి తోటలోకి వచ్చిన కోతులను తోలే క్రమంలో కోతులు మొత్తం తాటిచెట్లపై కూర్చొని మామిడికాయలు తింటున్నాయని చెట్టు ఎక్కడంతో కోతులు మీదకు రావడంతో దూకడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు సందర్శించి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. రూరల్ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిబద్ధతతో ప్రజాసేవ చేసిన వ్యక్తి జగ్జీవన్‌రామ్

- కేటీపీఎస్ చీఫ్ ఇంజనీరింగ్ ప్రభాకర్ రావు
- కేటీపీఎస్‌లో జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-పాల్వంచ

నిబద్ధతతో ప్రజాసేవ చేసిన వ్యక్తి జగ్జీవన్ రాం అని కేటీపీఎస్ చీఫ్ ఇంజనీరింగ్ ప్రభాకర్ రావు అన్నారు. కేటీపీఎస్ 5వ దశలోని ఎంసీఆర్ హాల్ నందు చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రాం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాబూ జగ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ కాలం రాజకీయాలలో ఉండి నిబద్ధతతో ప్రజాసేవ చేసిన జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో కార్మికులు, ఇంజనీర్లు పనిచేసి సంస్థకు అలాగే రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, కృష్ణ, మొక్షవీర్, రామారావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సౌకర్యాలు పరిశీలించిన సీడీపీవో

నవతెలంగాణ-అశ్వాపురం:

మండల పరిధిలోని మంచి కంటి నగర్ గ్రామ సమీపంలో గల ఆరిఫా, రోషిని వృద్ధుల ఆశ్రమాన్ని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్టు సీడీపీవో ప్రమీల సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఆశ్రమ నిర్వాహకులు అందజేస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వృద్ధులతో ఎస్‌వీఈఈపి కార్యక్రమం నిర్వహించి అంగన్వాడి టీచర్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్లు భారతి, విజయ, వాసం రమాదేవి, నాగమణి ఆశ్రమం నిర్వాహకులు షహనాజ్ బేగం, మెహరాజ్ పాల్గొన్నారు.

ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన వాసిరెడ్డి కృష్ణకుమారి

నవతెలంగాణ-చంద్రుగొండ

నిరంతర శ్రమ పట్టుదలతో 42 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత వాసిరెడ్డి కృష్ణ కుమారికి దక్కుతుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం అయ్యన్నపాలెంలోని లక్ష గార్డెన్‌లో వాసిరెడ్డి కృష్ణ కుమారి వెంకటేశ్వర్ల ఉద్యోగ విరమణ సన్మానం జరిగింది. ఈ సన్మాన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నిరంతర విద్యార్థిగా 42 సంవత్సరాల పాటు ఎంతో ఓపికతో ఉపాధ్యాయ వృత్తిని పూర్తిచేసిన కృష్ణకుమారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల విద్యాధికారి శ్రీరామమూర్తి, ఖమ్మం జిల్లా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రావు, సంగమేశ్వర రావు, కృష్ణమోహన్, ఎల్‌ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ సదానందం, టీఆర్టి మండల అధ్యక్షులు ఆరిఫ్, జైకర్, ఆర్‌వి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సును అప్పగించిన ఆటో డ్రైవర్లు

నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని అమెర్ద పంచాయతీలోని కొరసవారిగూడానికి చెందిన కుంజా సులోచన అనే మహిళ శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి ప్రధాన రహదారిపై కొంత నగదుతో కూడుకున్న పర్సు, ఆధార్ కార్డు పొరపాటున పడేసుకుంది. అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లకు ఆ పరుసు దొరికింది. దీంతో పర్సులో ఉన్న ఆధార్ కార్డు వివరాలను సేకరించి పర్సును మహిళకు అప్పగించారు. నగదును అందజేసిన వారిలో ఆటో డ్రైవర్లు బోళ్ల రమణయ్య, కొమ్ము రాంబాబు, మడిపెల్లి రమేష్, కొరసా వెంకటేశ్వర్లు చల్లగొండ వెంకన్న ఉన్నారు.

బొగ్గు రవాణా టెండర్ రద్దు చేయాలి

- టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో సమ్మె

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగుడెం ఓసీ నుంచి ఇల్లందుకు బొగ్గు రవాణా టెండర్‌ను రద్దు చేయాలని కోరుతూ, టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా శాంతియుతంగా సమ్మె కొనసాగుతున్నట్టు వారు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోయగూడెం ఓసీ సమీప గ్రామం వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించినట్టు అధ్యక్షులు నెలవెల్లి నరసింహారావు తెలిపారు. తమ ఆందోళనను సింగరేణి అధికారులు గమనించి, తక్కువ రేటుకు టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కు కనువిప్పు కలిగి టెండరు రద్దు చేసుకోవాలని ఆశిస్తున్నామని తెలిపారు. లేదంటే మా పరిస్థితి, మా లారీల పై పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామారావు, సురేష్, వీరన్న, వెంకన్న నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం



నవతెలంగాణ-చర్ల

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపునిచ్చారు. చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన శ్రీరామచంద్ర హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్నప్పటి నుంచే విద్యలో ఉన్న మెలకువలను నేర్చుకొని దశలవారీగా విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. మారుమూల ఏజెన్సీ నుంచి బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రముఖ న్యాయవాది కోటా దేవదానం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందుకు గురువులతో పాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సీనియర్ లెక్చరర్ తోటమల్ల బాలయోగి మాట్లాడుతూ తన శిష్యుడు కృష్ణమోహన్ ఎంతో సదాశయంతో నిర్వహిస్తున్న విద్యా సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర హైస్కూల్, కరస్పాండెంట్ ప్రధానోపాధ్యాయులు దర్శిశెట్టి కృష్ణమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మావోయిస్టుల పథకాలపై నిఘా

- బస్తర్‌లో శాంతియుత ఓటింగ్ కోసం విశ్వ ప్రయత్నం
- ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు 80 వేల మంది సైనికులు సంసిద్ధం
- ప్రతీ 19 మంది ఓటర్లకు ఒక సైనికుడు
- నిఘా నీడలో దండకారణ్యం
- నూతన పోలింగ్ స్టేషన్లు సైతం ఏర్పాటు



నవతెలంగాణ-చర్ల



ఈనెల 19 నుండి జూన్ 1వ తారీకు వరకు దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మావోయిస్టుల విధ్వంస పథకాలపై పోలీసు బలగాలు నిఘాను కట్టుదిట్టం చేశాయి. మావోయిస్టుల ఎత్తులకు పై ఎత్తు లేస్తూ పోలీసు బలగాలు దూసుకుపోవడానికి సంసిద్ధమవుతున్నట్లు సమాచారం. సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 7 దశల్లో ఓటింగ్ జరగనుంది. జూన్ 4వ తేదీన ఫలితం రానుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని 11 స్థానాలకు మూడు దశల్లో ఓటింగ్ జరగనుంది. మొదటి దశలో రాష్ట్రంలోని ఏకైక స్థానమైన బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటింగ్ జరగనుంది. బస్తర్ అత్యంత సున్నితమైన మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. మావోయిస్టుల సమస్య ఉన్న ఈ పార్లమెంటరీ నియోజకవర్గంలో తొలి దశలోనే భారీ బందోబస్తులో ఓటింగ్ నిర్వహించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బస్తర్‌లో మావోయిస్టులు రక్తపాతం సృష్టించారు. బస్తర్‌లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా మావోయిస్టులు తమ కుటిల పథకాలను అమలు చేయడం గమనార్హం. బస్తర్‌లో ఎన్నికల సందర్భంగా మావోయిస్టులు ప్రజాస్వామ్య పండుగను బహిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దానికి అవిధేయత చూపేవారిని టార్గెట్ చేయడానికి వారు వెనుకడుగు వేయరు. ఎన్నికల సమయంలో, మావోయిస్టులు ప్రజా ప్రతినిధులు, భద్రతా సిబ్బంది పోలింగ్ పార్టీలు లేదా అమాయక గ్రామస్థులను లక్ష్యంగా చేసుకుంటారు. బస్తర్‌లో ఎన్నికల సమయంలో హింస సర్వసాధారణం. బస్తర్ ఎన్నికల చరిత్రలో ఓటింగ్ సమయంలో మావోయిస్టులు కోసం ఇప్పిన పాము వలె బుసలు కొడుతూ చాలా చోట్ల రక్తం చిందించారు. ఈ క్రమంలో 2013 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పరివర్తన్ యాత్రపై మావోయిస్టులు దాడి చేశారు. ఇందులో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరణించారు. 30 మంది వరకు కాంగ్రెస్ నాయకులు మరణించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దంతెవాడలో బీజేపీ ఎమ్మెల్యే భీమా మాండవి కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఇందులో ఎమ్మెల్యేను మందుపాతరతో హత్య చేశారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మావోయిస్టులు ఎలాంటి నేరాలకు పాల్పడలేదు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి భయాందోళనలు రేపేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో బస్తర్‌లో భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేస్తున్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించేందుకు భద్రతా విభాగం సన్నాహాలు ప్రారంభించింది. బస్తర్ లోక్‌సభ పార్లమెంటరీ స్థానంలో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని అసెంబ్లీ స్థానాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు. ఇలాంటి పరిస్థితుల్లో బస్తర్‌లో మోహరించిన సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్టీఎఫ్, డీఆర్జీ సైనికులతో పాటు ఎన్నికల సంఘం అదనపు బలగాలను కూడా పంపనుంది.



శాంతియుత ఓటింగ్ కోసం మోహరించనున్న 80 వేల మంది సైనికులు

బస్తర్ లోక్‌సభ స్థానంలో శాంతియుతంగా ఓటింగ్ నిర్వహించేందుకు 80 వేల మంది సైనికులకు కమాండ్ ఆఫ్ సెక్యూరిటీ ఇవ్వనున్నారు. బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో 1,46,6337 మంది ఓటర్లు ఉన్నారు. అటువంటి పరిస్థితిలో, 19 మంది ఓటర్ల వెనుక ఒక భద్రతా సిబ్బందిని మోహరిస్తారు. దీంతో పాటు కొత్త క్యాంపులు ప్రారంభించిన బస్తర్‌లోని అంతర్గత ప్రాంతాల్లో కూడా ఈసారి ఓటింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్నందున అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, బయటి నుంచి బస్తర్ కు వచ్చే వారిపై నిఘా ఏర్పాటు చేసి భద్రతా బలగాలను మోహరించేందుకు కృషి చేస్తామని బస్తర్ ఐజీ సుందర్ లాల్‌పి తెలిపారు. వరుస ఎన్‌కౌంటర్లతో దండకారణ్యం దద్దరిల్లుతూ ఉంటే ప్రతీకర చర్యతో రగిలిపోతున్న మావోయిస్టులు ఏ సమయంలో ఎటు నుండి విరుచుకుపడతారో అర్థం కాని సందిగ్ధంలో ఆదివాసీ గ్రామాల్లో ఉన్న గిరిజనలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-అన్నపురెడ్డి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చాకచక్యంగా ఎస్ఐ చంద్రశేఖర్ శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచకి చెందిన బోగి మస్తానయ్య కాకర్ల పల్లి గ్రామానికి చెందిన పాకాల నాగేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి నాగిరెడ్డి అనే వ్యక్తి టాటా ఇంట్రా వాహనం ద్వారా అక్రమంగా తరలిస్తుండుగా వెంకటాపురం రోడ్లో శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలియజేశారు. మండలంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలించిన, కోడి పందెలు, పేకాట ఆడిన వారిపై చట్ట రీత్యా చర్యలు వుంటాయని హెచ్చరించారు. ఈ దాడుల్లో సర్వేశ్వరరావు, నగేష్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన పాయం

నవతెలంగాణ-పినపాక

పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పినపాక మండలం పర్యటనలో భాగంగా తన కుటుంబాలను ఆయన పరామర్శించారు. పొట్లపల్లి గ్రామానికి చెందిన చర్ప నర్సింహా రత్నం కొద్దిరోజుల కిందట ప్రమాదవశాత్తు స్కిడ్ అవ్వడం వల్ల రెండు కాళ్ళు విరిగిపోవడంతో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన బడే సంతోష్ కొద్దిరోజుల కిందట ప్రమాదవశాత్తు పాము కాటుకు గురి కాగా పరామర్శించారు. అనంతరం పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోట్లపల్లి మాజీ సర్పంచ్ కళ్యాణి, కాంగ్రెస్ యువజన నాయకులు కొరస ఆనంద్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోగాని శ్రీనివాస్, మహమ్మద్ ఖాసీం సారధ్యంలో శుక్రవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని న్యూ గొల్లగూడెంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరిమెహరున్నిసా, ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల శ్వేత, కోశాధికారి సోనా, ముఖ్య సలహాదారులు జ్యోతిరాణి, జరీనాబీ, కనకదుర్గ, సభ్యులు అంజలి, ఉమా, బొడ్డు కవిత కళ్యాణి, శ్రీలత, చిట్టిమల్ల బ్రహ్మంచారి, విజయ్ కుమార్, బొడ్డు శ్రీనివాస్, డింపుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పాల్వంచ

తుక్కుగూడలో జరుగనున్న జనజాతర సభను పాల్వంచ నుండి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని డీసీఎంఎస్ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ అయ్యప్పనగర్ లోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ జనజాతర సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, పార్టీ కేంద్ర, రాష్ట్ర అధినాయకులు, పార్లమెంట్ అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, ఎల్‌డిఎంకో ఆర్డినేటర్ బద్ది కిషోర్, నాయకులు బాలినేని నాగేశ్వరరావు, భూక్య గిరి ప్రసాద్, హెచ్ మధు, నాగిరెడ్డి, చాంద్ పాషా, పాబోలు నాగేశ్వరరావు, ధర్మసోత్ ఉపేందర్, ఉండేటి శాంతివర్ధన్, పైడిపల్లి మహేష్, వానపాకుల రాంబాబు, అరిగే గోపి పాల్గొన్నారు.

అశ్వాపురం : హైదరాబాదులోని తుక్కుగూడలో నేడు జరుగు జన జాతర బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు విశిష్టమైన కృషిచేసి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు,అధిక సంఖ్యలో పాల్గొని భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, భద్రారెడ్డి, గొల్లపల్లి నరేష్ కుమార్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ బహిరంగ సభను విజయవంతం చేయండి

పినపాక : నేడు తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుడిసెల రామనాథం కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు ఉదయం 7 గంటలకు ఏడుళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వాహనాలు బయలుదేరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు బషీరుద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే ఆధారమైన దారం గురువు





- నారాయణ విద్యాసంస్థల డీజీఎం వెంకట రమణా రెడ్డి
- నారాయణ పాఠశాలలో ఘనంగా కృతజ్ఞత వేడుక

నవతెలంగాణ-పాల్వంచ

ఎగిరే గాలిపటం విద్యార్థి అయితే దానికి ఆధారమైన దారం గురువు అని, నారాయణ విద్యాసంస్థల డీజీఎం దొంతిరెడ్డి వెంకట రమణ రెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూనగర్‌లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల పేరెంట్స్ తమ పిల్లలకు చదువు చెప్పిన గురువులకు వారు చేసిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా శుక్రవారం పాఠశాల పాల్వంచ బ్రాంచ్ టీచింగ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేయస్తూ కృతజ్ఞత వేడుకల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నారాయణ పాఠశాల పాల్వంచ శాఖ ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కారక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణ విద్యాసంస్థల డీజీఎం దొంతిరెడ్డి వెంకట రమణ రెడ్డి ప్రత్యేక అతిథిగా ఖమ్మం జిల్లా ఏజీఎం సంగా వేణుగోపాల్ రావు పాల్గొన్నారు. ఈ కృతజ్ఞత వేడుకల కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు అతిధులకు, పాఠశాల ప్రిన్సిపాల్, డీన్, ఇన్‌చార్జీ, ఉపాధ్యాయులకు జ్ఞాపికలతో పాటు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ టీచర్లు అత్యంత శ్రద్ధాసక్తులతో ప్రతిరోజు ఉదయాన్నే 5 గంటలకు విధిగా తమ పిల్లలను నిద్రలేపి, రోజుకు 15 గంటలు చదివించారని, ఇప్పుడు పరీక్షలు పూర్తిఅయినాకూడా తమపిల్లలు ఉదయాన్నే లేవడం అలవాటు చేసుకున్నారని అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యఅతిధి దొంతిరెడ్డి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ.. నాటి ఆదియుగం నుంచి నేటి ఆధునికయుగం వరకు మానవ జీవన వికాసానికి నిచ్చెన వేసి, అక్షర విద్యా బుద్ధులు నేర్పే గురువులకు పాల్వంచ బ్రాంచ్ విద్యార్థుల తల్లితండ్రులు ప్రారంభించిన ఈ కార్యక్రమం ఒక మంచి సాంప్రదాయమని తల్లితండ్రులను అభినందించారు

నారాయణ పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, అందుకే నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడానికి ప్రణాళిక బద్దంగా బోధించామని, దానిని అత్యుత్తముగా అమలుపరచి, పేరెంట్స్ మన్ననలు పొందినందుకు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఇంటర్ విద్య అత్యంత ముఖ్యమైనదని, పేరెంట్స్ పిల్లల చదువుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించి, ఒక మంచి విద్యా సంస్థలో చేర్పించడంలో మంచి నిర్ణయం తీసుకొని వారి భావి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. ఖమ్మం జిల్లా ఏజీఎం సంగ వేణుగోపాల్ మాట్లాడుతూ పాల్వంచ బ్రాంచ్ పేరెంట్స్ ను చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన అత్యుత్తమ విద్యాబోధనే తమ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఖమ్మం జోన్ ఈ కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, ఏవో శ్రీనివాస్, ఏడి రామకృష్ణ, ఇన్‌చార్జీ మల్లేష్, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం



- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా కొనియాడారు. శుక్రవారం కార్యాలయం సమావేశ మందిరంలో బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రావ్ చిత్రమటానికి పూలమాలవేసి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పేదరికంలో జన్మించిన బాబూజీ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని ఆమె పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రావు జీవితాన్ని ప్రజలు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవీందర్ నాథ్, జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూర్య, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, కలెక్టరేట్ పరిపాలనాధికారి గన్య, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, కలెక్టరేట్ సూపరిటెండెంట్ రమాదేవి, పౌర సరఫరా శాఖ అధికారి రుక్మిణి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్రాంరెడ్డి, జిల్లా అధికారులు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

జూలూరుపాడు : డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడారు. డాక్టర్ బాబు జగజీవన్ రామ్ కి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నేతలు ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు మోదుగు రామకృష్ణ, ఎంహెచ్పి జిల్లా అధ్యక్షులు దేవరకొండ కిరణ్, ఆదివాసి నేత, బచ్చుల లక్ష్మయ్య, ఐ న్యూస్ రిపోర్టర్ తంబర్ల పుల్లారావు, జెపిఆర్ ట్రస్ట్ చైర్మన్ ఇడుపుల రాజు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ కు నివాళి

అన్నపురెడ్డిపల్లి : భారత తొలి ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో బాబు జగజ్జీవన్ రాం జయంతి


అశ్వారావుపేట

అశ్వారావుపేట : మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త, మొదటి తరం దళిత ప్రజాప్రతినిధి డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట లోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్ కుమార్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. మొదటగా బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ పి.రెడ్డి ప్రియ, డాక్టర్ లక్ష్మణ్ బాధ్యులుగా వ్యవహరించారు. తహశీల్దార్ కార్యాలయంలో డీటీ సుచిత్ర ఆధ్వర్యంలో, సీహెచ్‌సీలో డాక్టర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో జయంతి నిర్వహించారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో....

కొత్తగూడెం : 117వ డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. మాదిగ జేఏసి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు.జోగారావు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సుమంత్, యువ రాజ్, చందు, శ్రీనివాస్, కమల్, సాయి, తేజ, మనోహర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ముదిగొండ

సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన గుండు రవి(56) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం ఖమ్మం వెళ్లి పనులు ముగించుకొని తిరిగి కోదాడ వైపు వెళుతుండగా వెంకటాపురం నేషనల్ హైవే పై ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

బోనకల్ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తి దాయకమని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనంద్ రావు కొనియాడారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



మహనీయుల బాటలో పయనిద్దాం

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మహనీయుల బాటలో పయనిద్దామని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా పెరియర్ వహించగా, మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురజాల వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పాల్గొని ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉదేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు ఈటే రాజేశ్వరరావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోట దేవదానం, జిఎస్ శంకర్రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అరికిల్ల తిరుపతిరావు, జిల్లా నాయకులు చాట్ల రవికుమార్, కేవీపీఎస్ జిల్లా నాయకులు తంబళ్ల కృష్ణార్జునరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, ఇల్లందు నాగేంద్ర, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మేకల లత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : జీవిత పర్యంతం దేశ సేవకే అంకితమై నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనికుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ అని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బోయల రమణయ్య అన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక బాపూజీనగర్‌లో జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లాయర్ ఇందు నూరి అశోక్ కుమార్, వేంపల్లి సతీష్, కే.సత్తిబాబు, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వారాధి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ చాపల మడుగు లక్ష్మణరావు, ఎమ్మార్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మధు కుమార్, సిహెచ్ ఎంకన్న, రంగా, రాములు, వెంకటేశ్వర్లు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల కేంద్రమైన బూర్గంపాడులో మార్కెట్ యార్డు ఆవరణలో మహనీయుల జయంతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ కేవీ రమణ, గౌరవ అధ్యక్షులు భూపెల్లి నర్సింహారావులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మందా నాగరాజు, శ్రీనివాసచారి, ఈశ్వరరావు, వెంకటేశ్వర్లు, దామోదర్, రమేష్, శ్రీహరి, నరహరి, వెంకటేశ్వర్లు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బంగ్లాదేశ్ ఏర్పాటుకు జగ్జీవన్ రామ్ కీలకపాత్ర

- జయంతి వేడుకల్లో సీఈ బిచ్చన్న

నవతెలంగాణ-మణుగూరు

పాకిస్తాన్-ఇండియా యుద్ధ సమయంలో సైన్యంతో మమేకమై 1971లో బంగ్లాదేశ్ ఏర్పాటుకు భారత ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ బిచ్చన్న అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్ రామ్ 117 జయంతి సభలో పాల్గొని మాట్లాడుతూ 40 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా పని చేస్తూ దళితుల అభ్యున్నత కోసం పోరాటం నిర్వహించిన మహనీయులు అన్నారు. ప్రపంచ దేశాలలో మనకంట వెనక స్వతంత్రం పొందిన దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే భారతదేశ మాత్రం అభివృద్ధి చెందుతూనే ఉన్నది అన్నారు. ఆయన ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు పార్వతి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, సూర్యనారాయణ, ఎం.వి.రమణమూర్తి, రాంప్రసాద్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ పట్టా పొందిన మోటమర్రి విద్యార్థిని మెహబూబ్ బీ

నవతెలంగాణ -బోనకల్



మండల పరిధిలోనే మోటమర్రి గ్రామానికి చెందిన షేక్ సొందుసాహెబ్ కుమార్తె షేక్ మెహబూబ్ బీ హైదరబాద్‌లోని ఆయాన్ ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేసుకొని కాలేజ్ యాజమాన్యం చేతుల మీదుగా శుక్రవారం ఎంబిబిఎస్ పట్టా అందుకుంది. మహబూబ్ బీ నాలుగున్నరేళ్లలో ప్రతిభ కనబరిచినందుకు మూడు బంగారు పతకాలను పొందింది. షేక్ సొందుసాహెబ్ సుతారి పనిచేస్తూ కుమార్తె మెహబూబ్ బీని ఎంబిఎస్-ఎస్ విద్యను పూర్తి చేయించాడు. మోటమర్రిలో గ్రామంలోనే మెహబూబ్ బీ తొలి మహిళ వైద్యురాలు కావడం గమనార్హం. ఎంబిబిఎస్ లో మంచి ప్రతిభ కనబరిచి పట్టా పొందిన మెహబూబ్ బీని టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్, మాజీ ఎంపీపీ చిట్టి మోదు నాగేశ్వరరావు సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కాంగ్రెస్ నాయకులు కర్నాటి రాంకోటేశ్వరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు గాలి దుర్గారావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద శుక్రవారం జాతీయ రహదారి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు మలుపు సూచిక బోర్డుని ఢీ కొన్నడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైయ్యాయి. క్షతగాత్రులు కొత్త లంకపల్లి గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్వర్లు, పాసం దుర్గారావులుగా గుర్తించారు. వీఎం. బంజర్ నుండి బైక్ పై స్వగ్రామం కొత్త లంకపల్లికి వెళతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో మలుపు సూచిక బోర్డు అమర్చిన ఇనుప స్తంభాన్ని బైక్ బలంగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న కాసిం దుర్గారావు పాదం తెగిపడిపోయింది. బైక్ వెనుక కూర్చున్న మరో వ్యక్తి చింతల వెంకటేశ్వర్లకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. తీవ్రంగా గాయపడిన చింతల వెంకటేశ్వర్లు(40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నున్నా రామకష్ణ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కల్లూరు

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ నున్న రామకష్ణ జన్మదిన వేడుకలకు పట్టణంలో శుక్రవారం భారి కేక్ ను రామకష్ణతో కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం నూతన బస్టాండ్ ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్ అందజేత

నవతెలంగాణ- వైరాటౌన్



గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో బిటెక్ ద్వితీయ సంవత్సరం మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విప్పలమడక గ్రామానికి చెందిన ఇనపనూరి ఉపేందర్‌కు శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ లయన్ విద్యా ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు సబ్సిడీ ద్వారా ల్యాప్‌టాప్స్ అందిస్తున్నట్లు తెలిపారు. గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉంద్రు వరలక్ష్మి, జీఎంటి ఉంద్రు శ్యాం బాబు, ఆర్.సి లగడపాటి ప్రభాకరరావు, జోన్ కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ గౌడ్, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, పారుపల్లి కృష్ణారావు, ఉయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మి, గోపి విద్యార్థి తండ్రి ఇనపనూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ ఉదయ్‌నగర్‌లో భూదందాలు

- సర్వే నెంబర్ 192లో ఆక్రమణలు
- ఇందిరమ్మ ఇళ్లలో కూడా మాయ
- 2009లో ప్లాట్ నెంబర్ 253కు ఒకటి, 2017 లో మరో పట్టా
- జిల్లాలో భూ అక్రమాలపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలి..
- ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు డిమాండ్



నవతెలంగాణ - ఖమ్మం

రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్‌లో భూ దందాలు కొనసాగుతున్నాయని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు ఆరోపించారు. సర్వే నంబర్ 192లో అనేక భూదందాలు కొనసాగటంపై గతంలో అనేక కథనాలు వెలుగు చూశాయన్నారు. ,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కెవి కృష్ణారావు మాట్లాడారు. ప్రభుత్వం బీఆర్ఎస్ పాలనలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మక పథకం ఇందిరమ్మ కింద జారీ చేసిన ఇళ్ల విషయంలో కూడా బీఆర్ఎస్ హయాంలో మాయ చేశారని ఆరోపించారు . ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీలు ఇచ్చిన విధంగా అనేక భూ అక్రమాలపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి, దోషులకు శిక్షిస్తామని, ఆ భూములను స్వాధీనం చేసుకొని, నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా జిల్లా కేంద్రం, చుట్టుపక్కల జరిగిన భూభాగోతంపై అనుకున్న విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారులు వేగంగా కదలడం లేదనే విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అండదండలతో ఆయన పిఏ కిరణ్ అనేక విషయాలలో తల దూర్చి, షాడో మంత్రిగా పేరుగాంచారని, ఇలా అనేక ఆరోపణలు, విమర్శలు ఉన్నప్పటికీ ప్రస్తుత మంత్రులు అధికారులు ఈ విషయంపై ఎలాంటి కార్యాచరణ చేపట్టారు ? అనేది స్పష్టం చేయాలన్నారు. పీఏ కిరణ్ కనుసనలో పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ రవి, ఆయన సోదరుడు రాంబాబు పువ్వాడ ఉదయ్ నగర్‌లో అనేక భూములను కబ్జా చేయడంతో పాటు వాటిని అమ్ముకొని , నిజమైన పేద లబ్దిదారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ విషయమై అనేక పత్రికలలో ఎన్నో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు వీటిపై దృష్టి సారించినట్లు కనిపించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటికీ వీరి దందాలు పువ్వాడ ఉదయనగర్‌లో ఇంకా కొనసాగుతుండటం గర్హనీయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా వీరి మాయ, వీళ్ల అక్రమాలకు పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఇటువంటి అనేక భూ అక్రమాలపై నిజాయితీగాన కమిటీ వేయాలని డాక్టర్ కె.వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. 2009లో తాడోజు నాగమణి (భర్త వెంకటాచారి) ప్లాట్ నెంబర్ ఏ / 253తో , సర్వే నెంబర్ 192లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాను తీసుకున్నారు. కాగా, ఇదే ఇంటి నెంబర్ తో 2017లో అనగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేరే వారి పేరును చేర్చారు. ఇక్కడ వారు నిర్మాణం కూడా సాగించారు. ఈ విషయమై అర్బన్ తాసిల్దార్‌తో పాటు ఎంపీడీవోలు, ఆర్డీవోలు, సీపీ, జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం దక్కలేదన్నారు. కొత్త ప్రభుత్వం కొత్త మంత్రుల హయాంలోనైనా తనకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నట్లు బాధితుడు తాడోజు వెంకటాచారి ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి బానోతు భద్రు నాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ షేక్. నజీమా , సావిత్రి మాత సైన్యం జిల్లా కన్వీనర్ ఉపేంద్రబాయి లు మాట్లాడుతూ ఈ భూ అక్రమాల వెనుక అధికారుల పాత్రపై కూడా విచారణ నిర్వహించి, వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకంగా పట్టాలు పొందిన పేద వర్గాలకు అన్యాయం జరగకుండా, వారూ నిరాశ్రయులు కాకుండా నిజమైన లబ్ధిదాలను గుర్తించి, స్వాధీనం చేసుకుంటున్న ప్లాట్లను వారికి కేటాయించి, న్యాయం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక కో - కన్వీనర్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ సత్తా చాటుకుందాం

- మార్పుకోరి మోసపోయామనే భావనలో ప్రజలు
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు
- బీఆర్ఎస్ కంటే మంచి పాలన వస్తుందని ఆశించారు
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తాతా మధు
- విభజన కోసం పార్లమెంట్‌లో నామాది తొలి ఓటు
- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుకుందామని, ఆ దిశగా పార్టీ శ్రేణులు బూత్ లెవల్ నుంచి కృషి జరగాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలులో జరిగిన ఆ పార్టీ పట్టణ, రూరల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో నామ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పుకోరి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. 100రోజుల్లో దాటిందో లేదో అప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. మార్పుకోరిన ప్రజలు ప్రస్తుతం మోసపోయామనే భావనలో ఉన్నారన్నారు. రెండుసార్లు మనజిల్లా ప్రజలు ఎంపీగా నాకు అవకాశం ఇచ్చి గెలిపించారన్నారు. అందుకు తగ్గట్టుగానే రూ. 10వేల కోట్లు ఖమ్మం అభివృద్ధికి కేంద్రం నుంచి ఖర్చు పెట్టించడం జరిగిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ లెవల్ నుంచి పార్టీ శ్రేణులు కష్టపడితే ఈసారి మెజార్టీ 2లక్షలు దాటుతుందని నామ అన్నారు. ఒక్క సత్తుపల్లి నుంచే 35వేల ఓట్లు ఆధిక్యత వచ్చిందన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలన కంటే మంచి ఇంకా పాలన వస్తుందని ప్రజలు ఆశించి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. ప్రజల తీర్పును గౌరవించాలన్నారు. ఓటమికి గల కారణాలను సమీక్షించుకుందామన్నారు. అధికారం ఉంటేనే సేవలందించడం కాదని, నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ సేవలందిద్దామని వారన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కోసం మొదటి ఓటు వేసింది ఒక్క నామ నాగేశ్వరరావు తప్ప ఇంకెవరు కాదన్నారు. 100 రోజుల్లోనే కాంగ్రెస్ పాలన అనేది ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమయిందన్నారు. కేసీఆర్ పాలనలో తాగునీరు, సాగునీరు ఇబ్బందులు రాలేదన్నారు. కరెంట్ కోతలు అనేవి లేనే లేవన్నారు. ఇప్పుడవన్నీ తిరగల బడ్డాయన్నారు. పంటలు ఎండిపోతున్నాయన్నారు. చాలా గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడి పోతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మనపార్టీ అభ్యర్థిగా మళ్లీ పోటీకి దిగుతున్న నామ నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేయాలని వద్దిరాజు కోరారు. పట్టణ, రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్కే రఫీ, యాగంటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, ఎంపీపీ దొడ్డా హైమవతిశంకరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మెన్లు వనమా శ్రీనివాసుదేవరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, నాయకులు దొడ్డా శంకరరావు, మాల్లూరు అంకమరాజు, అయూబ్ పాషా, యాసా రాంబాబు, పుల్లారావు, మానుకోట మధు పాల్గొన్నారు.

తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు

నవతెలంగాణ-కారేపల్లి

తోటకూరి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గేటుకారేపల్లి, రేగులగూడెం, సింగరేణి పంచాయతీలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్లను ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూరి పిచ్చయ్య-సత్యవతి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. సురక్షిత నీటిని ప్రజలకు ఉచితంగా అందజేయడానికి రూ.22 లక్షల వ్యయంతో ప్రత్యేకమైన షెడ్లలో వాటర్ ప్లాంట్ నిర్మించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూరి పిచ్చయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ తోటకూరి శ్రీనివాసరావు సంత ఆలయ చైర్మెన్ అడ్డగోడ ఐలయ్య, రైతుబంధు మాజీ మండల కన్వీనర్ హనుమకొండ రమేష్, మాజీ సర్పంచులు భూక్య కల్పన ఈసం అరుణ భద్రం, గ్రామ పెద్దలు మండెపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబు జగజ్జీవన్‌రామ్‌కు నివాళి

నవతెలంగాణ - ఖమ్మం



మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకుని వెళ్లాలని, వారి చరిత్రను, వారు చేసిన త్యాగాలను మనమంతా తెలుసుకోవాలని కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె.సత్యనారాయణ, జిల్లా బీసి అభివృద్ధి అధికారి జి.జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జెడ్పి సిఇఓ వినోద్, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణు మనోహర్, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడి, ప్రజా నాయకుడిగా పేరుపొందిన బాబు జగజ్జీవన్ రామ్ కు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఘన నివాళులర్పించింది. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బైపాస్ రోడ్ లోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహానికి టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ పూలదండ వేసి నివాళులర్పించింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, జిల్లా కార్యదర్శులు షేక్ రంజాన్, పినపాక సురేష్, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి నరసింహారావు, వట్టికొండ శ్రీనివాసరావు, ఐ.నరసింహారావు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ : బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కొరకు కషి చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ అన్నారు. మండలంలోని నాయుడుపేట గ్రామంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు నందిగామ కృష్ణ, నూకల బాలరాజు, చింతల శ్రీను, బాబురావు, ఆంటోనీ, రాము, నాగరాజు, రవి, దినేష్, చంటి, రాంబాబు, పుల్లారావు, లక్ష్మయ్య, మైసమ్మ, లక్ష్మి, సామ్రాజ్యం, కళ్యాణి, ఉష, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోదిల హరినాథ్, వైరా సొసైటీ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, పాలేటి నరసింహరావు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

ఖమ్మం : అణగారిన వర్గాల కోసం దేశ ఉప ప్రధానిగా ప్రజా సంక్షేమానికి అంకితం చేసిన మహనీయులు బాబూజీ జగజ్జీవన్ రామ్‌కి ఘనమైన నివాళులు అర్పించడం అంటే మన దేశంలో నేటికి కొనసాగుతున్న దుర్మార్గమైన దారుణమైన కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చెయ్యడమే అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ సెంటర్‌లో ఉన్న జగజ్జీవన్ రామ్ విగ్రహానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్, జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్, జిల్లా నాయకులు ఎస్.కె. సైదులు, మర్రి బాబురావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో మనోహర్ మాట్లాడుతూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ఖమ్మం : భారతీయ సమాజానికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు అపారమైనవని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నివాళులు అర్పించారు. పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసన్న కుమార్, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అన్నదమ్ముళ్లకూ పోలీసు ఉద్యోగాలే

- ఘనంగా సన్మానించిన కాలనీవాసులు

నవతెలంగాణ-బూర్గంపాడు



ఒక కుటుంబంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం రావటమే కష్టంగా ఉండే ఈ రోజుల్లో ఒకే కుటుంబంలో ఉన్న ముగ్గురు అన్నదమ్ములకు పోలీసులు ఉద్యోగాలు వరించాయి. ఇటీవల విడుదల చేసిన పోలీసు ఉద్యోగాల నియామకాలలో ఆ కుటుంబానికి చెందిన మూడవ కుమారుడు కేసుపాక రఘురామ్‌కు పోలీస్ శాఖలో ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది.. ఈ క్రమంలో చిన్న కుమారుడికి సైతం పోలీస్ శాఖలో ఉద్యోగం రావడంతో ఆ కుటుంబంతో పాటు కాలనీవాసులలో ఆనందం వెల్లివిరుస్తోంది...

వివరాల్లోకి వెళ్ళితే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కేసుపాక నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. నిరు పేద కుటుంబానికి చెందిన వీరు తమ కుమారులను ఎంతో కష్టపడి చదివించారు. తల్లిదండ్రులు కష్టపడడాన్ని కళ్ళారా చూసిన ఆ కుమారులు చదువులపై ప్రత్యేక శ్రద్ధను కనపరిచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా అటువైపుగా అడుగులు వేశారు. వారి కష్టానికి తగ్గట్టుగా వారి శ్రమకు ప్రతి ఫలంగా ముగ్గురు అన్న దమ్ములు కేసుపాక భాస్కరరావు, కేసు పాక ప్రసాద్ రావు, కేసుపాక రఘురామ్ కూడా పోలీసు శాఖలోనే ఉద్యోగాలు లభించడం విశేషం.

అన్న లక్ష్యం వైపు తమ్ముళ్ల అడుగులు



కేసుపాక నాగేశ్వరరావు రాజ్యలక్ష్మి దంపతుల మొదటి కుమారుడు కేసుపాక భాస్కరరావు ఎంతో కష్టపడి చదివి పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించి కొత్తగూడెంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన ఇద్దరు తమ్ముళ్లు కూడా పోలీసు ఉద్యోగాల వైపు అడుగులు వేసే విధంగా భాస్కరరావు తన గురిని, లక్ష్యాన్ని వివరించడంతో అన్నయ్య లక్ష్యం వైపు ఇద్దరు తమ్ముళ్లు పోలీసు ఉద్యోగాల ప్రయత్నాలలోనే కొనసాగుతూ వచ్చారు. ఈ క్రమంలో కేసుపాక ప్రసాదరావు సీఐఎస్ఎఫ్ ఫైర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ఒరిస్సాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మూడవ కుమారుడైన కేసుపాక రఘురామ్ కూడా పోలీస్ శాఖల ఉద్యోగుల నియామకల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేసి ఫైర్ కానిస్టేబుల్‌గా గత మూడు రోజుల క్రితం విడుదలైన ఫలితాలలో ఉద్యోగాన్ని సాధించాడు. ఇదిలా ఉండగా తన మేనమామ తోకల రాజా రామ్ ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించటంతో అదే స్ఫూర్తి, లక్ష్యంతో తాము కూడా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలనే ప్రయత్నాలు చేసినట్టు వారు పేర్కొన్నారు.

ఘనంగా సన్మానించిన కాలనీవాసులు

ఒకే కుటుంబాన్ని చెందిన ముగ్గురు అన్నదమ్ములకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు లభించడంతో ఆ కుటుంబాన్ని అంబేద్కర్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించి, సత్కరించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కేసుపాక నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతులను ఘనంగా శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోకల మోహన్ రావు, రాయల వెంకటేశ్వర్లు, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, తోకల రవి ప్రసాద్, కేసుపాక పుల్లయ్య, కేసుపాక కన్నయ్య, కేసుపాక రవి కుమార్, కేసుపాక బూబమ్మ, తోకల సావిత్రి, కేసుపాక రాజేష్, నంది పాటి రాములు, అలవాల దుర్గాప్రసాద్, నందిపాటి పండు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఉద్యోగాన్ని సాధించడమే ప్రధాన లక్ష్యం

ఎస్సై ఉద్యోగాలు సాధించుటనే ప్రధాన లక్ష్యంగా ఉన్నానని కేసుపాక రఘురామ్ తెలిపారు. ఫైర్ కానిస్టేబుల్ ఎంపికైన కేసుపాక రఘురామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాల్లో పనిచేయాలని చిన్ననాటి కల నెరవేరినందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. తన అన్నయ్యలు భాస్కర రావు, ప్రసాదరావుల మాదిరిగానే తను కూడా పోలీస్ శాఖ ఉద్యోగాన్ని సాధించాలని లక్ష్యంతో ప్రయత్నించినట్లు ఆయన పేర్కొన్నారు.

జనజాతరకు తరలిరండి

- కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవ రావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ మానిఫెస్టో విడుదల సందర్భంగా శనివారం తుక్కుగూడలో నిర్వహిస్తున్న జనజాతరకు అధిక సంఖ్యలో కదలాలి అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చలో తుక్కుగూడ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించిన అనంతరం విలేఖర్లతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున కదలాలి అని కోరారు. దేశం మరింత పురోభివృద్ధి సాధించాలన్నా, నిజమైన పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందాలన్నా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ద్వారానే సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు ఎస్.కే పాషా, నాయకులు తుమ్మ రాంబాబు, సత్యవరుపు బాలగంగాధర్, బండారు మహేష్, సింహాచలం పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా ఊక్లోజీ

నవతెలంగాణ-టేకులపల్లి



కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా ఊక్లోజీ ఉదయ్ చందర్‌ను ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య నియమించినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తన శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షులు ఏలూరి కోటేశ్వరరావు, కోరం సురేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా దేవా తదితరులు పాల్గొన్నారు.



రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-పాపన్నపేట / హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీ రైతులను నమ్మించి మోసం చేసిందని, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వరి ధాన్యంకు బోనస్ ఇవ్వని కాంగ్రెస్‌ను నిలదీయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల హామీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్ మీద రాసి.. మాట తప్పిన కాంగ్రెస్‌ను బొంద పెట్టాలన్నారు. ఈ ఆరు గ్యారంటీలకు అసెంబ్లీలో చట్టబద్ధత తెస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న రెగోడ్ మండలంలో రైతులకు బ్యాంక్ రుణాలపై అధికారులు నోటీసులిచ్చారని, రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుపాయల అభివృద్ధికి కేసీఆర్ మంజూరు చేసిన రూ.100 కోట్లు రద్దు చేసిన కాంగ్రెస్‌కు పతనం ఖాయమని దుయ్యబట్టారు.

మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మంచి మనసున్న వ్యక్తి అని, ఆయన్ను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు. వెంకట్ రామిరెడ్డి రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి అందరికి ఉపయోగకర పనులు చేస్తున్నారని వెల్లడించారు. దుబ్బాక ప్రజలు రఘునందన్‌ను బండకేసి కొట్టారని, బీజేపీ.. మనకు ఒక్క మంచి పనైనా చేసిందా అని ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవ కోసమే ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచానని, ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి భయపడేది లేదని, ఎన్ని కేసులైనా ఎదుర్కొని పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టి చూసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ యాదవ్, నాగేష్ ముదిరాజ్, జిల్లా నాయకులు సోములు, మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కుమ్మరి జగన్నాథం, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది మోసాల మ్యానిఫెస్టో : రాహుల్‌గాంధీకి బహిరంగలేఖ

మ్యానిఫెస్టో పేరుతో కాంగ్రెస్‌పార్టీ మరోసారి ప్రజల్ని మోసం చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారంనాడాయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి బహిరంగ లేఖ రాసారు. రాష్ట్ర ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు అమలు కాలేదనీ, ఆరు గ్యారెంటీలు పత్తా లేకుండా పోయాయని ఆ లేఖలో ప్రస్తావించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని, వారికే ఎంపీ టికెట్ ఇచ్చి, పార్టీ మారిన వెంటనే పదవి పోయేలా చట్టం తీసుకొస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ హామీల బాధ్యత మాదేనని మీ సోదరి ప్రియాంకగాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ప్రకటిస్తూ, ట్వీట్లు కూడా చేశారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణస్వీకారంనాడే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పించే పత్రంపై మీ సమక్షంలోనే సంతకాలు కూడా చేశారని గుర్తుచేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో 210 మంది రైతులు మరణించారనీ, రుణమాఫీ జరగకపోతే రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతుల కష్టాలకు కారకులైన మీరు, మీ పార్టీ తరపున వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, ఆటో కార్మికులకు ఆర్థిక సాయం వంటి పలు అంశాలను ఆ లేఖలో ప్రస్తావించారు.



నీటి కొరత లేకుండా చర్యలు

- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా

నవతెలంగాణ-కొండపాక

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా తెలిపారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి, కొండపాక మండలాల్లోని తాగునీటి లభ్యత కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీటి సరఫరా చేయడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా సిద్ధంగా ఉందన్నారు. ఇంటెక్ పంపింగ్, వాటర్ గ్రిడ్ ప్లాన్ అన్నీ ఉన్నాయని తెలిపారు. ఇంట్రావిల్లేజ్ స్కీమ్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్‌లను ఒక నెల ముందు నుంచే ప్రత్యేక డ్రైవ్ ద్వారా పరిశీలించి అవసరమైన మరమ్మత్తులను చేపట్టినట్టు వెల్లడించారు. వీటితో పాటు ప్రత్యామ్నాయంగా ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ ద్వారా బోర్లు, చేతిపంపులను రిపేర్ చేయించినట్టు తెలిపారు. తాగునీటి తీవ్రత ఎక్కువగా ఉంటే.. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కలెక్టర్లను ఆదేశించామన్నారు. జులై వరకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టినట్టు స్పష్టం చేశారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఫిల్టర్ హౌస్, ల్యాబ్, 75 మిలియన్ లీటర్ల క్లియర్ వాటర్ రిజర్వాయర్, కొండపాక హెచ్ఎండబ్ల్యూఎస్‌ను పరిశీలించారు. పరిశీలించిన వారిలో.. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈ విజయ్ ప్రకాష్, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు ఉన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో నల్లగొండ ఖాకీలు

- అదుపులోకి తీసుకున్న హైదరాబాద్ పోలీసులు
- వారికి సహకరించిన మరికొంత మంది..

నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో నల్లగొండ జిల్లా కేంద్రంలో ఇద్దరు కానిస్టేబుల్స్‌ని శుక్రవారం హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారని వారిపై అభియోగం. ఈ కానిస్టేబుళ్లు నల్లగొండ జిల్లా కేంద్రంలో సర్వర్ రూమ్ ఏర్పాటు చేయగా.. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఓ ఎమ్మెల్యే ఎప్పటికప్పుడూ అబ్జర్వ్ చేసినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరి కొంతమంది పోలీసులు వారికి సహకరించినట్టు ఆధారాలు ఉన్నట్టు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న పోలీసులను హైదరాబాద్‌కు తరలించారు.

నిరాశలో నిరుద్యోగి






- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువే
- కేంద్రంలోని మోడీ సర్కారుపై యువత ఆగ్రహం
- లోక్‌సభ ఎన్నికల్లో ఇది కాషాయపార్టీకి పెద్ద దెబ్బే
- విశ్లేషకులు, మేధావుల అంచనా

న్యూఢిల్లీ : మోడీ పదేండ్ల పాలనలో నిరుద్యోగం తీవ్రమైంది. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన అనే హామీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ.. తన ప్రభుత్వంలో దానిని మాత్రం నిలబెట్టుకోలేకపోయాడు. ఈ విషయంలో యువతలో మోడీపై ఇప్పటికీ ఆగ్రహమే ఉన్నది. అయితే, ప్రతి ఎన్నికలకు ముందు హిందూత్వం, జాతీయ భావం, పాక్-చైనా.. ఇలా పలు భావోద్వేగ అంశాలను ముందుకు తీసుకొచ్చి యువతను రెచ్చగొట్టి మోడీ ప్రభుత్వం రాజకీయంగా లబ్ధి పొందుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

దేశంలో కోట్లాది మంది యువత ఇప్పటికీ తీవ్ర నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నది. చాలా మందికి వారు చదువుకు తగిన ఉద్యోగాలు దక్కటం లేదు. మరికొందరైతే, ఉన్నత విద్యనభ్యసించినా కూడా తక్కువ స్థాయి ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పడుతుండటం గమనార్హం. భారత్‌లోని చాలా మంది యువకులు ఇదే పరిస్థితిలో ఉన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నదనీ, ప్రపంచంలోనే ఐదో ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టిన ఘనత తమదేనని మోడీ పలు సందర్భాల్లో చెప్తుంటారు. కానీ ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్‌లోకి ప్రవేశించే లక్షల మంది భారతీయ యువకులకు తగినంత ఉద్యోగాలు కల్పించటంలో మాత్రం విఫలమవుతున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం

భారత్‌లోని కాలేజీ గ్రాడ్యుయేట్‌లకు విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగాలు లభించటం లేదు. నైపుణ్యాలు, అంచనాల భారీ అసమతుల్యత కూడా ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. వ్యవసాయం, నిర్మాణం వంటి రంగాలలో ఉద్యోగాలున్నా.. ఇవి కొత్తగా విద్యావంతులైన శ్రామికశక్తి డిమాండ్‌లకు అనుగుణంగా లేవని అంటున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డీ), ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ఇటీవల విడుదల చేసిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్ 2024 కూడా దేశంలోని ఉపాధి పరిస్థితుల గురించి భయంకరమైన వాస్తవాన్ని వెల్లడించింది. నిరుద్యోగ శ్రామికశక్తిలో భారత యువత దాదాపు 83 శాతం మందిని కలిగి ఉన్నారని వివరించింది. మొత్తం నిరుద్యోగ భారతీయులలో మాధ్యమిక లేదా ఉన్నత విద్య ఉన్న యువకుల వాటా 2000లో 35.2 శాతం నుంచి 2022 నాటికి 65.7 శాతానికి, అంటే దాదాపు రెండింతలు పెరిగిందని నివేదిక పేర్కొన్నది. భారత్‌లో యువత నిరుద్యోగ రేటు ఇప్పుడు ప్రపంచ స్థాయిల కంటే ఎక్కువగా ఉన్నాయని నివేదిక ఎత్తిచూపింది. "భారత ఆర్థిక వ్యవస్థ కొత్త విద్యావంతులైన యువ శ్రామిక శక్తిలో ప్రవేశించిన వారికి వ్యవసాయేతర రంగాలలో తగినంత వేతనంతో కూడిన ఉద్యోగాలను సృష్టించలేకపోయింది. ఇది అధిక, పెరుగుతున్న నిరుద్యోగ రేటును ప్రతిబింబిస్తున్నది" అని ఐఎల్ఓ నివేదిక వివరించింది.



ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు భారత్ సన్నద్ధమవుతున్నది. ఈ తరుణంలో యువత నిరుద్యోగ అంశం మోడీ ప్రభుత్వానికి పెద్ద సమస్యనే తీసుకొస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. "మోడీ పరిపాలన ఆర్థిక వ్యవస్థను తన ప్రచారంలో ప్రధాన అంశంగా మార్చుకుంది. కానీ, యువతకు ఉపాధి కల్పనను మాత్రం ప్రభుత్వం పట్టించుకోలేదు. నిరుద్యోగం అనేది బహుమితీయ సమస్య. వివిధ అంశాలలో విధానపరమైన చర్య అవసరం. ఇది తప్పనిసరిగా ఆర్థిక అంశం. కానీ దీనికి చాలా సామాజిక, రాజకీయ కోణాలు కూడా ఉన్నాయి"అని ఆర్థికవేత్త అరుణ్ కుమార్ తెలిపారు. "గత మూడు దశాబ్దాలుగా విద్యావ్యాప్తితో, భారతీయ శ్రామికశక్తి ఎక్కువ విద్యావంతులు అయినప్పటికీ వారికి ఉద్యోగాలు పెరగలేదు. అందుకే చదువుకున్న యువతకు నిరుద్యోగం పెద్ద సమస్యగా మారింది' అని ఆయన అన్నారు.

> మోడీ పరిపాలనే ఈ సమస్యకు కారణమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. "మోడీ సర్కారు దయనీయమైన ఉదాసీనతతో మన యువత తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. భారత్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నదని పలు నివేదికలు చెప్తున్నాయి" అని ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

ఉద్యోగాల సంక్షోభం ముఖ్యంగా మహిళలను ప్రభావితం చేస్తున్నది. ఐఎల్ఓ నివేదిక ప్రకారం చదువుకున్న నిరుద్యోగ యువతలో, పురుషుల కంటే (62.2 శాతం) మహిళలు ఎక్కువ వాటా (76.7 శాతం) కలిగి ఉన్నారు. ప్రపంచంలోనే అత్యల్ప మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేట్లలో భారతదేశం కూడా ఒకటి. ఇది కేవలం 25 శాతమే కావటం గమనార్హం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ సీనియర్ ఆర్థికవేత్త లేఖా చక్రవర్తి మాట్లాడుతూ.. భారతదేశంలో విద్యావంతులలో ముఖ్యంగా మహిళల్లో నిరుద్యోగం ఒక ముఖ్యమైన సమస్య అని అన్నారు.

బీజేపీ నుంచి ఈ దేశాన్ని కాపాడండి



- ఇప్పటికీ ఆరని మణిపూర్ మంటలు
- గాడి తప్పిన పరిపాలన
- దేశంలో కాంగ్రెస్‌దే అధికారం
- తుక్కుగూడ జనజాతర సభకు తరలిరండి : కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ

నవతెలంగాణ-కందుకూరు

దేశాన్ని బీజేపీ నుంచి రక్షించాలంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. కుల, మతాల మధ్య చిచ్చు రగిలించి ఈ దేశ ప్రజలను విచ్చినం చేస్తున్నారని, దానికి ఉదాహరణే మణిపూర్‌లో రేపిన మంటలని, అవి ఇప్పటికీ ఆరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం నిర్వహించే జనజాతర సభ ఏర్పాట్లను మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయవ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చి 750 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే, ప్రభుత్వ రంగ సంస్థలను తక్కెడలో పెట్టి అమ్ముతారని ఆరోపించారు. దేశంలో పాలన గడి తప్పిందని, దాన్ని సరైన దారిలో పెట్టాలంటే బీజేపీని అధికారంలోకి రాకుండా ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు తుక్కుగూడలో సభ జరుపుకున్నామని, కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అదే సెంటిమెంట్‌తో ప్రధానమైన భారీ బహిరంగ సభను మళ్లీ ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరవుతారని అన్నారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం, న్యాయ వ్యవస్థను కాపాడటం కోసం, దేశ ప్రజల కోసం ఈ సభా స్థలం నుండే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తుందన్నారు. నేడు జరగబోయే జన జాతర బహిరంగ సభకు రాష్ట్ర ప్రజలంతా మద్దతు తెలిపి లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



'పాలేరు'కు తీసుకెళ్తున్నట్టే ఇక్కడా వదలండి..

- తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఐలాపురం చెరువులో మహిళలతో కలిసి జూలకంటి నిరసన

నవతెలంగాణ- మిర్యాలగూడ

సాగర్‌నీటితో చెరువులు, కుంటలు నింపి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని.. తాగునీటి కోసం నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తీసుకెళ్తున్నారని.. నల్లగొండ జిల్లాలోనూ తాగునీటి సమస్య పరిష్కారానికి సాగర్ మెయిన్ కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామం గిరిజన మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో ఎండిపోయిన చెరువులో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోయాయని దాని ఫలితంగా సాగు, తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయాయని వాపోయారు. ఐలాపురం గిరిజన ప్రజలు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సాగర్ మెయిన్ కెనాల్ ద్వారా తాగునీటిని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తీసుకెళ్తున్నారని.. జిల్లాలోనూ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాగర్ మెయిన్ కెనాల్ ద్వారా చుట్టుపక్కల చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. ఎడమ కాలువ పరిధిలో ఉన్న లిఫ్టుల ద్వారా చెరువులు, కుంటలకు నీరు మళ్లించినట్టయితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. తద్వారా మంచినీటి ఎద్దడిని నివారించొచ్చన్నారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరెపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, నాగేశ్వర్‌నాయక్, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లు, జగన్ నాయక్, బాణావత్ నాగమ్మ, సునీత, లక్ష్మీ, ఈరి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌డ్యామ్ మరమ్మతులకు అనుమతి ఇవ్వండి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్ డ్యామ్‌కు మరమ్మతులు చేసేందుకు కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలంగాణ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర రిజర్వు పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్)కు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఆ మేరకు సహకరించాలని సీఆర్‌పీఎఫ్‌కు సూచించింది. సాగర్‌డ్యామ్ 26వ రేడియల్ క్రస్ట్ గేట్ల ఏర్పాటు, ఎరెక్షన్, టెస్టింగ్, కొత్త

సీఆర్‌పీఎఫ్‌కు కేఆర్ఎంబీ ఆదేశం

కంట్రోల్ ప్యానెళ్ల ఏర్పాటు, కేబుల్, ఎలక్ట్రిక్ వస్తువుల సరఫరా తదితర పనుల చేసేందుకు తెలంగాణ ప్రభుత్వ అధికారులను అనుమతించాలని సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఇద్దరు కమాండెంట్లకు కేఆర్ఎంబీ ఆదేశాలు ఇచ్చింది.

ఇక అంబేద్కర్ అభయహస్తం

- ఎన్నికల తర్వాత పథకం అమలు
- రూ.12 లక్షల ఆర్థిక సహాయం
- కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రులకు బాధ్యత
- ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి అమలు చేసే ఛాన్స్
- 38 వేల మందికి దళిత బంధు ఇచ్చిన గత ప్రభుత్వం

> తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల వేళ ప్రకటించిన మ్యానిపెస్టోలో భాగంగా రెండో డిక్లరేషన్ కింద 'అంబేద్కర్ అభయహస్తం' పేరిట ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని పీసీసీ ధ్యక్షులు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో కొన్ని పథకాల్ని అమలు చేశారు. అలాగే దళిత, గిరిజనుల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయహస్తం పేరిట కొత్త పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్రంలో అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం దళితుల్ని ఆకర్షించేందుకు దళిత బంధు పేరిట రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించిన విషయం తెలిసిందే.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ప్రకారం రాష్ట్రంలో 63,60,158 మంది ఎస్సీలు, 36,02,288 మంది గిరిజనులున్నారు. రాష్ట్ర జనాభాలో 17.50 శాతం ఎస్సీలు, 9.91 శాతం ఎస్టీలు.. మొత్తం కలిపి 27.41 శాతం ఉన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం పెద్దపీట వేసిందని చెప్పాలి. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయహస్తం పేరిట ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించింది. అన్ని రకాల కాంట్రాక్టుల్లోనూ ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే ప్రోత్సాహకాలను ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకూ వర్తింపచేస్తామని రేవంత్‌రెడ్డి తన రెండో డిక్లరేషన్‌లో ప్రకటించారు.



అంబేద్కర్ అభయహస్తం

దళిత బంధు స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'అంబేద్కర్ అభయహస్తం' పథకం పేరును ఎన్నికల ముందే ప్రకటించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కొత్త పథకాలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసిన వెంటనే ఎస్సీ, ఎస్టీల కోసం అంబేద్కర్ అభయహస్తం పథకానికి శ్రీకారం చుట్టే అవకాశముంది. ఇప్పటికే పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. పథకాన్ని ఏ విధంగా అమలు చేయాలనే విషయంలోనూ ఒక అంచనాకు వచ్చినట్టు చెబుతున్నారు. కోడ్ ముగియగానే అన్ని పార్టీల ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. అధికారిక ప్రకటన ఇవ్వడంతో పాటు పూర్తి స్థాయి బడ్జెట్‌ను కూడా కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయాన్ని.. బ్యాంకు లింకేజీ, ఇతర ష్యూరిటీ ల్లేకుండా నేరుగా లబ్దిదారునికే అందించే అవకాశముంది. వంద శాతం సబ్సిడీ వర్తిస్తుంది. లబ్దిదారుల ఎంపిక, పథకం అమలు, యూనిట్ల గ్రౌండింగ్‌కు సంబంధించిన మార్గదర్శకాల్ని తయారు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పథకాన్ని అమలు చేస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల్ని సైతం అంబేద్కర్ అభయహస్తం పథకం అమల్లో భాగస్వాముల్ని చేసే అవకాశముందంటున్నారు.

దళిత బంధు లోపాలు పునరావృతం కాకుండా జాగ్రతలు

గత ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకంలో దొర్లిన లోపాలు.. పునరావృతం కాకుండా కాంగ్రెస్ జాగ్రత్తలు తీసుకుంటుంది. 2021 ఆగస్టు 16న దళిత బంధు పథకాన్ని ప్రారంభించి తొలి దశలో నియోజక వర్గానికి 100 కుటుంబాలకు దళితబంధు ఇచ్చారు. రెండో దశలో అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గానికి 1100 మంది చొప్పున లబ్దిదారుల్ని ఎంపిక చేశారు. కోడ్ రావడంలో ఆగిపోయింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల వేళ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని నియోజకవర్గంలోని మొత్తం 20,929 దళిత కుటుంబాలకు దళిత బంధు కింద రూ.10 లక్షల చొప్పున ఇచ్చారు. ఎన్నికల కోసం తప్ప సదుద్దేశంతో పథకాన్ని అమలు చేయలేదన్న అపవాదు వచ్చింది. లబ్దిదారుల ఎంపికలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఫైనల్ చేసిన లిస్టులను కలెక్టర్లు ఆమోదించారు. యూనిట్ల ఎంపిక సరిగ్గాలేక మధ్యలోనే ఇచ్చిన యూనిట్లను అమ్ముకున్నారన్న ఫిర్యాదులొచ్చాయి. అనర్హులైన లబ్దిదారులకిచ్చి వారి నుంచి రెండు, మూడు లక్షలు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వాళ్ల అనుచరులు వసూలు చేశారని వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. కొంతమంది ఎమ్మెల్యేలు హెచ్చరించినట్టు మీడియాలో వార్తలూ వచ్చాయి. దాంతో అభయహస్తం



పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. ఒక కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం ఇవ్వడం ద్వారా ఉపాధి పొందుతూ మరింత అభివృద్ధి చెందే విధంగా మానిటరింగ్ చేయాలని, భావిస్తోంది. నిరుపేదలకే ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు.


ఎస్సీ, ఎస్టీల్లో ఆశలు

ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా సాంస్కృతికంగా వెనుకబడిన దళిత, గిరిజనుల సంక్షేమానికి పాటు పడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీలు కోరుతున్నారు. ఇందిరాగాంధీ గరిబీ హటావో అన్న నినాదం మొదలు.. ఇప్పటివరకు.. అనేక ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతూ వచ్చాయి. కానీ ఇప్పటికీ వారు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా రిజర్వేషన్లు దెబ్బతిని ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేకుండా పోయాయి.

బీసీ, మైనార్టీలకేది భరోసా

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని పెట్టనున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, మైనార్టీలకు కూడా అమలు చేసి భరోసా ఇవ్వాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి. గత ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు దళిత బంధుతో పాటు బీసీ, మైనార్టీలకు కూడా బంధు పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిచేందుకు లబ్దిదారుల్ని ఎంపిక చేసింది. ఈ ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని బీసీ, మైనార్టీలకు వర్తింప చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

నమ్మకం చాలా ముఖ్యం



అనుమానం ఏ బంధంలోనైనా చిచ్చు రేపుతుంది. భార్యా భర్తల మధ్య అనుబంధం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే నమ్మకం చాలా ముఖ్యం. ఒక్కసారి అనుమానం మొదలైందంటే పచ్చని కాపురంలో చిచ్చుపెడుతుంది. నమ్మకం లేని చోట అనుమానం బలంగా ఉంటుంది. కాబట్టి భార్యా,భర్తల బంధానికి పునాది నమ్మకం. ఆ పునాది ఎంత పటిష్టంగా ఉంటే ఆ భార్యాభర్తల బంధం అంత బలంగా ఉంటుంది. అనుమానం అనే చిన్న బీజం జీవితాలను నాశనం చేస్తుంది. అంతటి ప్రమాదమైన అనుమానాన్ని మొదట్లోనే తుంచి వేయాలి. లేదంటే మహావృక్షమై కుటుంబాలనే కబళించేస్తుంది. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...

దీప్తికి సుమారు 40 ఏండ్లు ఉంటాయి. ఆమె భర్త అనీల్ ఒక మీడియా సంస్థలో ఉద్యోగి. అతనికి 45 ఏండ్లు ఉంటాయి. వారికి ముగ్గురు అబ్బాయిలు. పెద్దబ్బాయి 10, రెండో అబ్బాయి 8, చిన్న బాబు 6వ తరగతి చదువుతున్నారు. దీప్తి ఒక ప్రయివేటు కాలేజీలో ఉద్యోగం చేస్తుంది. కానీ ఆమె ఏటీఎం కార్డు అనిల్ దగ్గరే ఉంటుంది. బస్ చార్జీలకు అవసరం వరకే దీప్తి చేతికి ఇస్తాడు. అది కూడా ఆమె లెక్కలు చెప్పాలి. తాను సంపాదిస్తున్నా ఇష్టం వచ్చిన చీర కొనుక్కునే హక్కు కూడా ఆమెకు లేదు. ఎప్పుడైనా పండగలు, పుట్టినరోజు, పెండ్లి రోజుకి ఆమె డబ్బుతోనే చీర కొనిచ్చి తిడతాడు. ఆ తిట్లు భరించలేక ఆ చీర లేకపోయినా బాగుంటుంది అనిపించేది దీప్తికి.

దీప్తికి కనీసం ఫోన్ కూడా లేదు. 'నీకెందుకు ఫోన్. ఇంట్లో ఉంది కదా! కాలేజీలో ఎటూ ఫోన్ అవసరం ఉండదు' అంటాడు. కనీసం వాళ్ళ అమ్మ వాళ్ళతో మాట్లాడాలన్నా దీప్తికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఇంట్లో ఉండే ఫోన్లో పిల్లలు క్లాసులు వింటారు. ఆమె తీసుకున్న రెండు నిమిషాలకే తిరిగి ఇవ్వమంటూ గోల చేస్తారు. దీప్తి అనిల్‌కు రెండో భార్య. మొదటి భార్య వదిలేసి వెళ్ళిపోతే తర్వాత ఈమెను పెండ్లి చేసుకున్నాడు. దీప్తిని అతను ఒక యంత్రంలా భావిస్తాడు. ఆమెను తన కుటుంబ సభ్యులతో కలవనియ్యడు, మాట్లాడనియ్యడు. కనీసం ఆమెకు ఆరోగ్యం బాగోలేక పోయినా పట్టించుకోడు. ఒకసారి దీప్తి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంటే ఒంటరిగా వదిలేసి అనిల్ ఫంక్షన్‌కి వెళ్ళిపోయాడు. ఆమె ఫోన్ చేసినా స్పందించలేదు. ఇంటికి ఫోన్ చేస్తే వాళ్ళ చిన్న బాబు వచ్చి ఇంటికి తీసుకు వెళ్ళాడు.

పిల్లలందరూ అనిల్‌కే సపోర్ట్ చేస్తారు. తల్లిని అస్సలు గౌరవించరు. పెద్ద బాబు అయితే అనిల్‌తో కలిసి దీప్తిని కొడతాడు. అది కూడా ఆమె ఎవరికీ చెప్పుకోలేని చోట. పెద్ద బాబు ఆర్యకు 15 ఏండ్లు ఉంటాయి. అప్పుడే అతను స్నేహితులతో కలిసి మందు తాగడం, సిగరేట్లు తాగడం లాంటివి చేస్తుంటాడు. 'ఈ వయసులో ఎంటి ఈ పనులు' అని అడిగితే తల్లిని తిడతాడు, కొడతాడు.

> పిల్లలందరూ అనిల్‌కే సపోర్ట్ చేస్తారు. తల్లిని అస్సలు గౌరవించరు. పెద్ద బాబు అయితే అనిల్‌తో కలిసి దీప్తిని కొడతాడు. అది కూడా ఆమె ఎవరికీ చెప్పుకోలేని చోట. పెద్ద బాబు ఆర్యకు 15 ఏండ్లు ఉంటాయి. అప్పుడే అతను స్నేహితులతో కలిసి మందు తాగడం, సిగరేట్లు తాగడం లాంటివి చేస్తుంటాడు.



అనిల్ దగ్గరుండి మరీ కొడుకుని ప్రోత్సహిస్తాడు. ఒకసారి నెక్లెస్ రోడ్‌లో ఆర్యను పోలీసులు అరెస్టు చేశారు. అనిల్‌కు ఫోన్ చేస్తే అతను వెళ్ళాడు. 'మీ బాబు వయసెంత? అతనికి అప్పుడే బండి ఇచ్చి పంపించారు. పైగా బాగా తాగి ఉన్నాడు. మీరు మీడియాలో పని చేస్తున్నారు. పైగా ఇది మొదటి సారి కనుక వదిలేస్తున్నా. ఇలా ఇంకో సారి జరిగితే కేసు పెడతాం' అని పోలీసులు హెచ్చరించి పంపించారు.

ఇంత జరిగినా అనిల్ కొడుక్కు భయం చెప్పకుండా అలాగే వదిలేశాడు. ఆర్య భవిష్యత్ ఏం కావాలి? దీప్తి ఏం చెప్పినా 'ముందు నీ సంగతి చూసుకో, తర్వాత నాకు చెప్పు' అంటాడు. పైగా అనిల్ దీప్తి గురించి పిల్లలకు, చుట్టు పక్కల వారికి, బంధువులకు చెడ్డగా చెబుతుంటాడు. ఆమెకు ఎవరితోనో సంబంధం ఉందని ప్రచారం చేశాడు. అతను ఆమెను కలవడానికి రాత్రి పూట వస్తాడని పిల్లలకు చెప్పి కాపలా కాయమంటాడు. అలా ఆమెకు ఎలాంటి సపోర్ట్ లేకుండా చేశాడు. ఇక ఆమెకు పిల్లల ముందు ఎలాంటి విలువా లేకుండా పోయింది. ఆర్య ఏం చేసినా అనిల్ సపోర్ట్ చేస్తాడు. దాంతో తల్లి తప్పుడు మనిషిగా, తండ్రి మంచి వాడిగా కనిపిస్తున్నాడు. దీప్తిని అనుమానించడం, విపరీతంగా కొట్టడం ఇదే ఆ ఇంట్లో నిత్యం జరిగే పని. ఈ బాధలు భరించలేక దీప్తి ఒక సారి పోలీసులతో, మరో సారి తన కాలేజీ యాజమాన్యంతో కౌన్సెలింగ్ ఇప్పించింది. అయినా అతనిలో ఎలాంటి మార్పు రాలేదు. ఒక వైపు కొడుకు చెడు మార్గం పట్టాడు. ఇలాంటి పరిస్థితుల్లో దీప్తి తనకు న్యాయం చేయమంటూ ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చింది.

> 'మీరు చెప్పింది నిజమే మేడమ్. నేను ఇంత దూరం ఆలోచించలేదు. ఆర్యను వెంటనే ఓ మంచి హాస్టల్లో చేర్పి స్తాను. దీప్తిని మంచిగా చూసుకుం టాను. లేని పోని అనుమానాలతో ఇన్ని రోజులు దీప్తిని బాధపెట్టాను. నేను ఇంత బాధపెట్టినా దీప్తి ఎప్పుడూ నాకు ఎదురు మాట్లాడలేదు. ఇవేవీ పట్టించుకోకుండా తనతో లెక్కలేకుండా ప్రవర్తించాను. ఇకపై నేను మారతాను. తనను ప్రేమగా చూసుకుంటాను'

మేము అనిల్‌ను పిలిచి మాట్లాడితే 'దీప్తి అమ్మ వాళ్ళు మంచి వాళ్ళు కాదు. అందుకే నేను అక్కడికి వెళ్ళను. దీప్తిని కూడా వాళ్ళ ఇంటికి వెళ్ళనీయను. వాళ్ళంతా క్యారెక్టర్ లేని వాళ్ళు. అందుకే దీప్తిపై నాకు అనుమానం. తన చెల్లి, అక్క కూతురు ఇద్దరూ ఇంట్లో నుండి వెళ్ళి పోయి పెండ్లి చేసుకున్నారు. అందుకే వాళ్ళంటే నాకు అసహ్యం. ఇక మా బాబు పెద్దవాడు అవుతున్నాడు. వాడికి ఆ మాత్రం స్వేచ్ఛ ఇవ్వక పోతే ఎలా? ఇప్పుడే కదా లైఫ్‌లో ఎంజాయ్ చేసేది. దానికి కూడా అడ్డు చెబుతుంది. దీప్తి అలా చేస్తుంది కాబట్టే ఆర్యకు ఆమంటే ఇష్టం లేదు. దాంతో తిడుతున్నాడు, కొడుతున్నాడు. తనకు అడ్డు చెప్పకపోతే ఆర్య అలా ఎందుకు చేస్తాడు. తప్పులన్నీ తన దగ్గర పెట్టుకొని ఇప్పుడు మాపైన కంప్లైయింట్ ఇవ్వడానికి మీ దగ్గరకు వచ్చింది' అంటూ చెప్పుకొచ్చాడు.

దానికి మేము 'ప్రేమించి పెండ్లి చేసుకోవడం తప్పెలా అవుతుంది. ఈ రోజుల్లో ఇది సాధారణమయ్యింది. పైగా ఇంత చిన్న వయసులో మీ అబ్బాయి తాగడం తప్పులేదు కాని అమ్మాయిలు ప్రేమించి పెండ్లి చేసుకుంటే చెడిపోయినట్టు భావిస్తున్నారు. పైగా మీరు బాధ్యత కలిగిన మీడియా సంస్థలో పని చేస్తున్నారు. అలాంటిది ఎంత ఉన్నతంగా ఆలోచించాలి. కానీ మీ ఆలోచనలు ఇంత కుచించుకుపోయి ఉన్నాయి. దీప్తి వాళ్ళ అమ్మ వాళ్ళ ఇంటికి మీకు ఇష్టం లేకపోతే మీరు వెళ్లకండి. ఆమెను వెళ్ళొద్దని చెప్పడం సరి కాదు. మీకు ఎలా ఓ కుటుంబం ఉందో ఆమెకు కూడా ఓ కుటుంబం ఉంది. మీ ఇష్టాలను ఆమెపై బలవంతంగా రుద్దడం సరైనది కాదు. కనీసం ఆమె వద్ద ఫోన్ కూడా లేకుండా చేశారు. ఆమె ఏటీఎం కార్డు మీ దగ్గరే పెట్టుకున్నారు. ఆమె సంపాదన కూడా ఆమె వాడుకునేందుకు హక్కు లేదు. తన ప్రతి అవసరానికి డబ్బు మీ వద్ద అడగాలి. మీరు ఇలా ప్రవర్తించడం అస్సలు మంచిది కాదు.

ఇక బాబు ఆర్య ప్రవర్తన మితిమీరిపోయింది. వయసుకు మించి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. వయసు పెరిగే కొద్ది అతని పరిస్థితి ఏంటో మీరే ఆలోచించుకోండి. మత్తు పదార్థాలకు బానిసైతే ఏం చేస్తారు. దీప్తిని మీరు కొట్టడమే కాకుండా బాబుతో కూడా కొట్టిస్తున్నారు. పిల్లల ముందు ఆమెకు విలువ లేకుండా చేస్తున్నారు. రేపు వాళ్ళు పెద్ద వాళ్ళు అయితే మిమ్మల్ని కూడా లెక్క చేయరు. చేయి దాటి పోతారు. మీరే ఆలోచించుకోండి. మీ భార్యను గౌరవించి పిల్లలను మంచి పౌరులుగా తీర్చి దిద్దుతారో లేదా వాళ్ళ జీవితాలను నాశనం చేస్తారో మీ ఇష్టం' అని చెప్పాము.

దానికి అతను 'మీరు చెప్పింది నిజమే మేడమ్. నేను ఇంత దూరం ఆలోచించలేదు. ఆర్యను వెంటనే ఓ మంచి హాస్టల్లో చేర్పిస్తాను. దీప్తిని మంచిగా చూసుకుంటాను. లేని పోని అనుమానాలతో ఇన్ని రోజులు దీప్తిని బాధపెట్టాను. చాలా ఇబ్బందులకు గురిచేశాను. నేను ఇంత బాధపెట్టినా దీప్తి ఎప్పుడూ నాకు ఎదురు మాట్లాడలేదు. ఇవేవీ పట్టించుకోకుండా తనతో లెక్కలేకుండా ప్రవర్తించాను. ఇకపై నేను మారతాను. తనను ప్రేమగా చూసుకుంటాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.

- వై వరలక్ష్మి
9948794051

ముల్లంగిని మిస్‌కాకుండా తింటే..



కాలేయ ఆరోగ్యానికి ముల్లంగి తింటే మంచిదా? కాదా అని చాలామంది సందేహిస్తుంటారు. కొంతమంది అసలు ఈ ముల్లంగిని తినడానికే ఇష్టపడరు. మరి ముల్లంగిని మిస్‌కాకుండా తింటే.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కాలేయ ఆరోగ్యానికి ముల్లంగి ఎంతో సహాయపడు తుంది. ముల్లంగిలో ఉండే గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయ ప్రక్రియల్లో సహాయపడతాయి. ముల్లంగిలో యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. అలాగే విటమిన్ సి కూడా ఎక్కువగా ఉంటుంది. ముల్లంగి సూప్ లేదా జ్యూస్‌ని తాగితే.. కాలేయ కణాలను రక్షించడంలో సహాయపడుతుంది. కాలేయ కణాల పునరుత్పత్తిని పెంచుతుంది. ముల్లంగిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాలేయ ఆరోగ్యానికి బరువు చాలా కీలకం. ఆరోగ్యకరమైన



బరువును నిర్వహించడానికి ముల్లంగి ఎంతగానో సహాయపడుతుంది. ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకుంటే కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

రక్త ప్రవాహంలో టాక్సిన్స్ వడపోత ప్రక్రియలో ముల్లంగి సహాయపడుతుంది. ముల్లంగిలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలను అందిస్తుంది. ఇవి కాలేయ ఆరోగ్యానికి పరోక్షంగా తోడ్పాటునందిస్తాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు.

నీటి కోసం మూగజీవాల తండ్లాట

- నిరుపయోగంగా నీటి తొట్టిలు
- నిర్వహణను గాలికొదిలిన అధికారులు



నవతెలంగాణ-మల్హర్‌రావు

వేసవిలో మూగజీవాలు నీటి కోసం తండ్లాడుతున్నాయి. ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ చట్టంలో జీవాల దాహార్తి తీర్చడానికి గిరిజన తండాలు, గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించింది. సంబంధిత అధికారులు వీటి నిర్వహణ గాలికొదిలేయడంతో మూగజీవాలు తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి. కొన్ని చోట్ల నీటితొట్లు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి. దాంతో జీవాల దాహార్తి తీర్చడానికి జనం అవస్థలు పడుతున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో మొత్తం 15 గ్రామపంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2019 వరకు పల్లెల్లో మూగజీవాల సంఖ్యకు అనుగుణంగా సుమారుగా 16 వరకు నీటి తొట్లు నిర్మించారు. మండలంలో తాడిచెర్ల, మల్లారం, ఇప్పలపల్లి, వళ్లెంకుంట, నాచారం, రుద్రారం తదితర గ్రామాల్లో నీటి తొట్టెలు నిరుపయోగంగా మారి చెత్త, చెదారం, పిచ్చి మొక్కలతో శిథిలావస్థకు చేరాయి. దాంతో పశువులను బోరుబావులు, చెరువుల్లోకి తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నారు. మానేరులో సైతం చుక్క నీరులేక ఎడారిగా మారింది.

ఎండిన వాగులు,వంకలు : మల్లయ్య, రైతు

గ్రామాల్లో వాగులు, వంకలు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. పశువులు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాయి. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి. గ్రామాల్లో ఉన్న నీటి తొట్టెలు మరమ్మతులు చేయాలి.

చెరువుల్లో నీటిని తాగిస్తున్నాం : కత్తయ్య, పశువుల కాపరి

గ్రామాల్లో నిర్మించిన పశువుల నీటి తొట్టెలు నిరుపయోగంగా మారడంతో పశువుల దాహార్తి తీర్చుకోవడం కోసం దూరంగా ఉన్న చెరువులు, వ్యవసాయ బోరుబావుల వద్దకు తీసుకెళ్లి తాగిస్తున్నాం. ఎండలు తీవ్రమైతే నీటి కొరతతో మరింతగా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా : శ్యాం సుందర్, ఎంపీడీఓ

నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. సౌకర్యం లేక శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేసి ఉపయోగించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

సర్కారు అసమర్థత వల్లే కరువు

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ రాష్ట్ర సర్కారుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. 'కేసీఆర్ పొలం బాట' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించిన ఆయన మొదట ముగ్దుంపూర్ గ్రామంలో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. అక్కడి రైతుల బాధలు తెలుసుకున్నారు. అనంతరం సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండల కేంద్రంలో రైతులతో ముఖాముఖి అయ్యారు.

శభాష్‌పల్లి నుంచి మధ్యమానేరు జలాశయాన్ని పరిశీలించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బాబూజగ్జీవన్‌రావు చిత్రపటానికి కేసీఆర్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మాట్లాడారు. చనిపోయిన రైతు కుటుంబాలకు తలా రూ.25లక్షలు వెంటనే పరిహారం చెల్లించి.. పరామర్శించాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట నష్టపరిహారం కింద ఎకరానికి రూ.25వేలు ఇవ్వాలన్నారు.

తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పక్క రాష్ట్రాల సీఎంలు ఫడ్నవీస్, జగన్ సహా ఆనాటి గవర్నర్ నరసింహన్‌తో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించామని గుర్తు చేశారు. అప్పుడు తాను కరీంనగర్‌లో ఓ స్పష్టమైన మాట చెప్పానని.. కాళేశ్వరంతో ఈ జిల్లాకు నీళ్ల ధోకా ఉండబోదని, నాలుగు జిల్లాల్లోనూ సజీవ జలధారలు ఉంటాయన్నానని గుర్తు చేశారు. మానేరు వాగు, అప్పర్ మానేరు డ్యాం మొదలుకుని అన్నారం బ్యారేజీ దగ్గర గోదావరి కలిసే వరకూ నిరంతరం నీళ్లతో కళకళలాడిన రోజులన్నీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన కొద్ది రోజుల్లోనే మాయం అయ్యాయని అన్నారు. గోదావరి మీద నిర్మించిన బ్యారేజీలు, అసంపూర్తిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తికావడం, ఎస్సారెస్పీకి నీళ్లు తక్కువైతే కాళేశ్వరం నుంచి నింపుకునే విధంగా పునరుజ్జీవం రావడంతో గోదావరి నది 200 కిలోమీటర్ల పొడవునా నిండుగా జలాలతో ఉండేదన్నారు. మరో జలధారలో శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకంతో వరద కాలువనే రిజర్వాయర్‌గా మార్చి ఒకటిన్నర టీఎంసీల నీళ్లు సంవత్సరం పొడవునా నిండి ఉండేలా చేశామన్నారు. ఇప్పుడు ఆ వరద కాలువా నెర్రలుబారిందన్నారు. ఐదారేండ్లు ఈ సజీవ జలధారలను ఎలా అనుభవించారో యావత్ ప్రజానీకానికి తెలుసని, ఇప్పుడు ఆ జలధారలు ఎలా మాయం అయ్యాయో అర్థం చేసుకున్నారని చెప్పారు. ఎన్నికల తరువాత మేడిగడ్డ పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా చేసేందుకు 10వేల మంది రైతులతో కలిసి ముట్టడిస్తానని ప్రకటించారు. మిడ్ మానేరు కట్ట కొట్టుకుపోవడానికి కంపెనీ కారణం కాదా? అని ప్రశ్నించారు. ఈ రోజు ఆ మంత్రి అడ్డం పొడవు మాట్లాడుతున్నారని అన్నారు.

కొన్ని జిల్లాలో ఏడు శాతం, మరికొన్ని జిల్లాల్లో 20శాతం, దాదాపు 20 నుంచి 25 జిల్లాల్లో అందులోనూ ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో సాధారణం కంటే రెట్టింపు వర్షపాతమే నమోదైందని వివరించారు. అధిక వర్షపాతం ఉన్న జిల్లాల్లోనే ఈ కరువు పరిస్థితులు ఎందుకు వచ్చాయని ప్రశ్నిస్తే వర్షపాతమే తక్కువ కురిసిందంటూ కొందరు అసమర్థ మంత్రులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ సామర్థ్యం తెలువని వాళ్లే రాజ్యమేలుతున్నారని విమర్శించారు. రాళ్ల వానతో 1.50లక్షల ఎకరాలు చేతికిరాకుండా పోతే.. నీళ్లు అందించలేని అసమర్థతో 15లక్షల నుంచి 20లక్షల ఎకరాలు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాను పర్యటించిన నాలుగైదు గ్రామాల్లో రైతులు వెలిబుచ్చిన బాధలన్నీ కన్నీటి గాథలేనని, తన పర్యటన లేని గ్రామాల్లో కూడా రైతులు అడ్డం తిరిగి ఎండిన తమ పొలాలు చూడాలని ప్రాధేయపడ్డారని అన్నారు. కొన్ని చోట్ల పైకి పచ్చగా కనిపించినా.. కింద పొలం నెర్రలు బారిందని చూడాలంటూ పొలంలోనికి తీసుకెళ్లి చూపించి రైతులు బోరున విలపిస్తున్నారని, ఇది ప్రతి చోటా ఉందని వివరించారు. అనేక అడ్డగోలు హామీలు ఇచ్చి మంచిగున్న వాళ్ల నోట్లో కాంగ్రెస్ మట్టి కొట్టిందన్నారు. వారిని ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. తప్పించుకుందామనుకుంటే.. ప్రజలు మీ వీపులు విమానం మోత మోగిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ డ్రామాలు నడవబోవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి గలీజుగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. 20 రోజుల కిందట నీళ్లు వదిలి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఏ ఒక్క హామీ నెరవేర్చకపోగా.. సిగ్గు లేకుండా ఇవాళ మళ్లీ నాలుగైదు హామీలు ఇచ్చామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎవరిని ఉద్ధరించడానికి హామీలు ఇచ్చారోగానీ, ఇవాళ పంటలు ఎండని, కరెంటు మోటార్లు కాలని జిల్లా లేదని, యావత్ రాష్ట్రమంతా పాత తెలంగాణగా మారిపోయిందన్నారు.

బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లతో చేనేతలకు చేతినిండా తాము పని కల్పిస్తే ఇప్పుడున్న సర్కారు ఎలాంటి ఆర్డర్లూ ఇవ్వకపోగా వారికి బకాయి ఉన్న రూ.300కోట్లు నిలిపి వేసిందన్నారు. ఆ బకాయిలు ఇవ్వకపోతే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, రాష్ట్రమంతా రణరంగాన్ని తలపించేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీజేపీ గురించి మాట్లాడటానికి ఏమి ఉందని ప్రశ్నించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్ సహా పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

7నుంచి వానలు

(మొదటిపేజీ తరువాయి)

ఉపశమనం కలిగించేలా మేఘసందేశం వాన కబురును పట్టుకొచ్చింది. ఈ నెల ఏడో తేదీ నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రంలో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడొచ్చనే చల్లని కబురును అందించింది. 7,8 తేదీల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో, 9న ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకే పరిమితమయ్యే అవకాశముంది. అదీ అక్కడక్కడా పడే సూచనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్లు కూడా పడే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఆ ఐదు రోజుల పాటు మూడు నుంచి నాలుగు డిగ్రీలు తగ్గే సూచనలున్నాయి. అయితే, మిగతా ప్రాంతాల్లో వడగాల్పులు వీయడంతో పాటు గాలిలో తేమశాతం బాగా తగ్గే సూచనలున్నాయి.

కొల్వాయి(జగిత్యాల)	43.5 డిగ్రీలు
మాడ్గులపల్లి (నల్లగొండ)	43.5 డిగ్రీలు
మఠంపల్లి(సూర్యాపేట)	43.5 డిగ్రీలు
గూడపూర్(నల్లగొండ)	43.5 డిగ్రీలు
మార్తాన్‌పేట(రాజన్నసిరిసిల్ల)	43.5 డిగ్రీలు
నెన్నేల్(మంచిర్యాల)	43.4 డిగ్రీలు
కనగల్ (నల్లగొండ)	43.4 డిగ్రీలు
భద్రాచలం(భద్రాద్రి కొత్తగూడెం)	43.4 డిగ్రీలు
ఘన్‌పూర్(మేడ్చల్ మల్కాజిగిరి)	43.4 డిగ్రీలు
కన్నాయిపల్లి(వనపర్తి)	43.4 డిగ్రీలు

కవితపై సీబీఐ

(మొదటిపేజీ తరువాయి)

మహిళా కానిస్టేబుళ్లు ఉండాలని షరతు విధించింది. అలాగే, విచారణలో అన్ని నిబంధనలు పాటించాలని సూచించింది. ఈ కేసుకు సంబంధించి గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని కవిత నివాసంలోనే సీబీఐ అధికారులు ఆమెను మూడు రోజుల పాటు విచారించిన విషయం తెలిసిందే. కోర్టు అనుమతి రావడంతో వచ్చే వారమే సీబీఐ అధికారులు కవితను ప్రశ్నించనున్నట్టు సమాచారం. గతంలో తాము నమోదు చేసిన వాంగ్మూలం, అప్రూవర్‌గా మారినవాళ్లు, ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఆమెను ప్రశ్నించేందుకు సీబీఐ సిద్ధమవుతున్నట్టు సమాచారం.

నేడు కాంగ్రెస్ భారీ బహిరంగ సభ

- పది లక్షల మందితో తుక్కుగూడ జన జాతర
- ఐదుగ్యారంటీలతో దేశ ప్రజలకు భరోసా
- తెలుగులో మ్యానిఫెస్టో విడుదల
- హాజరుకానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ, రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల శంఖారావం పూరించనుంది. పది లక్షల మందితో భారీ బహిరంగ సభ తలపెట్టింది. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జన జాతరను తలపించేలా భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేసింది. ఈవేదిక నుంచి దేశ ప్రజలకు ఐదు గ్యారంటీలతో భరోసా ఇవ్వనుంది. శుక్రవారం ఢిల్లీలో ఇప్పటికే ఏఐసీసీ మ్యానిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్... శనివారం జనజాతర సభలో తెలుగు అనువాద మ్యానిఫెస్టోను విడుదల చేయనుంది. సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

మూడు భారీ వేదికలు...ఏర్పాట్లు పూర్తి

కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. 70 ఎకరాల్లో రాజీవ్‌గాంధీ పేరుతో ప్రాంగణం, 50 ఎకరాల్లో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసింది. ఈ సభకు పది లక్షల జనాన్ని తరలించనున్నారు. మ్యానిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేయనున్నారు. సభా ప్రాంగణంలో మూడు భారీ వేదికలు ఏర్పాటు చేసింది. మొదటి వేదికపై ఏఐసీసీ అగ్రనేతలతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు ఆశీనులు కానున్నారు. రెండో వేదికపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కూర్చొనేలా ఏర్పాటు చేసింది. మూడో వేదిక కళాకారుల కోసం ఏర్పాటు చేశారు. వందలాది మంది కళాకారులతో ఆటా,పాటలతో ప్రజలను ఉత్తేజపరిచేందుకు రెడీ అవుతున్నది.

మోడీకి దీటైన సమాధానం

పదేండ్ల నరేంద్రమోడీ ప్రభుత్వ నియంతృత్వ, దుష్పరిపాలనకు తెరదించి దేశంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించేందుకు తుక్కుగూడ సభను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ వేదిక నుంచే మోడీకి దీటైన సమాధానం ఇవ్వాలని భావిస్తున్నది. తాము అధికారంలోకి వస్తే ఏం చేయబోతున్నామో తెలియజేసే మ్యానిఫెస్టోను కాంగ్రెస్ విడుదల చేయనుంది. దీంతో తుక్కుగూడ సభపై తెలంగాణ ప్రజలతోపాటు దేశంలోని ప్రతి ఒక్కరిలోనూ, ఇతర రాజకీయ పార్టీల్లోనూ ఆసక్తి నెలకొంది. ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసింది. జన జాతర వేదికగా తమ బలం చాటి చెప్పి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో సమరోత్సాహం నింపేందుకు పార్టీ నేతలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. దేశానికి ఎంతో కీలకమైన బహిరంగ సభపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండు సార్లు ప్రత్యేకంగా సభ ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంత్రులు,



ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులంతా సభ ఏర్పాట్లను పరిశీలించారు. పది లక్షలకు తగ్గకుండా ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లాలకు ఆదేశాలిచ్చారు.

ప్రజా పాలనే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపుదల వంటి గ్యారంటీలను అమలు చేస్తున్నది. వంద రోజుల్లోనే 30 వేల ఉద్యోగ నియామకాలను చేపట్టింది. 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు జమతోపాటు ఇతర అనేక కార్యక్రమాలు చేపట్టింది. వీటన్నింటికీ తుక్కుగూడ వేదిక మీద నుంచి దేశ ప్రజలకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తెలియజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న పథకాలు, ఆరు గ్యారంటీల తరహాలోనే తాము కేంద్రంలోకి అధికారంలోకి వస్తే ఏం చేయనున్నామో కాంగ్రెస్ అగ్ర నాయకత్వం చాటి చెప్పనుంది. ఇదే తుక్కుగూడ వేదికగా గతేడాది సెప్టెంబరు 17న విజయభేరి నిర్వహించిన రోజు చెప్పిన ప్రతి మాటను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామనీ, అందుకే అదే తుక్కుగూడ వేదికగా జనజాతర సభలోనూ దేశ ప్రజలకు తాము ఏం చేయబోతున్నామో వెల్లడించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు.

పోలింగ్ శాతాన్ని పెంచండి



(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. పోలింగ్ శాతం పెంపు విషయంలో దేశంలోని అన్ని ప్రాంతాలకూ ఒకే విధమైన వ్యూహం పని చేయదని, సంబంధిత నియోజకవర్గాలకు అనుగుణంగా రూపొందించాలని భారత ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ సూచించారు.

ప్రజలే స్వయంగా ముందుకొచ్చి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యే వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సీఈసీ చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల కల్పన, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లను భాగస్వామ్యం చేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల ఉదాసీనతపై రూపొందించిన ఓ బుక్‌లెట్‌ను కూడా విడుదల చేశారు. లాజిస్టికల్ కార్యకలాపాల క్రమబద్ధీకరణ, ఓటర్లలో అవగాహన పెంచేందుకు ఉద్దేశించిన 'సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్-ఎలక్టోరల్ పార్టిసిపేషన్' ప్రోగ్రామ్ తదితర అంశాలపై చర్చలు జరిపారు.



ఐపీఎల్ మ్యాచులకు ఏ నీళ్లు?

● కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్జీటీ ప్రశ్న



బెంగళూరు : బెంగళూరులో జనం ఒకవైపు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతుండగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచుల కోసం చిన్నస్వామి స్టేడియంలో నీటి వినియోగంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో పౌరులు లేవనెత్తుతున్న అంశంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్పందించింది. ఒక్కో మ్యాచ్ నిర్వహణకు, పిచ్ రూపకల్పనకు వేలాది లీటర్ల నీరు అవసరం అవుతుండగా నీటిని ఎక్కడ్నుంచి తీసుకొస్తున్నారని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ)తో పాటు బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (బీడబ్ల్యూఎస్ఎస్‌బీ), కర్నాటక స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (కేఎస్‌పీసీబీ)లను ఎన్జీటీ ప్రశ్నించింది. చిన్నస్వామిలో మ్యాచ్‌ల నిర్వహణకు ఎంత నీటిని వాడుతున్నారు? ఎక్కడ్నుంచి తీసుకొస్తున్నారు? అనే అంశాలపై మే 2 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ స్టేడియంలో ఇప్పటికే మూడు ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించగా ఒక్కో మ్యాచ్‌కు 75 వేల లీటర్ల శుద్ధి చేసిన నీటిని వినియోగించినట్టు సమాచారం. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో భాగంగా బెంగళూరులో ఇంకా నాలుగు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది.

దూబె ధనాధన్

● రాణించిన జడేజా, రహానె ● చెన్నై సూపర్‌కింగ్స్ 165/5

ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. సూపర్‌కింగ్స్ బ్యాటర్లు బౌండరీల వర్షం కురిపించకపోయినా.. ఎం.ఎస్ ధోని అభిమానులు మిస్టర్ కూల్‌పై అభిమాన సంద్రం ఎలా ఉంటుందో చూపించారు!. మహి నామస్మరణలో మునిగిన ఉప్పల్ స్టేడియంలో చెన్నై సూపర్‌కింగ్స్ తొలుత 165/5 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లలో భువి, కమిన్స్, జైదేవ్ రాణించారు.

నవతెలంగాణ-హైదరాబాద్



శివం దూబె (45, 24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), అజింక్య రహానె (35, 30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (31 నాటౌట్, 23 బంతుల్లో 4 ఫోర్లు) రాణించటంతో శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 165 పరుగులు చేసింది. గత మ్యాచ్‌లో ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారగా.. ఈ మ్యాచ్‌లో ఆ జోరు కాస్త తగ్గింది. చెన్నై సూపర్‌కింగ్స్ మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని (1 నాటౌట్) క్రీజులోకి రావటంతో ఉప్పల్ స్టేడియం హోరెత్తింది. మహి మేనియాతో సన్‌రైజర్స్ సొంతగడ్డపై స్టేడియం పూర్తిగా పసుపు మయమైంది.

ఆ ముగ్గురు మెరువగా.. : సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ నెగ్గి పగుళ్లు తేలిన పిచ్‌పై తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భీకర ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రచిన్ రవీంద్ర (12, 9 బంతుల్లో 2 ఫోర్లు) నిరాశపరిచాడు. చాన్నాండ్ల తర్వాత భువనేశ్వర్ కుమార్ కొత్త బంతితో శుభారంభం అందించాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (26, 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో నిలిచినా వేగంగా పరుగులు సాధించలేదు. సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి పరుగుల నియంత్రణ పాటించారు. అజింక్య రహానె (35, 30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి గైక్వాడ్ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. సూపర్‌కింగ్స్‌ను నిలబెట్టే భాగస్వామ్యం రహానె, శివం దూబె (45) అందించారు. శివం దూబె తనదైన శైలిలో సిక్సర్లు బాదాడు. నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో కదం తొక్కిన శివం దూబె సూపర్‌కింగ్స్‌ను భారీ స్కోరు దిశగా నడిపించాడు. మూడో వికెట్‌కు రహానెతో కలిసి 39 బంతుల్లోనే 65 పరుగులు జోడించాడు. అర్థ సెంచరీ ముంగిట శివం దూబె వికెట్ కోల్పోవటంతో సూపర్‌కింగ్స్ లయ తప్పింది. రవీంద్ర జడేజా (31 నాటౌట్, 23 బంతుల్లో 4 ఫోర్లు), డార్లీ మిచెల్ (13, 11 బంతుల్లో 1 ఫోర్) డెత్ ఓవర్లలో ఆశించిన ప్రదర్శన చేయలేదు. చివర్లో ఎం.ఎస్ ధోని (1 నాటౌట్, 2 బంతుల్లో) క్రీజులోకి రావటంతో ఉప్పల్ స్టేడియం ఒక్కసారిగా ఊగిపోయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, పాట్ కమిన్స్, జైదేవ్ ఉనద్కత్ రాణించారు.



ఐఓఏలో అంతర్గత పోరు?

● సీఈవో నియామకంపై తీవ్ర వ్యతిరేకత



న్యూఢిల్లీ : 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ)లో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఓవైపు, ఎగ్జిక్యూటివ్ కమిటీలో తొమ్మిది మంది సభ్యులు మరో వర్గంగా ఏర్పడటంతో ఒలింపిక్ సంఘంలో అంతర్గత పోరుకు తెరలేచింది. 'భారత ఒలింపిక్ సంఘంలో అనుమతి లేని వ్యక్తులు, ఉద్యోగం నుంచి తొలగింపబడిన వ్యక్తులు ఐఓఏ భవనంలోకి వచ్చి కార్యాలయాలను వినియోగిస్తున్నారు. ఇటువంటి చర్యలను ఐఓఏ తీవ్రంగా పరిగణిస్తుంది. ప్రయివేటు వ్యక్తుల చట్టవిరుద్ధ చొరబాటుగా దీన్ని చూడాల్సి ఉంటుంది. ఇక నుంచి ఐఓఏ భవనంలోకి ఎవరూ అనుమతి లేకుండా ప్రవేశించకూడదు' అని తొమ్మిది మంది ఎగ్జిక్యూటివ్ సభ్యుల సంతకాలతో శుక్రవారం ఓ సర్క్యులర్ విడుదల చేశారు. ఈ విషయాన్ని ఐఓఏ అధ్యక్షురాలు ఉషకు సైతం తెలియజేసినట్టు సమాచారం.

ఇదీ అసలు కథ : ఈ ఏడాది జనవరి 6న ఐఓఏ సీఈవోగా రఘురామ్ అయ్యర్ నియమితులయ్యారు. అప్పటివరకు ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ చౌబె సీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆ నాటి ఐఓఏ సమావేశంలో ఉష సహా ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సీఈవో నియామకంపై అంగీకారం తెలుపుతూ సంతకాలు చేశారు. కానీ సీఈఓగా అయ్యర్ వేతనం, ఇతర అలవెన్స్‌లపై నిర్ణయం మాత్రం ఉష ఏకపక్షంగా తీసుకున్నారని ప్రధాన ఆరోపణ. అసలే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐఓఏ ఖజానా నుంచి సీఈవోకు ఏడాదికి సుమారు రూ.3 కోట్ల వేతనం చెల్లించాల్సి వస్తుంది. ప్రతి నెల రూ.20 లక్షలు, అదనంగా ఇతర అలవెన్సులు అందేలా ఉష నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ఎగ్జిక్యూటివ్ సభ్యులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం చేశారు. పీటీ ఉష అందుబాటులో లేని సమయంలో ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సమావేశమై సీఈవోను, పిటి ఉష వ్యక్తిగత సహాయ కార్యదర్శిని తొలగిస్తూ ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సీఈవోను ఉద్యోగం నుంచి తొలగించినా.. కార్యాలయానికి వస్తున్నారని తాజాగా మరో సర్క్యులర్ జారీ చేశారు. ఐఓఏ ఆఫీస్ బేరర్లు అజయ్ పటేల్, రాజలక్ష్మి సింగ్ డియో, గగన్ నారంగ్, సహదేవ్ యాదవ్, డోలా బెనర్జీ, హర్పాల్ సింగ్, యోగేశ్వర్ దత్, అమితాబ్ శర్మ, భూపిందర్ సింగ్ బజ్వాలు తాజా సర్క్యులర్‌లో సంతకాలు చేశారు. దిగ్గజ అథ్లెట్, ఐఓఏ బాస్ పిటీ ఉష ఈ అంశంపై స్పందించాల్సి ఉంది

క్రాస్‌కంట్రీ క్రికెట్ విజేత సీఎఫ్‌సీ హైదరాబాద్

మెల్‌బోర్న్‌పై 2-0తో వన్డే సిరీస్ కైవసం



హైదరాబాద్ : క్రాస్‌కంట్రీ క్రికెట్ టోర్నమెంట్‌లో సీఎఫ్‌సీ (సెంటర్ ఫర్ క్రికెట్) ఎక్సలెన్స్ హైదరాబాద్ విజేతగా నిలిచింది. హైదరాబాద్ వేదికగా మెల్‌బోర్న్ క్రికెట్ జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌ను సీఎఫ్‌సీ సొంతం చేసుకుంది. రెండు వన్డేల్లోనూ విజయం సాధించి 2-0తో సిరీస్ సాధించింది. శుక్రవారం జరిగిన రెండో వన్డేలో సీఎఫ్‌సీ 6 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీఎఫ్‌సీ 49.4 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. ఆర్యన్ (71), షానవాజ్ (54) రాణించారు. ఛేదనలో మెల్‌బోర్న్ జట్టు 48.3 ఓవర్లలో 263 పరుగులకు కుప్పకూలింది. మెల్‌బోర్న్ జట్టుపై నిలకడగా రాణించిన హైదరాబాద్ క్రికెటర్లను హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సహాయ కార్యదర్శి బసవరాజు, సీఎఫ్‌సీ అకాడమీ చీఫ్ కోచ్ జగదీశ్ రెడ్డిలు రూ. 5 లక్షల నగదు బహుమానంతో అభినందించారు. రోహిత్ రాయుడు, కార్తికేయ, సిరిచందన, అనురాగ్, యశస్వి, శృంజిత్ రెడ్డి తదితరులు నగదు ప్రోత్సాహకం అందుకున్న వారిలో ఉన్నారు. సీఎఫ్‌సీ వ్యవస్థాపక సభ్యులు భరణి విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

టైటిల్ పోరుకు తరుణ్

● ముగిసిన అన్మోల్, దేవికా పోరాటం
● కజకిస్తాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్



అస్తానా (కజకిస్థాన్) : కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్‌లో భారత షటర్లు సత్తా చాటుతున్నారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ షట్లర్ తరుణ్ మన్నెపల్లి టైటిల్ పోరుకు చేరుకున్నాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో 21-8, 21-7తో లి డుసి ఫట్ (వియత్నాం)పై తరుణ్ గెలుపొందాడు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ 24-22, 21-16తో జపాన్ షట్లర్ సొరనొ యోషికవాపై విజయంతో ఫైనల్లో ప్రవేశించింది. క్వార్టర్స్‌లో భారత యువ సంచలనం అన్మోల్ ఖర్బ్‌ను సొరనొ ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సంజయ్ శ్రీవాత్సవ, మనీషాల జోడీ 21-16, 10-21, 21-14తో కొసిల మమ్మేరి, తనైనాలను ఓడించి అంతిమ సమరానికి చేరుకుంది. అన్మోల్‌తో పాటు దేవికా పోరాటం సైతం క్వార్టర్స్‌లోనే ముగిసింది. హైదరాబాద్ షట్లర్ రుత్విక శివాని సైతం క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక, రోహన్ క్వార్టర్స్‌లో 15-21, 15-21తో మలేషియా జోడీ చేతిలో నిరాశపరిచారు.

సూర్యకుమార్ వచ్చేశాడు



ముంబయి : పొట్టి ఫార్మాట్‌లో సూపర్‌స్టార్, మిస్టర్ 360 ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సాధించాడు. ఇటీవల బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగిన ఫిట్‌నెస్ పరీక్షలో సూర్యకుమార్ యాదవ్ పాసయ్యాడు. దీంతో ఐపీఎల్ 17లో ఆడేందుకు సూర్యకుమార్ యాదవ్‌కు ఎన్‌సీఏ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ కారణంగా డిసెంబర్ నుంచి క్రికెట్‌కు దూరంగా ఉంటున్న సూర్యకుమార్ శుక్రవారం తన ఐపీఎల్ జట్టు ముంబయి ఇండియన్స్ శిబిరంలో చేరాడు. సూర్య వాంఖెడే స్టేడియంలో సహచర క్రికెటర్లతో కలిసి తనదైన ట్రేడ్ మార్క్ షాట్లు ఆడుతున్న వీడియోను ముంబయి ఇండియన్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగబోయే మ్యాచ్‌లో సూర్యకుమార్ ఆడే అవకాశం ఉంది.



'పుష్ప 2'లో రష్మిక మందన్న

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో రాబోతున్న 'పుష్ప-2 ది రూల్' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. శుక్రవారం రష్మిక మందన్న పుట్టినరోజు సందర్భంగా పుష్ప -2లో శ్రీవల్లిగా ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈనెల 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేస్తున్నట్లుగా మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదల కానుంది.

రష్మిక.. భిన్న పాత్రలకు కేరాఫ్

రష్మిక మందన్న, హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్న ఈ చిత్రానికి ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. 60 శాతం పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది.



'గర్ల్‌ఫ్రెండ్'లో రష్మిక మందన్న



మా టార్గెట్ రీచ్ అయ్యాం

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా శుక్రవారం విడుదలై అన్ని చోట్ల నుంచీ సూపర్ హిట్ రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ,'యూత్‌తోపాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కువగా థియేటర్స్‌కు వస్తున్నారు. మొత్తంగా మేము టార్గెట్ చేసిన ఫ్యామిలీ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యింది' అని తెలిపారు.

'అన్ని వర్గాల ప్రేక్షకులు తమకు సినిమా నచ్చిందంటూ మెసేజ్‌లు పంపిస్తున్నారు. నేను ఏ ఫ్యామిలీ ఎమోషన్స్ అయితే బలంగా నమ్మి కథ రాశానో అవి ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా రీచ్ అయ్యాయి. ఇదొక ఆణిముత్యం లాంటి సినిమా. కుటుంబం బాగుండాలని ఓపికగా కష్టపడే ప్రతి ఒక్క ఫ్యామిలీ మెంబర్‌కు అది బ్రదర్ కావొచ్చు, మదర్ కావొచ్చు, ఫాదర్ కావొచ్చు..వారికి అంకితమిస్తూ ఫ్యామిలీ స్టార్ సినిమా రూపొందించాను. చూసిన వాళ్లు మళ్లీ చూడండి. ఇలాంటి మంచి సినిమాను సొసైటీలోకి తీసుకెళ్లాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు పరశురామ్ పెట్ల చెప్పారు.

హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ, 'ఆడియెన్స్‌తో కలిసి సినిమా చూశాను. వాళ్లు ఎమోషనల్‌గా ఫీలవుతున్నారు. క్లాప్స్ కొడుతున్నారు, నవ్వుతున్నారు. నేను చేసిన ఇందు, విజయ్ గోవర్ధన్ క్యారెక్టర్స్‌తో పాటు బామ్మ, వదిన, పిల్లల క్యారెక్టర్స్‌ను వారిలోని ఎమోషన్‌ను ఫీలవుతున్నారు' అని తెలిపారు.

నవచిత్రం

స్నేహం విలువ చాటే కృష్ణమ్మ



సత్యదేవ్

హీరో సత్యదేవ్ తాజాగా నటిస్తున్న చిత్రం 'కృష్ణమ్మ'. రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా ఈ మూవీ తెరకెక్కుతోంది. వి.వి.గోపాలకృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ పతాకంపై కొరటాల శివ సమర్పిస్తున్న సినిమా ఇది. కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 3న గ్రాండ్ లెవల్లో రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత కృష్ణ కొమ్మలపాటి మాట్లాడుతూ, 'రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. టైటిల్ కృష్ణమ్మ అని ఎందుకు పెట్టామో, సినిమా చూసినప్పుడు ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను సెలక్ట్ చేసుకుంటూ, ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు పొందిన సత్యదేవ్ కచ్చితంగా ఈ సినిమాతో మరో రేంజ్‌కి చేరుకుంటారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కి, పాటలకి చాలా మంచి స్పందన వస్తోంది. కాలభైరవ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి వేసవి కానుకగా మే 3న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

'స్నేహానికి ఉన్న విలువను ఈ చిత్రంలో చూపిస్తున్నాం. టైటిల్ సాంగ్‌లోనే హీరోకి, అతని స్నేహితుల మధ్య ఉండే అనుబంధాన్ని చూపించాం. ఇంటెన్స్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రం రూపొందుతోంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సమ్మర్‌కి ఓ బెస్ట్ సినిమా చూశామనే భావన ప్రేక్షకులకు తప్పక కలుగుతుంది' అని దర్శకుడు వి.వి.గోపాలకృష్ణ చెప్పారు.

ఈ సినిమాలో సత్యదేవ్‌కి జోడీగా అతీరారాజ్ నటించారు. లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘుకుంచె, నందగోపాల్ కీలక పాత్రల్లో నటించారు.

ఈ చిత్రానికి సమర్పణ - కొరటాల శివ, నిర్మాత - కృష్ణ కొమ్మలపాటి, రచన, దర్శకత్వం - వి.వి.గోపాలకృష్ణ, సంగీతం - కాల భైరవ, సినిమాటోగ్రఫీ - సన్నీ కూరపాటి, ఎడిటర్ - తమ్మిరాజు, ఆర్ట్ - రామ్ కుమార్, పాటలు - అనంత శ్రీరాం, ఫైట్స్ - పృథ్వీ శేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - రవి సూర్నెడ్డి.


స్ఫూర్తిదాయకంగా

అందుకోవా..పాట



రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్ పతాకం పై చల్లపల్లి చలపతిరావు దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్ పండు) దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'సారంగదరియా'. ఎం.ఎబెనెజర్ పాల్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ సినిమా నుంచి శుక్రవారం మేకర్స్ 'అందుకోవా...' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. హీరో నవీన్ చంద్ర చేతుల మీదుగా పాట విడుదలైంది. సాంగ్‌ను విడుదల చేసిన ఆయన చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ పాటను లెజెండ్రీ సింగర్ కె.ఎస్.చిత్ర ఆలపించారు. ఇదొక ఇన్‌స్పిరేషనల్ సాంగ్. రాంబాబు గోశాల పాటను రాశారు.

ఈ సందర్భంగా నిర్మాతలు ఉమాదేవి, శరత్ చంద్ర చల్లపల్లి మాట్లాడుతూ, 'చిత్రగారు మా పాటను పాడటం మాకెంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తాం' అని అన్నారు. 'ఒక మధ్యతరగతి ఫ్యామిలీలో జరిగిన కొన్ని ఘర్షణలతో కథ ఉంటుంది. చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి' అని డైరెక్టర్ పద్మారావు అబ్బిశెట్టి (పండు) చెప్పారు.



'దేవకీ నందన వాసుదేవ'లో అశోక్ గల్లా

అశోక్ గల్లా డబుల్ ధమాకా



అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ

'హీరో' చిత్రం తర్వాత అశోక్ గల్లా ప్రస్తుతం 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో 'దేవకీ నందన వాసుదేవ' చిత్రంలో నటిస్తున్నారు. లలితాంబిక ప్రొడక్షన్స్‌లో ప్రొడక్షన్ నెం.1గా ఎన్ఆర్ఐ (ఫిలిం డిస్ట్రిబ్యూటర్) సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పిస్తున్నారు. శుక్రవారం అశోక్ గల్లా పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు.

యువ హీరో అశోక్ గల్లా తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో చేయబోతున్నారు. సితార పతాకంపై ప్రొడక్షన్ నెం.27గా ఈ చిత్రం ప్రేమ, హాస్యం మేళవింపుతో ఈ తరం మెచ్చే అందమైన కథతో రాబోతుంది. 'మ్యాడ్' మూవీ ఫేమ్ శ్రీ గౌరీ ప్రియ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఉద్భవ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886